


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 24 ఆదివారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 340

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## సెప్టెంబర్ మొదటి వారంలో స్థానిక సమరం

- 29న మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం
- కేబినెట్ నిర్ణయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదన

హైదరాబాద్-నవభూమిబ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరు మొదటి వారంలో షెడ్యూలు వచ్చే అవకాశం ఉంది. ఈ నెల 29న మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి.. అందులో తుది నిర్ణయం తీసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించే వీలుంది. దీని ఆధారంగా ఎన్నికల సంఘం. సెప్టెంబరు మొదటి వారంలో నోటిఫికేషన్ ఇచ్చి నెలాఖరు లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శనివారం నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ ౦ (పీఏసీ) సమావేశంలో మూడు ప్రత్యామ్నాయాలపై చర్చించారు. చివరికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఐదుగురితో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు లేదా తరువాత తెచ్చిన ఆర్డినెన్సుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇది జరిగే అవకాశం తక్కువగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీ తరపున బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించేలా నిర్ణయం తీసుకొని ఎన్నికలకు వెళ్లడం దాదాపు ఖరారైనట్లేనని పార్టీ వర్గాల సమాచారం.

## రోదసి అన్వేషణకు సిద్ధం కండి

# ఏడాదిలో 50 రాకెట్లను ప్రయోగించగలరా

### భారత శాస్త్రవేత్తలను ప్రశ్నించిన ప్రధాని నరేంద్ర మోదీ

- చంద్రుడు, మార్స్ తర్వాత డీప్ స్పేస్ లక్ష్యం
- భవిష్యత్తు మిషన్ల కోసం ఆస్ట్రోనాట్ల బృందం సిద్ధం
- యువత అంతరిక్ష అన్వేషణలో భాగం కావాలి
- గెలాక్సీల రహస్యాలపై లోతైన అధ్యయనం అవసరం
- గగనయాన్ మిషన్ త్వరలో ప్రారంభం
- స్వంత అంతరిక్ష కేంద్రం నిర్మాణం దిశగా భారత్
- స్పేస్ టెక్నాలజీతో పంట బీమా, విపత్తు సహాయక చర్యలకు బలమైన మద్దతు



న్యూదిల్లీ-నవభూమి ప్రతినిధి

అంతరిక్ష శాస్త్రవేత్తలకు కొత్త ఛాలెంజ్ విసిరారు ప్రధాని మోదీ. రోదసి అన్వేషణ చేపట్టాలని ఆయన కోరారు. మానవాళి భవిష్యత్తు కోసం అంతరిక్ష రహస్యాలను ఛేదించాలని ఆయన శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సందేశం వినిపించారు. ఆయన తన సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్టు చేశారు. భవిష్యతులో చేపట్టబోయే అంతరిక్ష ప్రయోగాల కోసం ఆస్ట్రోనాట్ల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యువత దీనిలో భాగం కావాలన్నారు. అతి సుదీర్ఘ దూరంలో ఉన్న గెలాక్సీలు, అంతరిక్షం అధ్యయనం చేయాలన్నారు. చంద్రుడి మీదకు, మార్స్ మీదకు వెళ్లామని, డీప్ స్పేస్ అంశంలో మరింత లోతుగా అన్వేషణ చేపట్టాలని, మానవాళికి ఉపయోగపడే అనేక రహస్యాలు అక్కడ ఉంటాయన్నారు.అంతరిక్ష రంగంలో భారత్ ఒక్కొక్క మైలురాయి అందుకుంటోందని, ఇది దేశానికి గర్వకారణమన్నారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా.. అంతరిక్ష రంగంతో సంబంధం ఉన్న శాస్త్రవేత్తలు, యువతకు ఆయన విషెస్ తెలిపారు. సెమీ క్రయోజనిక్ ఇంజిన్లు, ఎలక్ట్రానిక్ ప్రొపల్షన్ లాంటి టెక్నాలజీ సంబంధిత అంశాల్లో భారత్ అత్యాధునికంగా దూసుకెళ్తోందన్నారు. భారత్ త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను లాంచ్ చేస్తుందని, రాబోయే రోజుల్లో స్వంత

## కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో నోట్ల గుట్టలు

- కర్ణాటక ఎమ్మెల్యే కేపీ వీరేంద్ర పప్పీను అరెస్టు చేసిన ఈడీ అధికారులు
- అక్రమ బెట్టింగ్,మనీలాండరింగ్ నెట్‌వర్క్‌తో సంబంధాలు
- సిక్కిం రాజధాని గ్యాంగ్ టక్‌లో కేపీ వీరేంద్ర పప్పీ అరెస్టు
- 2రోజులుగా 31 ప్రాంతాల్లో ఈడీ అధికారులు దాడులు
- దాడుల్లో రూ.12 కోట్ల నగదు, కోటి విలువ చేసే విదేశీ కరెన్సీ, రూ.6 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, 10 కిలోల వెండి వస్తువులు, 4 వాహనాల స్వాధీనం



# కొనకండి

### అమెరికాకు కేంద్ర మంత్రి జైశంకర్ వార్నింగ్

- నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనకండి
- భారత్ జాతీయ ప్రయోజనాలపై రాజీ లేదు
- రష్యా చమురు దిగుమతులు - ఆర్థిక భద్రత కోసమే
- సమస్య ఉంటే కొనవద్దు: జైశంకర్ స్పష్టం
- రైతులు, చిరు వ్యాపారుల ప్రయోజనాలే ప్రాధాన్యం
- అమెరికా సుంకాల విధానంపై ఘాటైన స్పందన
- వ్యాపార అనుకూలత పేరిట అమెరికాపై ఎద్దేవా



న్యూదిల్లీ-నవభూమి ప్రతినిధి

భారత్-అమెరికా సంబంధాలు, వాణిజ్య విధానాలు, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి వంటి కీలక అంశాలపై భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ది ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం 2025'లో పాల్గొన్న జైశంకర్.. అగ్రరాజ్యానికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. ముఖ్యంగా భారత్ నుంచి చమురు, శుద్ధి చేసిన ఉత్పత్తులు కొనడంలో అమెరికాకు ఏమైనా సమస్య ఉంటే.. వాటిని కొనడం మానేయాలని సూచించారు. దీనిపై ఎవరూ ట్రంప్‌ను బలవంత పెట్టడం లేదని అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించే విధానాలు సాంప్రదాయక దౌత్యానికి పూర్తి భిన్నంగా ఉంటాయని, వాటి ప్రభావం ప్రపంచ దేశాలపై గణనీయంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగానే... భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడంలో ఎప్పుడూ రాజీపడదని గట్టిగా చెప్పారు. ముఖ్యంగా భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 50 శాతం వరకు సుంకాలను విధిస్తామని ట్రంప్ చేసిన ప్రకటనపై జైశంకర్ ఘాటుగా స్పందించారు. ఈ విషయంలో భారత్ తన విధానాన్ని చాలా స్పష్టంగా చెప్పిందని.. దేశ రైతులు, చిరు వ్యాపారుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. "భారతీయ రైతుల ప్రయోజనాలను రక్షించాల్సిన అవసరం ఉందా లేదా అని ఎవరికైనా అనుమానం ఉంటే.. వారు ప్రజల ముందుకు వచ్చి తమ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పవచ్చు" అని సవాలు విసిరారు. "తాము వ్యాపార అనుకూల ప్రభుత్వం అని చెప్పుకునే అమెరికా పాలనా యంత్రాంగం, ఇతరులు వ్యాపారం చేస్తున్నారని ఆరోపించడం చాలా హాస్యాస్పదంగా ఉంది" అని జైశంకర్ ఎద్దేవా చేశారు. అలాగే భారత్ తన వాణిజ్య విధానాల్లో ఎటువంటి వెనకడుగు వేయదని, తన ప్రజల ప్రయోజనాలను గట్టిగా కాపాడుకుంటుందని అమెరికాకు

## ఆన్‌లైన్ గేమ్స్ నిషేధ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూదిల్లీ-నవభూమి ప్రతినిధి

ఆన్‌లైన్ గేమ్స్‌ని నిషేధిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టరూపంలోకి వచ్చింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్ యాప్‌లన్నిటినీ ఈ చట్టం నిషేధించింది. ఈ మనీ గేమింగ్‌లను ప్రమోట్ చేసిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా విధించడానికి చట్టం అవకాశం కల్పిస్తోంది.అటువంటి ప్లాట్‌ఫారాల తరపున ప్రచారం చేసిన వారికి సైతం 2 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు, 2025ని



రాజ్యసభ గురువారం 26 నిమిషాల్లో ఆమోదించగా అంతకుముందు రోజు లోక్‌సభ కేవలం 7 నిమిషాలలో ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించింది.

## 42% పార్టీ పరంగా సీట్లు బీసీలకు



- తెలంగాణలో స్థానిక సమరం... బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సరికొత్త వ్యూహం!
- తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం
- రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ రిజర్వేషన్ల సవరణ బిల్లు
- బిల్లు ఆమోదం ఆలస్యమవుతున్నందున ప్రత్యామ్నాయ మార్గం ఎంపిక
- పార్టీ పరంగానే ఎన్నికల బరిలోకి దిగాలని కాంగ్రెస్ యోచన

## ఆఫ్రికాలో ప్రపంచకప్ మెగా టోర్నీ!



- ప్రపంచకప్‌కు వేదికలు ఖరారు... 24 ఏళ్ల తర్వాత దక్షిణాఫ్రికాలో క్రికెట్ సమరం
- 2027 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా
- వేదికలను అధికారికంగా ప్రకటించిన క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్ఏ)
- దక్షిణాఫ్రికాలో 44, జింబాబ్వే, నమీబియాలో 10 మ్యాచ్‌ల నిర్వహణ
- దక్షిణాఫ్రికాలో మొత్తం 8 నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు
- టోర్నీ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ట్రెవర్ మాన్యుయల్ నియామకం

## సూపర్ సిక్స్‌ను ఎగతాళి చేశారు

### సాధ్యం చేసి చూపించాం: ఏపీ సీఎం

అమరావతి-నవభూమి ప్రతినిధి

కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఎగతాళి చేశారని, వాటిని అమలు చేయడం సాధ్యం కాదన్నారని, అయితే తాము వాటిని



అమలు చేసి చూపించామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. చంద్రబాబు తాజాగా పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించారు.

2లో



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





## పోలీసులంతా ఒక్కటే.. ఉమెన్ పదం అవసరం లేదు

హైదరాబాద్-నవభూమి:ఉమెన్ పోలీసులో ఉమెన్ అన్న పదాన్ని వాడకుండా ఉండాలనే ఆలోచనతో తాను ఏకీభవిస్తున్నానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క(అన్నారు. పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న మహిళలకు తగిన అవకాశాలతో పాటు వారి ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముందన్నారు. రాజా బహదూర్ వెంకటరామారెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన మూడు రోజుల మొదటి మహిళా పోలీసు అధికారుల రాష్ట్రస్థాయి సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అంకిత భావంతో పనిచేసే సీఎం, కేబినెట్ అందుబాటులో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంచేందుకు అంకిత భావంతో కృషి చేస్తున్న పోలీసుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. తెలంగాణలో తీసుకువచ్చిన నూతన యంగ్ ఇండియా స్కూల్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. యంగ్ ఇండియా స్కూల్స్ ద్వారా పోలీసుల పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మూడు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో తీసుకున్న లింగ సమానత్వం, రివార్డ్స్, డ్రెస్ కోడ్, సెలవులు వంటి అంశాలపై సానుకూలంగా స్పందించారు. డీజీపీ డాక్టర్ జితేందర్, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిగుప్తా, చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితరులు మాట్లాడారు. కానిస్టేబుల్ నుంచి డీజీ స్థాయి వరకు 408 మంది మహిళా సిబ్బంది పాల్గొని తమ గళాన్ని వినిపించారన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## నవ వార్త



## ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం.. ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు



హైదరాబాద్-నవభూమి:తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహా ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు అందాయి.బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలు, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం ఈ పిటిషన్లపై జూలై 31న తుది తీర్పు వెలువరించింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసింది. విచారణకు ప్రభుత్వంలో ఉన్నవారు ఎవరూ ఆటంకాలు కలిగించరాదని, సాకులు చెప్పి విచారణను వాయిదా వేస్తే అది రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని కోర్టు స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలందరూ ఏదో ఒక రోజు అనర్హత విచారణను ఎదుర్కోవాల్సిందేనని వ్యాఖ్యానించింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదులపై వివరణ ఇవ్వాలని కోరుతూ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై స్పందించిన కృష్ణమోహన్ రెడ్డి.. తనకు నోటీసులు అందిన విషయాన్ని ధృవీకరించారు. అయితే, తాను పార్టీ మారలేదని, కాంగ్రెస్‌లోకి వెళ్లలేదని స్పష్టం చేశారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశానని, తాను ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని తెలిపారు. తన తరఫు న్యాయవాదుల ద్వారా త్వరలోనే నోటీసులకు సమాధానం ఇస్తానని చెప్పారు.ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత స్పీకర్ చర్యలు ప్రారంభించడంతో ఈ కేసు ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

## యూరియా సమస్యకు చెక్ పెట్టేందుకు సర్కార్ కీలక చర్యలు



హైదరాబాద్-నవభూమి:ప్రస్తుతం తెలంగాణలో రైతంగాన్నే కాక రాజకీయాల్లో కూడా యూరియా సమస్య ప్రకంపనలు సృష్టిస్తోంది. యూరియా కోసం రైతులు.. క్యూ లైన్లలో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. దీనిపై విపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నాయి. ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అని మండిపడుతున్నాయి. అయితే తమ విన్నపాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కేంద్రం ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేసిందని.. రాష్ట్ర ప్రభుత్వమే దాన్ని బ్లాక్‌లో అమ్ముకుంటుందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అన్నదాతలు కూడా యూరియా కొరత మీద ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.యూరియా సమస్య తీవ్రమవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దీని పరిష్కారం కోసం రంగంలోకి దిగింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక చర్యలకు పూనుకున్నారు. యూరియాను సరఫరా చేయడంలో ఆలస్యానికి తావు లేకుండా.. దాన్ని వెంట వెంటనే కేంద్రాలకు తరలించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ వారిని అప్రమత్తం చేస్తున్నారు. దీంతో పాటు కొన్ని జిల్లాల్లో లారీ అసోసియేషన్స్ మధ్య పోటీ ఏర్పడి.. యూరియా రవాణా నిలిచిపోయింది. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ట్రాన్స్‌పోర్ట్ సమస్యను స్వయంగా మాట్లాడి పరిష్కరిస్తున్నారు.అలానే రాష్ట్రంలోని రామగుండం యూరియా ఫ్యాక్టరీ యాజమాన్యంతో కూడా మంత్రి తుమ్మల నిరంతర సంప్రదింపులు జరుపుతున్నారు. నేడు అనగా శనివారం నాడు మంత్రి తుమ్మల రామగుండం ఫ్యాక్టరీ ఎండీని కలవనున్నారు. కాగా, సాంకేతిక సమస్య కారణంగా రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఇక్కడ యూరియా ఉత్పత్తి ప్రారంభం అయితే.. రాష్ట్రంలో యూరియా సమస్య కొంతైనా తీరే అవకాశం ఉందని సర్కార్ భావిస్తోంది. ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు రెడీ అవుతోంది.తెలంగాణ అన్నదాతలు ఎదుర్కొంటున్న యూరియా సమస్య పరిష్కారం కోసం కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు వేదికగా గళమెత్తారు. యూరియా సమస్యను పరిష్కరించాలంటూ.. రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళనకు దిగారు. ప్రియాంక గాంధీ కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలానే బీఆర్ఎస్ ఎంపీలు కూడా యూరియా సమస్యను పరిష్కరించాలంటూ కేంద్రాన్ని కోరారు. ఈ క్రమంలో రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర గురువారం ఢిల్లీలో కేంద్ర ఎరువులు రసాయనాల మంత్రి జేపీనడ్డాను కలిసి.. తెలంగాణలో తీవ్రమవుతున్న యూరియా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు.

## ఓయూ పరిధిలో వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

హైదరాబాద్-నవభూమి: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్) ఫైవ్ ఇయర్ ఇంటిగ్రేటెడ్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రామ్ రెండు, నాలుగు, ఆరు, ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఫార్మసీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో నోట్ల గుట్టలు

హైదరాబాద్-నవభూమిబ్యూరో

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర పప్పీ అరెస్ట్ అయ్యారు. ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. అక్రమ బెట్టింగ్, మనీలాండరింగ్ నెట్‌వర్క్‌తో సంబంధ ఉందనే ఆరోపణల నేపథ్యంలో ఈ అరెస్టు చోటు చేసుకుంది. సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. చిత్రదుర్గ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యాన్ని వహిస్తోన్నారు. దేశవ్యాప్తంగా రెండు రోజుల పాటు 31 ప్రాంతాల్లో ఈడీ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చేతికి చిక్కిన సాక్ష్యాధారాల ఆధారంగా వీరేంద్రను అరెస్ట్ చేశారు. ఈ దాడులతో- దుబాయ్ కంపెనీలు- దేశంలోని పలు క్యాసినోలతో సంబంధాలు ఉన్న అతి పెద్ద బెట్టింగ్ సామ్రాజ్యం వెలుగులోకి వచ్చినట్టయింది. ఈ నెల 22, 23 తేదీలలో ఈడీ అధికారులు బెంగళూరు, హుబ్లీ, చిత్రదుర్గ, ముంబై, జోధ్‌పూర్, గోవా, గ్యాంగ్‌టక్‌లలో పెద్ద ఎత్తున సోదాలను నిర్వహించారు. అలాగే- అయిదు ప్రముఖ క్యాసినోలు బిగ్ డాడీ, ఓషన్ రివర్స్, పప్పీస్ ప్రైడ్, ఓషన్ 7, పప్పీస్ గోల్డ్‌లల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 12 కోట్ల రూపాయలనగదు, ఆరు కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు.దుబాయ్ కు చెందిన కొన్ని సంస్థలతో సంబంధం ఉన్న అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లను వీరేంద్ర నడుపుతున్నట్లు తేలింది. కింగ్567, రాజా 567 అనే అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లను సైతం వీరేంద్ర పప్పీ నడుపుతున్నట్లు నిర్ధారించారు. ఆయన సోదరుడు కేసీ తిప్పేస్వామి డైమండ్ సోఫ్ టెక్, టీఆర్ఎస్ టెక్నాలజీస్, ప్రైమ్9 టెక్నాలజీస్ అనే మూడు దుబాయ్ ఆధారిత సంస్థల ద్వారా బ్యాక్ ఎండ్ నుంచి కార్యకలాపాలను నిర్వహించినట్లు ఈడీ అధికారులు తాజాగా వెల్లడించారు. ఈ కంపెనీలన్నీ కూడా గేమింగ్ కాల్ సెంటర్లను నడుపుతూ, అక్రమంగా అంతర్జాతీయ స్థాయిలో మనీలాండరింగ్ చేశాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడుల్లో భారీ ఎత్తున ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు ఈడీ అధికారులు. 12 కోట్ల రూపాయల నగదు,

# పీఎస్ ఎదుట సహస్ర తల్లి ప్రశ్నల వర్షం



హైదరాబాద్-నవభూమి: హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. పీఎస్ ఎదుట కూకట్‌పల్లిలో హత్యకు గురైన సహస్ర పేరెంట్స్, బంధువులు బైఠాయించారు. అసలైన దోషులను తప్పించారంటూ ఆరోపించారు. నిందితుడికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేస్తున్నారు. సహస్ర తల్లి రేణుక స్టేషన్ ఎదుట గుండెలవిసేలా రోధించారు. 'నా కూతుర్ని హత్య చేసినట్లు ఆ అబ్బాయిని హత్య చేయాలి. నా మీద, నా భర్త మీద ఎన్నో ఆరోపణలు చేశారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతుర్ని మేము చంపుకున్నామని నా మీద విమర్శలు చేశారు. నా కొడుకు ఆలోచన తీరు మారింది. ఒక్క బ్యాట్ కోసం ఇంత దారుణానికి ఒడిగడతాడా. మొబైల్ తీసుకొచ్చినప్పుడే తల్లిదండ్రులు పరిశీలించి ఉంటే ఈ రోజు నా కూతురికిలా అయ్యేది కాదు. అక్కను చంపిన వాడిని నేను చంపుతాను అంటూ నా కొడుకు మాట్లాడుతున్నాడు. ఈ విషయంలో మైనర్ అబ్బాయి తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంది. మాకు న్యాయం జరగాలి.. నిందితుడిని మా ముందుకు తీసుకురావాలి.' అని సహస్ర తల్లి వాపోయింది.ఆందోళన తీవ్రతరం కావడంతో సహస్ర తల్లిదండ్రులని, కుటుంబ సభ్యుల్ని పోలీసులు మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. నిరసనతో మూసాపేట్ నుంచి జేఎన్టీయూ వరకు భారీగా ట్రాఫిక్ జాం అయింది. సహస్ర తల్లిదండ్రులు, ఆందోళనకారులతో పోలీసులు చర్చిస్తున్నారు. కచ్చితంగా న్యాయం చేస్తామని పోలీసులు చెప్పడంతో సహస్ర కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.ఇలా ఉంటే, సహస్ర తండ్రి కృష్ణ సంచలన ఆరోపణలు చేశారు. 'క్రికెట్ బ్యాట్ కోసం కాదు, ఇంట్లోని డబ్బు కోసమే బాలుడు వచ్చాడు. సహస్ర హత్య వెనుక బాలుడి తల్లిదండ్రుల ప్రమేయం ఉంది. న్యాయం జరగకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటాం. కేసును పోలీసులు తప్పుదోవ పట్టిస్తున్నట్టు అనుమానం ఉంది. పోలీసులు మరోసారి దర్యాప్తు చేయాలి' అని సహస్ర తండ్రి కృష్ణ డిమాండ్ చేశారు.

సహస్ర హత్య అనంతరం అనుమానంతో బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వయసు 15 ఏళ్లే అయినప్పటికీ.. విచారణలో మాత్రం అతడు క్రిమినల్ ఇంటెలిజెంట్‌లా వ్యవహరించి పోలీసులను తప్పుదోవ పట్టించాడని బాలానగర్ డీసీపీ వెల్లడించాడు. ఆధారాల్లేకుండా హత్యచేసి పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన బాలుడు.. చివరికి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సమాచారంలో అడ్డంగా దొరికిపోయాడు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ను విచారించగా.. హత్య జరిగిన రోజున ఓ బాలుడు గోడదూకి అపార్ట్‌మెంట్‌లోకి రావడాన్ని గమనించినట్లు వాంగ్మూలం ఇచ్చాడు. ఈ దిశలో పోలీసులు దర్యాప్తు చేయగా బాలుడే హంతకుడనే స్పష్టమైంది.అనంతరం బాలుడు సహస్రను హత్య చేసినట్లు అంగీకరించాడు. క్రికెట్ బ్యాట్ కొనుక్కోవాలని బాలిక ఇంటికి చోరీ కోసం వెళ్లానని.. తర్వాత కత్తితో ఆమెను హత్య చేసి ఇంటికొచ్చి కత్తిని శుభ్రంగా కడిగానని ఒప్పుకున్నాడు. టీషర్ట్‌కు రక్తపు మరకలు అంటడంతో వాషింగ్ మెషీన్లో వేశానని చెప్పాడు. క్రైమ్ మూవీస్ చూసే అలవాటు ఉందని.. దొంగతనం చేయడం, తప్పించుకోవడంపై ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశానని వెల్లడించాడు. చోరీకి రెండు రోజుల ముందే బాలుడు ప్లాన్ వేసుకున్నాడు. అలాగే, చోరీలు, హత్యల గురించి బాలుడు రాసుకున్న పుస్తకాన్ని, హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం బాలుడిని జువైనల్ హోంకు తరలించారు.

సహస్ర తండ్రి మీడియాతో మాట్లాడుతూ, తన కూతుర్ని చంపిన బాలుడికి ఉరి శిక్ష విధించాలని విజ్ఞప్తి చేశాడు. అతడికి ఏ మాత్రం భయం, పశ్చాతాపం లేవని.. పెద్దవాళ్ల తరహాలో హత్యకు పాల్పడినందుకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాడు. కాగా, నిందితుడి తల్లి తల్లి సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా.. తండ్రి ఏ పని చేయడం లేదు. అతడికి ఇద్దరు అక్కలు ఉన్నట్లు సమాచారం.

# హైదరాబాద్‌లో ఓపెన్ ఏఐ కంపెనీకి కేటీఆర్ ఆహ్వానం..



హైదరాబాద్-నవభూమి: OpenAI తన కార్యకలాపాలు ప్రారంభించడానికి హైదరాబాద్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నుంచి భారతదేశ కార్యకలాపా లను ప్రారంభించాలని ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్‌కి ఆయన విజ్ఞప్తి చేశారు. భారత దేశంలో త్వరలో కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పిన OpenAI CEO సామ్ ఆల్ట్‌మన్‌కి హైదరాబాద్ నుంచి కంపెనీ కార్యకలాపాలు ఏర్పాటు చేయాలని ఎక్స్ వేదికగా కేటీఆర్ కోరారు.

వచ్చేనెల భారత్‌లో పర్యటిస్తున్నానని తెలిపిన సామ్ ఆల్ట్‌మన్‌కి హైదరాబాద్ నగరానికి కేటీఆర్ స్వాగతం పలికారు. హైదరాబాద్‌ను భారతదేశానికి సరైన ప్రవేశ ద్వారంగా, OpenAI లాంటి సంస్థలకు ఆదర్శవంతమైన కేంద్రంగా అభివర్ణించారు. ఈ నగరం భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందని, ఇందులో T-Hub, WE-Hub, T-Works తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ వంటివి ఉన్నాయని చెప్పుకొచ్చారు.

హైదరాబాద్ ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా, ఆపిల్, క్వాల్‌కామ్ లాంటి అనేక గ్లోబల్ టెక్ దిగ్గజాలకు కేంద్రంగా మారిందని, ఇక్కడ సాంకేతిక, స్టార్టప్ రంగాలలో అపారమైన ప్రతిభ ఉందని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంగా తెలంగాణ ప్రభుత్వం, భారతదేశానికి %AI% రాజధానిగా రాష్ట్రం మారడానికి అనేక సాహసోపేతమైన చర్యలు తీసుకుందని, ఇందులో 2020ని "ఇయర్ ఆఫ్ %AI%µ' గా ప్రకటించడం అనేక %AI%-ఆధారిత కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటివి ఉన్నాయని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న ప్రతిభ, ఇన్నోవేషన్, నూతన ఆవిష్కరణలు, గ్లోబల్ కనెక్టివిటీల కలయికతో %ూ×% విప్లవాన్ని ముందుకు నడిపిస్తుందని కేటీఆర్

# మట్టి గణపతులపై మనసేది..



హైదరాబాద్-నవభూమి:పర్యావరణంతో పాటు భూగర్భ జలాశాయాలను కలుషితం చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) గణేశ్ విగ్రహాలను వాడొద్దని, వినాయక చవితి సందర్భంగా వాడవాడలా పర్యావరణ హిత మట్టి గణపతినే వాడాలని ఉన్నత న్యాయ స్థానాలు, పలు స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా భారీ ఎత్తున గణేశ్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు.వాటిలో ఎక్కువగా పీవోపీ విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించడానికి అల్వాల్ సర్కిల్ పరిధిలోని యువజన సంఘాలు, అపార్ట్‌మెంట్, కాలనీ సంఘాలు సమాయత్తమవుతున్నాయి. గతంలో పండగకు 10 రోజుల మందే జీహెచ్ఎంసీ అధికారుల ఆ?ధ్వర్యంలో మట్టి గణేశ్‌ల వాడకంపై ప్రచార కార్యక్రమాలను చేపట్టేవారు. ఇప్పుడు ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో ఏ సర్కిల్ పరిధిలో కూడా పెద్దగా కనిపించకపోవడం గమనార్హం.

పర్యావరణ పరిరక్షణపైన ప్రచారం చేయాల్సిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులు ఈ దిశగా చొరవ చూపడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. మట్టి గణపతులను వాడకంపై గతంలో కరపత్రాలతో పీసీబీ అధికారులు ప్రచారం చేసి పీవోపీ వాడకం ద్వారా నీటి వనరులు ఏవిధంగా కలుషితం అవుతాయో వివరించేవారు. ప్రస్తుతం ఎక్కడా కూడా ఈవిధంగా ప్రజలను చైతన్యం పరుస్తున్న దాఖాలాలు కనిపించడంలేదు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు అల్వాల్‌లోని కొత్తచెరువు, చినరాయుని చెరువు, హస్మత్‌పేట్ చెరువులు నిండు కుండల్లా మారియి. ప్రస్తుతం పెద్ద ఎత్తున పీసీబీ తయారు చేసిన గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. కొన్ని చెరువుల వద్ద కొలనులు లేకపోవడంతో వారంతా చెరువుల్లోనే నిమజ్జనం చేస్తారు. దీంతో భూగర్భ జలాశయాలు కలుషితం కావడమే కాకుండా చెరువుల్లో ఉండే జలాచరాలు చనిపోయే ప్రమాదం ఉంది.

## ప్రిన్సిపాల్‌పై కోపంతో మంచినీళ్ల ట్యాంకులో పురుగుల మందు కలిపిన టీచర్



భూపాలపల్లి-నవభూమి : ప్రిన్సిపల్‌పై కోపంతో మంచినీళ్ల ట్యాంకులో పురుగుల మందు కలిపాడో టీచర్. ఆ నీళ్లు తాగిన విద్యార్థులు దవాఖాన పాలయ్యారు. భూపాలపల్లి పట్టణంలో సుభాష్ కాలనీలో ఉన్న అర్బన్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో కలుషిత నీరు తాగడంతో 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం రవ్వతో చేసిన టిఫిన్‌ను తిన్న తర్వాత వారంతా వాంతులు చేసుకున్నారు. దీంతో పాఠశాల సిబ్బంది వారిని జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. ప్రిన్సిపల్ ఫిర్యాదుతో కలెక్టర్‌తోపాటు ఎస్పీ విచారణ చేపట్టారు. ఈ క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.పాఠశాలలోని ఆర్వోప్లాంట్‌కు సంబంధించిన కెమికల్స్ ద్వారా తాగునీరు ఏమైనా కలుషితమైందా అనే విషయాన్ని తెలుసుకునేందుకు డీఎంహెచ్ఓ గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు.

తాగునీటిని ఓ బాటిల్ లో శాంపిల్ తీసి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఈ క్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వెంకటనర్సయ్యపై కోపంతో మంచినీళ్ల ట్యాంక్‌లో ఉపాధ్యాయుడు రాజేందర్ పురుగుల మందు కలిపినట్లు గుర్తించారు. దీంతో రాజేందర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని విచారిస్తున్నారు.

## 42% పార్టీ పరంగా సీట్లు బీసీలకు

(1వపేజీ తరువాయి)తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఈ క్రమంలో, అధికార కాంగ్రెస్ పార్టీ తన తరఫున పోటీ చేసే అభ్యర్థుల్లో 42 శాతం సీట్లను బీసీ వర్గాలకు కేటాయించి ఎన్నికల బరిలోకి దిగనుంది.

రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం రూపొందించిన బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఎన్నికలను ఆలస్యం చేయడం సముచితం కాదని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో, చట్టపరమైన ఆమోదం కోసం వేచి చూడకుండా పార్టీ స్థాయిలో రిజర్వేషన్లను అమలు చేసి ప్రజాతీర్పు కోరాలని నిర్ణయించింది.

ఈ నిర్ణయంతో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసే స్థానాల్లో 42 శాతం టికెట్లను బీసీ అభ్యర్థులకే కేటాయించనుంది. బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూనే, ఎన్నికల ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది.గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పీఏసీ, టీపీసీసీ అడ్వైజరీ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై చర్చించినట్లు సమాచారం.

## సూపర్ సిక్స్‌ను ఎగతాళి చేశారు

(1వపేజీ తరువాయి)సీఎంకు స్థానిక నాయకులు, ప్రజలు అఖండ స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు.కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఎగతాళి చేశారని, వాటిని అమలు చేయడం సాధ్యం కాదన్నారని, అయితే తాము వాటిని అమలు చేసి చూపించామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. చంద్రబాబు తాజాగా పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించారు. సీఎంకు స్థానిక నాయుకులు, ప్రజలు అఖండ స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు. 2047 నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరి మోహంలో ఆనందం చూడాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.'గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది కానీ చెత్త ఎత్తే కార్యక్రమం చెయ్యలేదు. కూటమి ప్రభుత్వం ఏడు నెలలుగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇంట్లో చెత్త బయట పడేయటం వలన అంటూ వ్యాధులు ప్రభలుతున్నాయి. అక్టోబర్ రెండో తేదీలోపు 85టన్నుల చెత్తను సేకరిస్తాం. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది. 2047 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరి మోహంలో ఆనందం చూడాలి' అని చంద్రబాబు అన్నారు. 'ఉమ్మడి జిల్లా వాసులు చాలా సౌమ్యులు. ఇలాంటి చోట కూడా గతంలో రౌడీయిజం చేశారు. మేం పెద్దాపురంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంటును ప్రారంభించబోతున్నాం. వర్షాకాలంలో దోమల వల్ల రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. డ్రోన్స్ ఉపయోగించి రాష్ట్రంలో దోమల సమూల నివారణకు చర్యలు తీసుకుంటాం. సూపర్ సిక్స్‌ను ఎగతాళి చేశారు. సాధ్యం కాదు అన్నారు. సాధ్యం చేసి చూపించా. 2027లో పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమృత్ పథకంలో పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో 75 కోట్ల రూపాయలతో ఇంటింటికి మంచినీటి కుళాయి వేయిస్తాం. ఎన్డీఏకు పెద్దాపురం నియోజకవర్గం కంచుకోట. ఇక్కడ మరొకరికి అవకాశం ఇవ్వకూడద'ని చంద్రబాబు పేర్కొన్నారు.

## కొనకండి..అమెరికాకు కేంద్ర మంత్రి

(1వపేజీ తరువాయి)స్పష్టమైన సందేశం ఇచ్చారు. అంతేకాకుండా ఉక్రెయిన్-రష్యా యుద్ధం నుంచి నేపథ్యంలో రష్యా చమురు దిగుమతులు తగ్గించాలని అమెరికా, దాని మిత్ర దేశాలు భారత్‌పై ఒత్తిడి తెచ్చినప్పటికీ.. భారత్ తన వైఖరిని మార్చుకోలేదని గుర్తు చేశారు.భారత్ నుంచి చమురు లేదా శుద్ధి చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో మీకు సమస్య ఉంటే.. దాన్ని కొనడం మానేయవచ్చని జైశంకర్ కుండబద్దలు కొట్టారు. కొనమని ఎవరూ మిమ్మల్ని బలవంతం చేయడం లేదని కూడా వివరించారు. రష్యా నుంచి చమురు కొనాలన్న భారత్ నిర్ణయం ఆర్థిక భద్రత, దేశీయ ఇంధన అవసరాలపై ఆధారపడి ఉందని.. ఇది ఏ ఇతర దేశం సూచనల మేరకు తీసుకోబడింది కాదని జైశంకర్ పునరుద్ఘాటించారు. అంతకుముందు మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన నాలుగు రోజుల వివాదంపై అమెరికా జోక్యం చేసుకుందని ట్రంప్ చేసిన ఆరోపణలను కూడా జైశంకర్ పూర్తిగా తోసిపుచ్చారు. "భారత్-పాకిస్థాన్ సంబంధాలలో మధ్యవర్తిత్వాన్ని భారత్ ఏనాడూ అంగీకరించదన్నారు. గతంలోనూ అనేక సందర్భాల్లో అమెరికా మధ్యవర్తిత్వం వహిస్తానని ప్రకటించినా.. భారత్ ఎప్పుడూ దాన్ని ఒప్పుకోలేదని ఆయన వివరించారు.

## 50 రాకెట్లను యోగించగలరా?

(1వపేజీ తరువాయి)అంతరిక్ష కేంద్రాన్ని ఇండియా నిర్మిస్తుందని ప్రధాని చెప్పారు. భారత పరిపాలనా వ్యవస్థలో స్పేస్ టెక్నాలజీ అధిక భాగంగా మారిందన్నారు. పంట బీమా పథకాలు, మత్స్యకారుల రక్షణ, విపత్తు సహాయక చర్యలన్నీ ఇప్పుడు శాటిలైట్ ఆధారితంగా జరుగుతున్నట్లు ఆయన వెల్లడించా. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి.. దేశ సాధారణ ప్రజల జీవితాలను మరింత సులభతరం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

## ఆఫ్రికాలో ప్రపంచకప్ మెగా టోర్నీ

కేప్‌టౌన్-నవభూమి: క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2027 ఐసీసీ పురుషుల ప్రపంచకప్‌కు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. ఈ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనుండగా, మ్యాచ్‌లు జరిగే వేదికలను క్రికెట్ దక్షిణాఫ్రికా అధికారికంగా ఖరారు చేసింది. సుమారు 24 ఏళ్ల తర్వాత ఆఫ్రికా గడ్డపై ఈ మెగా ఈవెంట్ జరగనుండటం విశేషం. టోర్నమెంట్‌లో సింహభాగం, అంటే 44 మ్యాచ్‌లకు దక్షిణాఫ్రికానే ఆతిథ్యం ఇవ్వనుంది. దేశంలోని 8 ప్రధాన నగరాలను ఎంపిక చేశారు. జొహన్నెస్‌బర్గ్, ప్రిటోరియా, కేప్ టౌన్, డర్బన్, గెక్‌బెర్హా, బ్లూమ్‌ఫాంటైన్, ఈస్ట్ లండన్, పార్ల్ నగరాల్లోని స్టేడియాలు ఈ మ్యాచ్‌లకు వేదికలు కానున్నాయి. మిగిలిన 10 మ్యాచ్‌లను సహ-ఆతిథ్య దేశాలైన జింబాబ్వే, నమీబియాలలో నిర్వహించనున్నట్లు సీఎస్ఏ స్పష్టం చేసింది.సీఎస్ఏ అధ్యక్షుడు రీహాన్ రిచర్డ్స్ మాట్లాడుతూ, "ఈ ప్రపంచకప్ ద్వారా కొత్త అభిమానులను ఆకట్టుకోవడంతో పాటు, డిజిటల్ ఆవిష్కరణలతో అభిమానులను భాగస్వాములను చేస్తామన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్
ఆదివారం
24 । ఆగస్టు । 2025

# కొల్హాపూర్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ.. 10 మందికి గాయాలు, వాహనాలకు నిప్పు

**ముంబై-నవభూమి:** మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో రెండు వర్గాల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకున్నది. సిద్ధార్థనగర్‌లో ఈ ఘటన జరిగింది. రెండు గ్రూపులు తగాదాకు దిగాయి. ఆ తర్వాత రాళ్లు రువ్వుకున్నారు. విధ్వంసం సృష్టించారు. వాహనాలకు నిప్పుపెట్టారు. ఘర్షణల్లో 10 మంది గాయపడ్డారు. రాజ్‌భాగేశ్వర్ ఫుట్‌బాల్ క్లబ్ 31 ఏళ్ల సంబరాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఆర్గనైజ్ చేసింది. ఫ్లెక్సీ బ్యానర్లు, పోస్టర్లు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసింది. దీని పట్ల స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. అయితే ఆ



సమయంలో రెండు గ్రూపుల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది.రాత్రి 10 గంటల సమయంలో రెండు గ్రూపులు రాళ్లు రువ్వుకున్నాయి. రెండు కార్లకు నిప్పుపెట్టారు. కార్లు, ఆటోలను ధ్వంసం చేశారు. రాళ్ల దాడిలో వాహనాలు ధ్వంసం అయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. సుమారు 200 మందిని మోహరించారు. రెండు గ్రూపుల మధ్య తప్పుడు అవగాహనతో ఘర్షణ జరిగినట్లు భావిస్తున్నారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కొల్హాపూర్ ఎస్పీ కోరారు.

## ఫ్యాన్‌పేజ్‌లో ఫొటో చూసి.. ఎంపీతో నా ప్రేమ అలా మొదలైంది.. లవ్‌స్టోరీ రివీల్ చేసిన రింకూ సింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా యువ క్రికెటర్ రింకూసింగ్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్న విషయం తెలిసిందే. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్ తో ఏడడుగులు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ జంటకు ఇప్పటికే నిశ్చితార్థం కూడా జరిగిపోయింది. కానీ, రింకూ క్రికెట్ కమిట్‌మెంట్‌లతో పెండ్లిని కొన్ని రోజులు వాయిదా వేశారు. ఇక ప్రియతో లవ్‌స్టోరీని రింకూ తాజాగా రివీల్ చేశారు.ఓ ఇంటర్వ్యూలో రింకూ సింగ్ మాట్లాడుతూ.. 2022లో కొవిడ్ సమయంలో ముంబైలో ఐపీఎల్ మ్యాచ్ జరిగినప్పుడు ప్రియతో ప్రేమ మొదలైనట్లు వెల్లడించారు. '2022లో కొవిడ్ సమయంలో ముంబైలో ఐపీఎల్ మ్యాచ్ జరిగినప్పుడు ప్రియతో నా ప్రేమ మొదలైంది. నాకు ఓ ఫ్యాన్ పేజ్ ఉండేది. అందులో ప్రియ ఫొటో చూసి ఇష్టపడ్డా. ఆమె నాకు సరిగ్గా సరిపోతుందని అనుకున్నా. మెసేజ్ చేద్దాం అనుకున్నా. కానీ అది మంచి పద్ధతికాదని ఆగిపోయా. కొన్ని రోజులకు ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫొటోలను ప్రియ లైక్ చేసినట్టు గుర్తించా. అప్పుడే ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ చేశా. అలా రోజూ మాట్లాడుకోవడం మొదలైంది.అలా కొంతకాలం గడిచాక కలిసి జీవితాన్ని పంచుకోవాలనే అభిప్రాయానికి వచ్చాం. ప్రియ ఎంపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా మా ప్రేమలో ఎలాంటి మార్పూ లేదు. మొదట్లో చాలా ఎక్కువగా మాట్లాడుకునేవాళ్లం. కానీ ఇప్పుడు టైమ్ దొరకట్లేదు. ప్రియ ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ ఉండటం, పార్లమెంట్ సమావేశాలకు హాజరుకావడం, నేను కూడా మ్యాచ్‌లతో బిజీగా ఉండటంతో మాట్లాడుకోవడానికి ఎక్కువ సమయం దొరకడం లేదు. అందుకే రాత్రిసమయంలో కాసేపు సరదాగా మాట్లాడుకుంటాం' అంటూ రింకూ తన లవ్‌స్టోరీని రివీల్ చేశారు.జూన్ 8వ తేదీన రింకూసింగ్, ప్రియా సరోజ్‌ల నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. లక్నోలోని ప్రముఖ హోటల్‌లో అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు రాజకీయ, క్రీడారంగ ప్రముఖులు హాజరయ్యారు. ఇరువురు కుటుంబసభ్యుల సమక్షంలో రింకూ, ప్రియ ఉంగరాలు మార్చుకున్నారు. ఇక ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ ఏడాది నవంబర్ 19న వీరి వివాహం జరగాల్సి ఉంది. అయితే, నవంబర్‌లో రింకూ క్రికెట్ కమిట్‌మెంట్‌తో పెండ్లిని వాయిదా వేసుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి వివాహం జరుగనున్నట్టు రింకూ కుటుంబీకులు తెలిపారు.

## తరగతి గదిలో నిద్రపోయిన చిన్నారి.. తాళం వేసి వెళ్లిపోయిన సిబ్బంది.. కిటికీలో ఇరుక్కుపోయి రాత్రంతా నరకయాతన



**కియోంఝర్-నవభూమి:** పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం ఓ చిన్నారి ప్రాణాల మీదకు తెచ్చింది. రాత్రంతా తరగతి గదిలోనే నరకయాతన అనుభవించాల్సి వచ్చింది. బయటపడే ప్రయత్నంలో కిటికీ గ్రిల్ మధ్య ఇరుక్కుపోయితీవ్రంగా గాయపడింది. ఈ హృదయ విదారక ఘటన ఒడిశా లోని కియోంఝర్ జిల్లాలో వెలుగు చూసింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోత్స్న దెహూరి అనే ఎనిమిదేళ్ల చిన్నారి బన్స్పాల్ బ్లాక్ పరిధిలోని అంజార్‌లో గల ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. గురువారం రోజున పాఠశాలకు వచ్చిన చిన్నారి స్కూల్ ముగిసే సమయానికి క్లాస్ రూమ్ బెంచ్‌పై నిద్రలోకి జారుకుంది. పాఠశాల ముగియడంతో పిల్లలంతా వెళ్లిపోయారు. అయితే చిన్నారి లోపల ఉన్న విషయాన్ని గమనించని సిబ్బంది క్లాస్ రూమ్‌కు తాళం వేసి వెళ్లిపోయారు.మెలుకవలోకి వచ్చిన చిన్నారి బయటపడేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. ఈ క్రమంలో కిటికీ రెయిలింగ్‌లో తల ఇరుక్కుపోయింది. దీంతో రాత్రంతా చిన్నారి నరకయాతన అనుభవించింది. ఇక రాత్రి అయినా పాప ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. గ్రామస్థులతో కలిసి చిన్నారి జాడ కోసం తీవ్రంగా గాలించారు. పాప ఎక్కడా కనిపించలేదు. ఉదయం పాఠశాలవైపు వెళ్లిన గ్రామస్థులకు గది కిటికీ రెయిలింగ్ మధ్య ఓ చిన్నారి ఇరుక్కుని కనిపించింది.వెంటనే అప్రమత్తమైన గ్రామస్థులు అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న సహాయక బృందాలు తీవ్రంగా శ్రమించి చిన్నారిని క్షేమంగా బయటకు తీశారు. అనంతరం పాపను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ఘటనపై పాఠశాల ఉపాధ్యాయురాలు సంజిత స్పందిస్తూ.. 'సాధారణంగా స్కూల్ వంట మనిషి గదులకు తాళాలు వేస్తారు. కానీ, భారీ వర్షం కారణంగా ఆమె రాకపోవడంతో సాయంత్రం 4:10 గంటల సమయంలో ఏడో తరగతి విద్యార్థులిద్దరికి తాళాలు వేయమని పంపించాం. రెండో తరగతి పాప బెంచీ కింద నిద్రపోవడంతో ఆ విద్యార్థులు గమనించలేదు' అని వివరించారు. మరోవైపు తాజా ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో జిల్లా యంత్రాంగం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. మరోవైపు ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసింది.

## అదానీ లాజిస్టిక్స్ పార్క్‌కు శంకుస్థాపన చేసిన కేరళ సీఎం



**కొచ్చి-నవభూమి:** అదానీ గ్రూపుకు చెందిన లాజిస్టిక్స్ పార్క్‌ను కేరళలోని కలమసారేలో ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో అదానీ లాజిస్టిక్స్ పార్క్ కీలక మైలురాయి అవుతుందని అధికారులు చెప్పారు. ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. సుమారు 70 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. తొలి పెట్టుబడిగా సుమారు 600 కోట్లు ఖర్చు చేయనున్నారు. సుమారు 13 లక్షల చదరపు గజాల విస్తీర్ణంలో పార్క్‌ను ఏర్పాటు చేస్తారు. కొత్త టెక్నాలజీకి అనుగుణంగా సమగ్రమైన రీతిలో లాజిస్టిక్స్ సౌకర్యాలు ఉంటాయి.

# ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రేమ.. రహస్యంగా రొమాన్స్, ప్రెగ్నెంట్ అని చెప్పడంతో ఎంత దారుణానికి ఒడిగట్టాడు!



**చిత్రదుర్గ- నవభూమి:** ఈ మధ్య కాలంలో చాలా మంది యువత ఆన్‌లైన్‌లోనే ప్రేమించుకుంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి వాటల్లో.. ముఖాలు తెలియకుండానే స్నేహాలు పెంచుకుని.. ఆపై ప్రేమ, సహజీవనం వరకూ వెళ్తున్నారు. అచ్చంగా ఇలాగే చేసిందో యువతి. కానీ సహజీవనం చేయకుండా చాటుమాటుగా ప్రేమికుడుతో కలిసింది. ఫలితంగా ఆమె గర్భం దాల్చడంతో.. పెళ్లి చేసుకుందామని పట్టుబట్టింది. కానీ అందుకు ఏమాత్రం అంగీకరించని ప్రియుడు.. ఆమెను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. అందుకోసం ఎవరూ లేని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి.. అతి కిరాతకంగా హత్య చేశాడు. గర్భవతి అని కూడా చూడకుండా.. చంపేసి మృతదేహం కూడా కనిపించకుండా చేయాలనుకున్నాడు. కానీ వరుణదేవుడి సాయంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఎలాగంటే..?కర్ణాటకలోని చిత్రదుర్గకు చెందిన 19 ఏళ్ల వర్షిత డిగ్రీ చదువుతోంది. అయితే ఓవైపు చదువుకుంటూనే మరోవైపు ఏదైనా పని చేయాలని భావించింది. ఇందుకోసం తన వద్ద ఉన్న ఫోన్ ద్వారానే ఉద్యోగాల కోసం వెతికింది. ఈక్రమంలోనే ఇన్‌స్టాగ్రామ్ వేదికగా.. ఒక నెట్ వర్కింగ్ సంస్థలో పని చేస్తున్న 21 ఏళ్ల చేతన్.. కొత్తవారిని తన సంస్థలోకి చేర్చుకుంటామంటూ పోస్ట్ పెట్టాడు. ఇది చూసిన వర్షిత ఉద్యోగం కోసం చేతన్‌ను సంప్రదించింది. ఇలా వీరిద్దరి మధ్య మాటలు ప్రారంభం కాగా.. అది కాస్త త్వరలోనే స్నేహంగా మారింది. ఇద్దరూ ఒకరికి సంబంధించిన విషయాలను మరొకరితో పంచుకున్నారు. చాలా రోజుల పాటు ఇలా స్నేహం చేసిన వీరు.. వారికి తెలియకుండానే ప్రేమలో పడిపోయారు.

ఆ విషయం అర్థం అయ్యాకా.. చాటుమాటుగా కలవడం కూడా ప్రారంభించారు. చేతన్ పదే పదే.. వర్షితను బయటకు తీసుకెళ్లి శారీరకంగా కలిసేవాడు. ఫలితంగా వర్షిత గర్భం దాల్చింది. దీంతో ఆమె ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. తాను చేతన్ అనే అబ్బాయిని ప్రేమిస్తున్నానని, అతడినే పెళ్లి కూడా చేసుకుంటానని పేర్కొంది. దీంతో ఆమె తల్లిదండ్రులు, ముఖ్యంగా పినతల్లి చేతన్‌కు ఫోన్ చేసింది. వర్షిత గర్భం దాల్చిందని.. మీ పెద్దవాళ్లను తీసుకు వస్తే పెళ్లి చేస్తామని వివరించింది. కానీ చేతన్ మాత్రం అందుకు ఒప్పుకోలేదు. ముఖ్యంగా వర్షిత మరెవరితోనే క్లోజ్‌గా ఉంటుందనే అనుమానం, ఆమెను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో.. పెళ్లి చేసుకోనని మొండికేశాడు. అయినా వర్షిత పదే పదే ఫోన్ చేసి పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. దీంతో వర్షితను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని చేతన్.. ఆమెను అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. ముఖ్యంగా ఎవరికీ అనుమానం రాకుండా ఆమెను హత్య చేయాలనుకున్నాడు. ఇందుకోసం ఓ పథకం కూడా వేశాడు. ఈ నెల 18వ తేదీన వర్షితను నమ్మించి చిత్రదుర్గ బైపాస్ రోడ్డులో ఉన్న ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను అత్యంత కిరాతకంగా హత్య చేసి.. నేరాన్ని దాచి పెట్టేందుకు మృతదేహాన్ని కూడా మాయం చేయాలనుకున్నాడు. అందుకోసం తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆపై తనకేమీ తెలియదన్నట్లుగా పారిపోయాడు. కానీ ఆరోజు రాత్రి భారీగా వర్షం కురవడంతో.. మృతదేహం పూర్తిగా కాలిపోలేదు. దీంతో అతని పన్నాగం పాక్షికంగా విఫలమైంది. సగం కాలిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇలా హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని గుర్తించడానికి ప్రయత్నించారు. అయితే ముఖం గుర్తుపట్టలేని విధంగా మారడంతో.. మృతదేహానికి సంబంధించిన వివరాలను కనుగొనడం కష్టమైంది.కానీ, పోలీసులు ఒక ముఖ్యమైన ఆధారాన్ని గుర్తించారు. వర్షిత చేతిపై ఉన్న ఒక టాటూ ఆధారంగా ఆమెను వర్షితగా గుర్తించారు. ఆ తర్వాత విచారణను వేగవంతం చేశారు. వర్షిత కాల్ రికార్డులను పరిశీలించగా.. ఆమె చివరిగా చేతన్‌తో మాట్లాడినట్లు తేలింది. చేతన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. అతడు తన నేరాన్ని అంగీకరించాడు. వర్షిత గర్భం దాల్చడంతో ఆమెను పెళ్లి చేసుకోవాల్సి వస్తుందని భయపడే ఈ దారుణానికి పాల్పడ్డానని పోలీసులకు చెప్పాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ధర్మస్థల కేసులో బిగ్ ట్విస్ట్.. తప్పుదారి పట్టించిన వ్యక్తి అరెస్ట్



**ధర్మస్థల-నవభూమి:** కర్ణాటకలోని ధర్మస్థల ఆలయం సమీపంలో 'సామూహిక అత్యాచారాలు, హత్యలు, ఖననాలు' జరిగాయని తీవ్రమైన ఆరోపణలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆరోపణలు రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించాయి. అయితే ప్రత్యేక దర్యాప్తు బృందం నిర్వహించిన విచారణలో ఆ వ్యక్తి చేసిన వాదనలు పూర్తిగా అబద్ధమని, కల్పితమని తేలడంతో ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన సాక్షిగా, సమాచారం అందించిన వ్యక్తిగా చెప్పుకున్న సిఎన్ చిన్నయ్య అలియాస్ చెన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు గాను పోలీసులు ఆయనపై చర్యలు తీసుకున్నారు.మొదట చిన్నయ్య తనను తాను 'విజిల్ బ్లోయర్'గా పేర్కొంటూ ముసుగు వేసుకుని మీడియా ముందుకు వచ్చారు. ధర్మస్థల ఆలయం సమీపంలో ఉన్న మంజునాథ స్వామి ఆశ్రమంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు జరిగాయని.. వాటికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 100కు పైగా చిన్నారులు, మహిళల మృతదేహాలను తానే స్వయంగా పూడ్చి పెట్టినట్లు చెప్పాడు. ఈ సంచలన ఆరోపణలు రాష్ట్రంలో రాజకీయంగా, సామాజికంగా కలకలం సృష్టించాయి. ఈ విషయంపై దర్యాప్తు జరపాలని అనేక డిమాండ్లు వచ్చాయి.ఈ నేపథ్యంలోనే కర్ణాటక ప్రభుత్వం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. అధికారులు చిన్నయ్యను రోజుల తరబడి విచారించారు. మరోవైపు అతడు చెప్పిన చోట తవ్వకాలు కూడా జరిపారు. ఎన్ని రోజుల పాటు తవ్వకాలు చేపట్టినా అక్కడ ఒక్క మృతదేహం కూడా లభ్యం కాలేదు. మరోవైపు ఆయన చెప్పిన వివరాలకు, వాస్తవాలకు ఎక్కడా పొంతన లేకపోవడంతో.. మరింత గట్టిగా దర్యాప్తు చేశారు. సాక్ష్యాలను మరోసారి పరిశీలించారు. ఈక్రమంలోనే సిఎన్ చిన్నయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మొహంతీ అతడిని ఆరా తీశారు.ఈ విచారణలోనే చిన్నయ్య చెప్పేవన్నీ అబద్ధాలేనని తేల్చారు. కావాలనే అతడు మాయ మాటలు చెప్పి మొత్తం వ్యవస్థను నమ్మించాడని.. ఇప్పుడు తనకేమీ తెలియదంటూ చేతులు ఎత్తేస్తున్నాడని విచారణ బృందం గుర్తించింది. ఈక్రమంలోనే అతడిని అరెస్ట్ చేసి ఈరోజు కోర్టులో హాజరు పరచబోతుంది. మరోవైపు ఈ కేసులో తప్పుడు ఆరోపణలు చేసిన బెంగళూరు మహిళ సుజాత భట్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. వైద్య విద్య చదువుతున్న తన కుమార్తె అనన్య భట్.. 2003లో ధర్మస్థల వెళ్లి అదృశ్యం అయిందంటూ ఆమె ఫిర్యాదు చేసి.. మళ్లీ ఆ కేసును వెనక్కి తీసుకుంది. తాను చెప్పిందంతా అబద్ధమేనని పేర్కొంది. దీంతో ఈరోజు ఉదయం పోలీసులు ఆమె ఇంటికి వెళ్లారు. అదుపులోకి తసుకోనున్నట్లు తెలుస్తోంది.ఈ కేసు మొదలైనప్పటి నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర రాజకీయ వివాదం నడిచింది. ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ ధర్మస్థల ఆలయం పరువును ప్రభుత్వం కాపాడలేకపోతోందని ఆరోపించింది. అయితే తాజాగా ఫిర్యాదుదారు అరెస్ట్ కావడంతో ఈ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరైనదేనని తేలింది. ఈ పరిణామం కర్ణాటక రాజకీయాల్లో ఆసక్తికరమైన మలుపుగా మారింది. ఒక వైపు ప్రభుత్వం పారదర్శకతను పాటిస్తూ నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపిందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మరోవైపు బీజేపీ నాయకులు ఈ కేసులో నిజానిజాలు ఇంకా పూర్తి స్థాయిలో బయటపడలేదని అంటున్నారు.

# నేను హత్యకు గురైతే.. దోషి అఖిలేష్ యాదవే: ఎమ్మెల్యే పూజా పాల్



**లక్నో- నవభూమి:** ఉత్తర ప్రదేశ్ రాజకీయాల్లో ఒక సంచలనం చోటుచేసుకుంది. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచి బహిష్కరింపబడిన మాజీ ఎమ్మెల్యే పూజా పాల్.. ఆ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒకవేళ తాను హత్యకు గురైతే.. దానికి పూర్తి బాధ్యత అఖిలేష్ యాదవ్‌దేనని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. తన భర్త హత్య కేసులో న్యాయం జరగకుండా అఖిలేష్ యాదవ్ అడ్డుకున్నారని.. నేరస్థులకు అండగా నిలిచారని ఆమె ఆరోపించారు. పూజా పాల్ చేసిన ఈ కామెంట్లు ఉత్తర ప్రదేశ్ రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. పూజా పాల్ భర్త.. రాజు పాల్ 2005లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దారుణంగా హత్యకు గురయ్యారు. ఆ హత్య కేసులో ప్రధాన నిందితుడుగా అతీక్ అహ్మద్ పేరు నమోదైంది. ఈ అతీక్ అహ్మద్ సమాజ్‌వాదీ పార్టీలో ఒక కీలక నాయకుడిగా ఉండేవారు. తన భర్త హత్య తర్వాత నేరస్థులకు శిక్ష పడేలా చేస్తారని భావించి.. పూజా పాల్ సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. అయితే అక్కడ ఆమెకు అందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితి ఎదురైంది. ముఖ్యంగా దాదాపుగా 15 ఏళ్ల పాటు అదే పార్టీలో కొనసాగినప్పటికీ ఆమె భర్త హత్యకు న్యాయం జరగలేదు. ముఖ్యంగా ఆమె నిందితుడికి శిక్ష పడేలా చేయలేకపోయారు.

దీంతో తీవ్ర నిరాశకు గురైన ఆమె సమాజ్‌వాదీ పార్టీపై ఆరోపణలు చేయడం ప్రారంభించారు. మరోవైపు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేరాలకు వ్యతిరేకంగా తీసుకున్న 'జీరో టాలరెన్స్' విధానాన్ని ప్రశంసించినందుకు.. ఈమెను నేతలు పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో పూజా పాల్ బహిరంగంగానే ఆ పార్టీ నేతలపై ఆరోపణలు చేయడం మొదలు పెట్టారు. ఈక్రమంలోనే భాగంగానే తాజాగా ఆమె.. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. న్యాయం చేస్తారని నమ్మి వెళ్తే.. అఖిలేష్ యాదవ్ నేరస్థులకే మద్దతు ఇచ్చారని, న్యాయం కోసం తాను చేసిన పోరాటాన్ని అడ్డుపడ్డారని ఆరోపించారు. భర్త హంతకులపై మాత్రమే కాకుండా సమాజ్‌వాదీ పార్టీ విధానాలపై కూడా పూజా పాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు.సమాజ్‌వాదీ పార్టీలో వెనుకబడిన, అత్యంత వెనుకబడిన తరగతుల ప్రజలను 'సెకండ్ క్లాస్ పౌరులు'గా చూస్తారని.. ఒక మైనారిటీ వర్గానికి మాత్రమే మొదటి ప్రాధాన్యత ఇస్తారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా తన ప్రాణాలకు ముప్పు ఉందని.. ఒకవేళ ఎవరైనా తనపై దాడి చేసినా, హత్య చేసినా.. దానికి నేరుగా అఖిలేష్ యాదవే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె బహిరంగంగా ప్రకటించారు. తనకేమైనా వెంటనే ఆయన్నే అరెస్ట్ చేయాలంటూ సూచించారు. పూజా పాల్ ఆరోపణలపై పార్టీ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

# రూ. 20 వాటర్ బాటిల్‌కు వంద రూపాయలు వసూలు..

## ఇదెక్కడి న్యాయం: రెస్టారెంట్లపై ఢిల్లీ హైకోర్టు ఫైర్




**న్యూఢిల్లీ-నవభూమి:** వినియోగదారుల హక్కులకు సంబంధించి ఒక ముఖ్యమైన కేసులో.. ఢిల్లీ హైకోర్టు రెస్టారెంట్‌ల యాజమాన్యాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓవైపు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు వస్తువులను అమ్ముతూనే.. మరోవైపు అదనంగా సర్వీస్ ఛార్జిని వసూలు చేయడం దారుణం అని వ్యాఖ్యానించింది. ఇది వినియోగదారులపై తీవ్ర భారం మోపడమేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ వ్యవహారాన్ని 'డబుల్ వమ్మీ' (రెండు రకాల దెబ్బ) అని అభివర్ణించిన ధర్మాసనం.. వినియోగదారులు ఇష్టారీతిన దోపిడీకి గురి కావడాన్ని చూస్తూ తాము ఊరుకోబోమని గట్టి హెచ్చరిక జారీ చేసింది.జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం రెస్టారెంట్ సంఘాలతో మాట్లాడింది. ఈ విచారణలో అనేక కీలకమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి డబ్బును మూడు రకాలుగా వసూలు చేస్తాయని న్యాయస్థానం పేర్కొంది. ముఖ్యంగా రెస్టారెంట్‌లలో మెనూలో కనిపించే ధరలు, ఆహారం తినేటప్పుడు కల్పించే వాతావరణం, సౌకర్యాలు, వెయిటర్లు అందించే సేవలన్నింటికీ కలుపుకునే రెస్టారెంట్లు బిల్లులు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఈ మూడు అంశాలను ప్రస్తావిస్తూ న్యాయస్థానం రెస్టారెంట్ సంఘాలను ఓ ప్రశ్న అడిగింది."మీరు రూ. 20 విలువైన వాటర్ బాటిల్‌కు రూ. 100 వసూలు చేస్తున్నారు. ఇది కేవలం నీళ్ల ధర కాదు.. రెస్టారెంట్‌లోని అనుభవం, వాతావరణం, సేవలకు కలిపి తీసుకుంటున్నారు. అలాంటప్పుడు ఇదే బిల్లుపై మళ్లీ సర్వీస్ ఛార్జీలు ఎందుకు ఎక్కువగా వసూలు చేస్తున్నారు" అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ రెండు వసూళ్లు వినియోగదారుడి జేబుకు చిల్లు పెడుతున్నాయని న్యాయస్థానం అభిప్రాయపడింది.గతంలో ఈ కేసులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం గుర్తు చేసుకుంది. అప్పుడు తప్పనిసరి సర్వీస్ ఛార్జిని వసూలు చేయడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని.. ఇది ఒక అన్యాయమైన వ్యాపార పద్ధతి అని కోర్టు పేర్కున్నట్లు తెలిపింది. ఈ తీర్పును సవాలు చేస్తూ.. రెస్టారెంట్ సంఘాలు హైకోర్టుకు రాగా ఇక్కడ కూడా అదే అభిప్రాయం వచ్చింది. ముఖ్యంగా సర్వీస్ ఛార్జిపై జీఎస్టీ కూడా వసూలు చేయడం వినియోగదారుడికి మరింత నష్టం కలిగిస్తుందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.రెస్టారెంట్‌ల ఇష్టారీతి వసూళ్లను అరికట్టడానికి ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని హైకోర్టు సూచించింది. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఈ విషయంలో రెస్టారెంట్‌లకు హెచ్చరికలు జారీ చేసింది. సర్వీస్ ఛార్జి స్వచ్ఛందంగా ఉండాలని, అది తప్పనిసరి కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను కొన్ని రెస్టారెంట్‌లు ధిక్కరిస్తున్నాయి.

## విద్యార్థినిపై వీధి కుక్కల దాడి.. ముఖంపై 17 కుట్లు



**శ్యామ్ నగర్-నవభూమి:** అలెన్ హౌస్ రుమా కాలేజీలో బీబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న 21 ఏండ్ల వైష్ణవి సాహు అనే విద్యార్థిని ఈనెల 20న కాలేజీ ముగిశాక ఇంటికి బయల్దేరింది. అయితే, మార్గం మధ్యలో శ్యామ్ నగర్ ప్రాంతంలో కొన్ని వీధికుక్కలు, కోతులు ఒకదానితో ఒకటి పోట్లాడుకుంటున్నాయి. అదే సమయంలో అటుగా వచ్చిన వైష్ణవిపై కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో వైష్ణవి ముఖం, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. కుక్కల దాడి నుంచి తప్పించుకునేందుకు విద్యార్థిని ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఆమెను రోడ్డుపై పడేసి తీవ్రంగా గాయపరిచాయి. విద్యార్థిని కేకలు విన్న స్థానికులు కర్రలతో పరుగెత్తుకొచ్చి కుక్కలను తరిమికొట్టారు.అప్పటికే తీవ్ర రక్తస్రావంతో అల్లాడుతున్న వైష్ణవిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు చికిత్సచేశారు. వైష్ణవి ముఖంపై ఏకంగా 17 కుట్లు పడ్డాయి. ఈ ఘటనతో విద్యార్థిని కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కుక్కలన్నింటినీ పట్టుకుని షెల్టర్లకు తరలించాలని విజ్ఞప్తి చేసింది. తన బిడ్డలా ఇంకెవరూ బాధపడకూడదని పేర్కొంది. వెంటనే కుక్కలన్నింటినీ వీధుల్లో నుంచి తరలించాలని డిమాండ్ చేసింది. వీధి కుక్కల స్టెరిలైజేషన్, వాటిని షెల్టర్లకు తరలించడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కొనసాగుతున్న చర్చల మధ్య ఈ సంఘటన జరిగింది.

**వీధికుక్కలను స్టెరిలైజ్ చేసి.. రిలీజ్ చేయండి**

వీధి కుక్కలపై సుప్రీంకోర్టు ఇటీవలే సంచలన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని వీధి కుక్కల కారణంగా పలువురు, ముఖ్యంగా చిన్నారులు కుక్క కాట్లకు గురవుతున్నారని, రేబిస్ వ్యాధి బారిన పడుతున్నందున వాటిని సాధ్యమైనంత త్వరగా షెల్టర్ కేంద్రాలకు తరలించాలంటూ సూచించింది. అయితే, ఈ ఆదేశాలపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో ఆ ఉత్తర్వులను సుప్రీం సవరించింది. స్టెరిలైజేషన్, ఇమ్యునైజేషన్ తర్వాత వీధి కుక్కలను వాటిని తెచ్చిన వీధులలోనే విడిచిపెట్టాలని మున్సిపల్ అధికారులను జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. రేబిస్ సోకిన లేదా ఉన్మాద లక్షణాలు ప్రదర్శిస్తున్న వీధి కుక్కలను మాత్రం షెల్టర్ హోంలోనే ఉంచాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కుక్కలకు వీధుల్లో ప్రజలు ఆహారం పెట్టడాన్ని అనుమతించబోమని, వీధికుక్కల కోసం ఆయా ప్రాంతాలలో ఆహార పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపింది.

## బీహార్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం



**షాజహాన్‌పూర్-నవభూమి:** చోటు చేసుకుంది. పాట్నాలో టెంపో వాహనాన్ని ట్రక్కు బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. పాట్నా లోని షాజహాన్‌పూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో గల ఓ ఫ్యాక్టరీ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. నలంద జిల్లాకు చెందిన పలువురు గంగా నదిలో స్నానం అనంతరం ఫత్వా నుంచి స్వగ్రామానికి టెంపో వాహనంలో బయల్దేరారు. అయితే, వీరు ప్రయాణిస్తున్న టెంపో వాహనాన్ని అతి వేగంగా వచ్చిన ఓ ట్రక్కు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో టెంపో పూర్తిగా ముక్కలైపోయింది. ఈ ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సుమారు నలుగురు గాయపడ్డారు. ప్రమాదం తర్వాత ట్రక్కు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్‌బరస్ట్.. బాలిక మృతి.. అనేక మంది మిస్సింగ్

**చమోలి-నవభూమి:** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో మరోసారి మేఘ విస్ఫోటం సంభవించింది. శుక్రవారం రాత్రి చమోలి జిల్లాలో కురిసిన కుంభవృష్టికి వరదలు సంభవించాయి. ఈ వరదలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక మంది గల్లంతయ్యారు. ఇళ్లు, దుకాణాలు, వాహనాలు ధ్వంసమయ్యాయి.ఈ వరదలకు కొండచరియలు కూడా విరిగిపడ్డాయి. థరాలి మార్కెట్ ప్రాంతం, కోట్‌దీప్, థరాలి తహసీల్ కాంప్లెక్స్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయా ప్రాంతాలు మొత్తం శిథిలాలతో నిండిపోయాయి. పలు వాహనాలు, ఇళ్లు, దుకాణాలు శిథిలాల కింద కూరుకుపోయాయి. ఈ వరదలకు వీధులన్నీ నదులను తలపించాయి. ఈ విపత్తు కారణంగా సగ్వారా గ్రామంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన ఓ బాలిక మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
ఆదివారం
24 ၊ ఆగస్టు ၊ 2025



## ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో గణేశుడి విగ్రహం..

**ఉప్పుగూడ-నవభూమి:** వినాయచవితి కోసం హైదరాబాద్ ముస్తాబవుతోంది. గణశుడి విగ్రహాల ఏర్పాట్లలో స్థానికులు బిజీ అయ్యారు. ఉప్పుగూడలోని శ్రీ మల్లిఖార్జున నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వినూత్న రీతిలో గణపయ్యను ప్రతిష్టించనున్నారు. ఆపరేషన్ సింధూర్ థీమ్‌తో ఉన్న గణశుడి విగ్రహాన్ని తయారు చేశారు. వినాయచవితి నవరాత్రి ఉత్సవాల్లో ఆ గణేశుడు అందర్నీ అలరించనున్నాడు. స్థానిక ఆర్టిస్టులే ఆ విగ్రహాన్ని తయారు చేసినట్లు తెలుస్తోంది. సుమారు 6 లక్షలు ఖర్చు అయినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఆ థీమ్‌లో బ్రహ్మోస్ ఎస్-400 రైఫిల్స్, ఆర్మీ మోడల్ థీమ్ కూడా ఉన్నది.నిర్వాహకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం విగ్రహం కోసం ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. ఆగస్టు 15వ తేదీన ఆ వినాయకుడు డెలివరీ అయినట్లు తెలిపారు. గణేశుడి ప్రధాన విగ్రహాన్ని ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ తరహాలో తయారు చేశామన్నారు. ఆపరేషన్ సింధూర్ గురించి 20 నిమిషాల వీడియోను కూడా తయారు చేసినట్లు చెప్పారు. నవరాత్రుల్లో ఆ వీడియోను ప్రదర్శిస్తామన్నారు. ఆయుధ డిజైన్ కోసం రెండు వాహనాలను వాడినట్లు చెప్పారు. సుమారు 8 మంది ఆర్టిస్టులు పనిచేశారన్నారు.మరో నిర్వాహకుడు సుశీల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది కొత్త తరహా వినాయకుడిని ప్రతిష్టిస్తామన్నారు. 2023లో చంద్రయాన్ మోడల్ గణేశ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కువ మంది భక్తులను అట్రాక్ట్ చేసేందుకు ఆపరేషన్ సింధూర్ థీమ్‌ను ఎంపిక చేశామన్నారు. ఈ మండపాన్ని దర్శించిన వాళ్లకు ఆపరేషన్ సింధూర్ గురించి, మన ఆయుధాల గురించి తెలుస్తుందన్నారు. మొత్తం ఖర్చు 10 లక్షలు దాటి ఉంటుందన్నారు. బుధవారం వినాయకచవితి నుంచి ఆపరేషన్ సింధూర్ గణేశుడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు.





## దోపిడీకి నిలయాలు ఈ ప్రైవేట్ వర్సిటీలు

దేశ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు విద్యను ప్రజాస్వామ్య హక్కుగా, సామాజిక న్యాయం సాధనంగా ఊహించిన తరం ఎన్నో పోరాటాలు చేసింది. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతమైన విద్యను అందించాయి. అయితే ఆ బాటలోకి బలవంతంగా దిగిన కొత్త ధోరణి ప్రైవేట్ విశ్వవిద్యాలయాల వ్యవస్థ. విద్యను హక్కుగా కాకుండా వస్తువుగా మార్చి మార్కెట్ బల్లపై వేలం వేసే ఈ విధానం, నిరుపేదలకు కష్టాలు తెచ్చి పెట్టగా, అధికారం, ధనం ఉన్నవారికి మాత్రం లాభాలను తెచ్చిపెడుతోంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2023లో విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 633 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని తెలిపింది. రాష్ట్రాల వారీగా లెక్కిస్తే, మన రాష్ట్రంలో మాత్రమే 5 డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, 10 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి.ప్రభుత్వం అనుమతించినప్పుడల్లా కొత్తగా పుట్టుకొస్తున్న ఈ ప్రైవేట్ వర్సిటీలు విద్యా రంగంలో సరికొత్త వ్యాపారపు దారులు వేసుకున్నాయి. ఒక విశ్వవిద్యాలయానికి అవసరమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, హాస్టళ్లు, గ్రంథాలయాలు, మౌలిక సదుపాయాలు, అర్హులైన అధ్యాపకులు ఉండాలని యూజీసీ నిబంధనలు చెబుతున్నా, అనుభవం లేని, అర్హత లేని లెక్చరర్లతో తక్కువ జీతాల మీద బోధన చేయించడం సామాన్యంగా మారింది. మరోవైపు లక్షల్లో ఫీజులు, కోట్ల దాకా డొనేషన్లు వసూలు చేయడం ద్వారా పేదలు, బడుగు వర్గాలు, దళితులు విద్యావకాశాల నుండి వేరుపడుతున్నారు. విద్య అనే హక్కు సంపన్నుల అధీనంలోకి జారిపోతోంది.ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన వెనుక ఉన్న సామాజిక రాజకీయ ఉద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. దశాబ్దాలుగా అణగారిన వర్గాలు ఉన్నత విద్యలోకి ప్రవేశించే అవకాశాలు పెరిగినపుడు, ఆ మార్గాన్ని మళ్ళీ మూసివేయాలని అగ్రకుల భావజాలం ప్రయత్నిస్తోంది. దీనిని గురుకులాల కాలంతో పోల్చవచ్చు. అప్పట్లో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మాత్రమే గురుకుల విద్య పొందగలిగినట్లు, ఇప్పుడు ధనం ఉన్న వర్గాలు మాత్రమే ఈ వర్సిటీలలోకి ప్రవేశం పొందగలుగుతున్నాయి. పేదలు, వెనుకబడిన వర్గాలు తలుపు దగ్గరే ఆగిపోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది.ఇది విద్యా సమానత్వాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రజాస్వామ్యానికి కట్టిన పునాదులపై దాడి. ప్రభుత్వం పబ్లిక్ విద్యకు నిధులను భారీగా తగ్గించి, ప్రైవేట్ వ్యవస్థలపై ఆధారపడమని చెప్పడం వాస్తవానికి ప్రజలకు మోసం చేయడమే. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ యాజమాన్యాలకు భూములు కేటాయించి, గ్రాంట్లు ఇచ్చి, చట్టపరమైన రక్షణలు కల్పిస్తుంటే, సామాన్య విద్యార్థికి ఎటువంటి రక్షణ ఉండదు. కేసీఆర్ ప్రభుత్వమే ఉదాహరణ. కరోనా సమయంలో ప్రజలు ఇంట్లో లాక్‌డౌన్‌లో ఉన్నప్పుడు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడం సామాజిక న్యాయానికి పెద్ద దెబ్బ.ఈ ప్రైవేట్ వర్సిటీలు ఒకవైపు విద్యను ధనవంతులకు మాత్రమే పరిమితం చేస్తుంటే, మరోవైపు ఉద్యోగాల సమస్యను మరింతగా పెంచుతున్నాయి. వీటి ప్రధాన దృష్టి మానవ రహిత ఉత్పాదకతను పెంచే రంగాలపైనే ఉంటుంది. రెగ్యులర్ కోర్సులు తగ్గిపోతూ, స్వీయ ఆర్థిక కోర్సులు పెరుగుతున్నాయి. పరిశోధన, సృజనాత్మకత, సామాజిక అవగాహన పెంచే విద్యా విభాగాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఫలితంగా ఈ వర్సిటీల నుంచి బయటకు వచ్చే విద్యార్థులు గణనీయమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు జ్ఞాన సృష్టికర్తలు కాకుండా కేవలం ఉద్యోగార్థులుగా తయారవుతున్నారు. రాజ్యాంగం అందించిన రిజర్వేషన్, ఉపకార వేతనాల పథకాలు ఈ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో సరైన రీతిలో అమలు కావు. ఒకవేళ అమలు చేస్తున్నట్లు చూపించినా, 'క్రీమీలేయర్' వంటి అడ్డంకులను పెంచి పేద వర్గాల విద్యార్థులను తిరస్కరించే పరిస్థితి ఉంటుంది. దీని వలన రిజర్వేషన్ ఉద్దేశ్యం పూర్తిగా దెబ్బతింటుంది. ఈ విధానం కొనసాగితే విద్యార్థుల మధ్య కుల, వర్గ, ధన అసమానతలు మరింత బలపడతాయి.గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం అంటే ప్రజలందరికీ సమాన అవకాశాలు, సమాన హక్కులు. కానీ నేటి విద్యా వ్యవస్థ దానికి పూర్తిగా విరుద్ధంగా నడుస్తోంది. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించక, మానవీయ విలువలను పెంచక, కేవలం ధనం కోసం విద్యను పరిమితం చేస్తోంది. చేతివృత్తులు, వ్యవసాయం, శ్రమాధారిత రంగాలకు విద్యను అనుసంధానం చేయకపోవడం వల్ల నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోంది.ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఉనికి వలన, విద్య వ్యాపారం అవుతుంది. వ్యాపారం అయిన విద్యతో సమాజానికి మేలుకన్నా నష్టం ఎక్కువ. పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారు. ఇది భవిష్యత్తులో దేశానికి పెద్ద సమస్యగా మారుతుంది. కుల%-%వర్గ అసమానతలు మళ్లీ విద్యా ద్వారానే బలపడతాయి. ప్రజలకు అర్థమైన విద్యను ఇవ్వకపోవడం వలన జ్ఞానం కొందరి చేతుల్లో మాత్రమే కేంద్రీకృతమై, సామాజిక ఆర్థిక వ్యవస్థలో శక్తి అసమానంగా విభజించబడుతుంది.అందువలన విద్యను హక్కుగా కాపాడటం కోసం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం తప్పనిసరి. పబ్లిక్ ఎడ్యుకేషన్‌కే పెట్టుబడులు పెంచి, పేదలకు, వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించే విధానం వాస్తవానికి దోపిడీకి నిలయం మాత్రమే. ఒకప్పుడు రాజులు, జమీందార్లు జ్ఞానాన్ని తమ వర్గానికి మాత్రమే పరిమితం చేసినట్లుగా, నేటి ధనిక వర్గాలు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ద్వారా అదే పాత వ్యవస్థను పునరావృతం చేస్తున్నాయి.విద్యను వ్యాపారం కాకుండా, మానవ సమానత్వం సాధించే సాధనంగా చూసినప్పుడే ఈ దేశం గుణాత్మకమైన మార్పు సాధించగలదు.

# పిల్లల్లో సృజనాత్మకతకు ప్రాణం పోసేదెలా?



పిల్లవాడి మనసు శుద్ధమైన కాగితంలా ఉంటుంది. ప్రతి అనుభవం, మాట, ప్రేరణ దానిపై కొత్త చిత్రాన్ని గీస్తుంది. ఈ చిత్రమే కలలు, ఊహలు, ఆవిష్కరణలకు మార్గం. ప్రతి పిల్లవాడిలో సృజనాత్మకత సహజంగా ఉంటుంది. దాన్ని గుర్తించి, పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం మీద ఉంది. శాస్త్రం, కళ, సాహిత్యం, సాంకేతికతలో ముందుకు సాగడానికి కొత్త ఆలోచన, ఊహించని కోణం అవసరం. అదే సృజనాత్మకత. దీన్ని చిన్నతనం నుంచే ప్రోత్సహించాలి.



నేషనల్ అచీవ్మెంట్ సర్వే (2021) ప్రకారం, విద్యార్థుల్లో ఆలోచనా స్వేచ్ఛ, సమస్యా పరిష్కార నైపుణ్యాలు తగ్గుతున్నాయి. ఇది బోధనా విధానాల్లో మార్పు అవసరాన్ని చూపిస్తుంది. ఇంట్లో పిల్లల ప్రశ్నలకు ఓపికగా సమాధానమివ్వాలి. కథలు, బొమ్మలు, గీతాల ద్వారా వారి ఊహాశక్తిని పెంచాలి. తల్లిదండ్రుల ప్రశంస, ప్రోత్సాహం ఆత్మవిశ్వాసాన్ని బలపరుస్తాయి. రోజూ 20 నిమిషాల సృజనాత్మక సంభాషణ ఆలోచనా సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని అధ్యయనాలు తెలిపాయి.

పాఠశాలల్లో పరీక్షల ఒత్తిడి తగ్గించి, ప్రాజెక్ట్ ఆధారిత బోధన, కళలతో కూడిన పాఠాలు అందించాలి. ప్రయోగశాలలు, ఆర్ట్ క్లాసులు, సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తాయి. ఉపాధ్యాయులు వారి ఆసక్తులను గుర్తించి మార్గదర్శనం చేయాలి. నూతన విద్యా విధానం (2020) కళలతో కూడిన బోధనకు ప్రాధాన్యత ఇస్తుంది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా 2025 నాటికి ప్రతి పాఠశాలలో ఆర్ట్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యం.

సాంకేతికత అందరికీ అందుబాటులో ఉండాలి. గ్రామీణ విద్యార్థులకు వీడియో ఎడిటింగ్, యాప్ డెవలప్‌మెంట్ వంటి నైపుణ్యాలకు అవకాశాలు పెంచాలి. విఫలమైనా మళ్లీ ప్రయత్నించే ధైర్యాన్ని ఇవ్వాలి. కథలు, ప్రకృతి వీక్షణం, గేమ్స్, రచనలు, నాటకాలు సృజనాత్మకతను పెంచుతాయి. మేధస్సు నిపుణులను సృష్టిస్తుంది, కానీ కల్పనాశక్తి మార్గదర్శకులను తయారు చేస్తుంది.

పిల్లల సృజనాత్మకతను పెంపొందించడం భవిష్యత్తుకు అద్భుతమైన బహుమతి. ఒక చిన్న ఆలోచన, ఊహ వారి ప్రపంచాన్ని గొప్పగా మార్చగలవు. పరీక్షలు, మార్కులు, మెమొరీ పాఠాలు నేర్పితే వారు నిపుణులవుతారు, కానీ ఆవిష్కర్తలుగా ఎదగలేరు. అందుకే, పిల్లల కల్పనాశక్తికి రెక్కలు తొడగాలి, ఆకాంక్షలకు దిశ చూపాలి. అప్పుడు వారు ఆవిష్కరణల ఆకాశాన్ని తాకగలరు.

ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి, ఎందుకంటే ప్రతి ప్రశ్న కొత్త ఆవిష్కరణకు ద్వారం. భయం లేకుండా ప్రయత్నించే వాతావరణం ఇవ్వాలి, ఎందుకంటే విఫలమైన ప్రయత్నాల వెనుక విజయ దారులుంటాయి. వారి గీతలు, గీతాలు, కథలను గౌరవించాలి, ఎందుకంటే ఆ చిన్న భావాలు ప్రపంచాన్ని మార్చే ఆలోచనలవుతాయి. పిల్లలు పుస్తకాలతోపాటు ప్రపంచాన్ని చదవగలగాలి. వారి కలలను ఆపకండి, అందులో సమాజానికి మార్గాలు దాగివుండొచ్చు. సృజనాత్మకతను అణచకండి, అది స్వేచ్ఛగా విస్తరించాలి.

వారి ఊహలకు ఆకాశమే హద్దు. ప్రతి చిన్న కలకు చిగుర్లు తొడగాలి. చిన్న చేతుల్లోనే గొప్ప భవిష్యత్తు ఉంది. మనం ఇచ్చే ప్రేరణ, ప్రోత్సాహం వారిని శిఖరాల వైపు నడిపిస్తుంది. ఒక చిన్న ఆలోచన ప్రపంచాన్ని మార్చగలదు. ఒక చిన్న కల ప్రపంచాన్ని గెలిపించగలదు. ఒక చిన్న పిల్లవాడు కొత్త దారులు చూపగలడు. కాబట్టి, పిల్లల కల్పనాశక్తికి రెక్కలు ఇవ్వాలి, ఆకాంక్షలకు దిశ చూపాలి. అప్పుడు వారు ఆవిష్కరణల ఆకాశాన్ని తాకగలరు.

# సూరవరం ప్రతాపరెడ్డి -తెలంగాణా గగనంలో జ్ఞాన దీప్తి



తెలంగాణా చరిత్రలో, సామాజిక ఉద్యమాల్లో, సాహిత్య క్షేత్రంలో సురవరం ప్రతాపరెడ్డి పేరు అజరామరం. కేవలం కవి గానో, రచయిత గానో కాకుండా, ఆయన ఒక ప్రజాబోధకుడు, చరిత్రకారుడు, సంపాదకుడు, స్వతంత్ర భావజాల స్రవంతి. నైజాం పాలనలో తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని కాపాడటానికి, సామాన్య ప్రజల్లో జ్ఞాన దీప్తి వెలిగించటానికి ఆయన చేసిన కృషి అపారమైనది. తెలుగు జాతి స్ఫూర్తికి, తెలంగాణా ప్రాంతం మేలుకోసమై ఆయన అందించిన సేవలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

**బాల్యం -విద్యా సాధన**

సురవరం ప్రతాపరెడ్డి గద్వాల జిల్లా ఇటిక్యాలపాడులో 1896 మే 28న జన్మించారు. చిన్నప్పటి నుండి ఆయనకు చదువుపై ఆసక్తి అపారంగా ఉండేది. ఆ కాలంలో తెలుగు భాషకు నైజాం ప్రభుత్వంలో విలువ తక్కువ. ఉర్దూ, ఫార్సీ భాషలు అధికారిక భాషలు. అయినప్పటికీ ఆయన తెలుగు నేర్చుకోవడానికి విశేష శ్రద్ధ పెట్టారు. పాఠశాల విద్య అనంతరం హైదరాబాదు నందు ఉన్న హైస్కూల్, డిగ్రీ చదువుతూ సాహిత్యం, చరిత్ర, సమాజశాస్త్రాల పట్ల ఆకర్షితుల య్యారు. ఇంగ్లీష్ సాహిత్యం, భారతీయ చరిత్ర, తాత్విక గ్రంథాలను కూడా ఆయన లోతుగా అధ్యయనం చేశారు.

**సాహిత్య కృషి**

ప్రతాపరెడ్డి రచించిన గ్రంథాలు తెలంగాణా సాహిత్యంలో అద్భుతమైన స్థానం సంపాదించుకు న్నాయి. ఆయన ప్రధాన కృతిలో ఒకటి "ఆంధ్రుల సంగ్రామ చరిత్ర". ఇది 1949లో వెలువడింది. ఇందులో ఆయన ఆంధ్రుల చరిత్రను, పోరాటాలను, ఉద్యమాలను సమగ్రంగా ప్రతిపాదించారు. కేవలం వంశ చరిత్ర కాకుండా, సామాజిక రాజకీయ పరంపరలను, ప్రజల ఆచారాలను, శ్రామిక వర్గాల కష్టాలను ఆయన స్పష్టంగా చిత్రించారు. ఈ గ్రంథం ద్వారా తెలుగు చరిత్రకథనంలో ఒక కొత్త దశ ప్రారంభమైంది.

అలాగే ఆయన "గోలకొండ కవులు" అనే గ్రంథంలో తెలంగాణా కవుల సాహిత్యాన్ని సేకరించి వెలువరించారు. దానితో ఆ ప్రాంత కవుల కీర్తి, రచనల ప్రాచుర్యం పెరిగింది. గోపాల రెడ్డి, శేషాద్రి, సింగిరెడ్డి, రుద్రంగి వీరన్న వంటి అనేక కవులను ఆయన వెలికితీసి ప్రజలకు పరిచయం చేశారు. ఈ కృషి వల్ల తెలంగాణా సాహిత్య వారసత్వానికి గౌరవం పెరిగింది.

**సంపాదకత్వం -'గోలకొండ' పత్రిక**

ప్రతాపరెడ్డి సాహిత్యాన్నే కాదు, జర్నలిజాన్ని కూడా సమాజ శక్తివంతమైన సాధనంగా భావించారు. ఆయన 'గోలకొండ' అనే తెలుగు వారపత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక ఆ కాలంలో తెలంగాణా ప్రాంత ప్రజలకు ఒక వేదిక అయ్యింది. ఇందులో సాహిత్యం, చరిత్ర, సామాజిక సమస్యలతో పాటు, రాజకీయ చైతన్యం కలిగించే వ్యాసాలు కూడా వెలువడేవి. హైదరాబాదు రాష్ట్రంలో ఉర్దూ ఫార్సీ ఆధిపత్యం నడుమ తెలుగు పత్రికను నడపడం సాహసమే. కానీ ఆయన చేసిన ఆ కృషి తెలుగు భాషకు కొత్త గౌరవం తెచ్చింది.

**తెలంగాణా సమాజంపై ప్రభావం**

నైజాం పాలనలో తెలంగాణా ప్రజలు అనేక విధాలుగా అణచబడ్డారు. భాషా పరంగా ఉర్దూ, ఫార్సీకి ప్రాధాన్యం ఉండగా, తెలుగు పక్కన పడిపోయింది. ఆర్థిక పరంగా జమీందారీ వ్యవస్థ ప్రజలను దోచుకుంది. విద్యావకాశాలు ధనికులకే పరిమితమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతాపరెడ్డి పత్రికలు, రచనలు ప్రజల్లో చైతన్యం కలిగించాయి. సామాజిక సమానత్వం, విద్యా హక్కు, భాషా హక్కు అంశాలను ఆయన ఎత్తిచూపారు.

అంతేకాకుండా ఆయన సాహిత్యంలో సామాన్య రైతు జీవితం, శ్రామికుల కష్టాలు ప్రతిఫలించాయి. ఆయన చూపించిన దారిని అనుసరించి అనేక మంది విద్యార్థులు, యువకులు విద్యా రంగంలోకి అడుగుపెట్టారు.

**జాతి స్వాతంత్ర్య పోరాటంలో పాత్ర**

భారత స్వాతంత్ర్య పోరాట ప్రభావం తెలంగాణాలోనూ విస్తరించింది. ప్రతాపరెడ్డి ఆ ఉద్యమం పట్ల లోతైన మద్దతు వ్యక్తం చేశారు. ఆయన రచనలలో, ప్రసంగాలలో జాతీయతా స్ఫూర్తి ప్రతిఫలించింది. తెలుగు జాతి ఐక్యత, ఆంధ్రుల చరిత్ర వైభవం, స్వరాజ్యం అవసరం ఈ అంశాలను ఆయన ప్రజల్లో చైతన్యం చేశారు. నేరుగా రాజకీయ రంగంలో పెద్ద పాత్ర పోషించకపోయినా, ఆయన రచనలు స్వాతంత్ర్య భావజాలానికి బలాన్నిచ్చాయి.

**భాషా పరిరక్షణలో కృషి**

తెలుగు భాషను కాపాడడం, తెలంగాణాలో తెలుగు విద్యను విస్తరించడం ప్రతాపరెడ్డి జీవిత లక్ష్యం. ఆ కాలంలో తెలంగాణాలో విద్యా వ్యవస్థ ఉర్దూ ఆధారంగానే నడిచేది. తెలుగు పాఠశాలలు కొద్దిగా మాత్రమే ఉండేవి. ఈ పరిస్థితిని ఎదుర్కొంటూ తెలుగు పుస్తకాలు ప్రచురించడం, పత్రిక నడపడం, తెలుగు చరిత్ర రాయడం ఆయన ధైర్యం. ఆయన చేసిన ఈ కృషి వలన తెలంగాణాలో తెలుగు భాషా ఉద్యమానికి బలమైన బాట వేసింది.

**వారసత్వం -స్ఫూర్తి**

సురవరం ప్రతాపరెడ్డి కేవలం ఒక రచయిత కాదు. ఆయన తెలంగాణా ఆత్మస్ఫూర్తి. ఆయన జీవితాన్ని అధ్యయనం చేస్తే, ఒక వ్యక్తి తన కలం ద్వారా సమాజంలో ఎలాంటి మార్పుతేగలడో తెలుస్తుంది. ఆయన సాహిత్యం సామాజిక వాస్తవాలను ప్రతిబింబించింది. ఆయన చరిత్ర గ్రంథాలు జాతి చైతన్యాన్ని పెంచాయి. ఆయన సంపాదకత్వం ప్రజలకు వేదికను అందించింది.

ఈ రోజున విద్యా హక్కులు, భాషా పరిరక్షణ, సామాజిక సమానత్వం కోసం పోరాడుతున్న వారికి ఆయన ఒక స్ఫూర్తి. విద్యను అందరికీ హక్కుగా చేయాలన్న సంకల్పానికి ఆయన ఆరంభదీప్తి.

సురవరం ప్రతాపరెడ్డి జీవితం మనకు చెప్పే ప్రధాన సందేశం విద్య, భాష, చరిత్ర ఏ ఒక్కదాన్ని నిర్లక్ష్యం చేస్తే జాతి వెనుకబడి పోతుంది. వాటిని రక్షించడానికి ధైర్యంగా పోరాడాలి. తెలంగాణా భూభాగంలో ఆయన వెలిగించిన జ్ఞాన దీప్తి నేటికీ ప్రేరణ. ఆయన పేరు తెలుగు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. సురవరం ప్రతాపరెడ్డి - చరిత్రకారుడి కళ్లతో సమాజ దృశ్యం.

సురవరంప్రతాపరెడ్డి కేవలం కవి, జర్నలిస్టు మాత్రమే కాదుబీ ఒక దూరదృష్టి కలిగిన చరిత్రకారుడు కూడా. ఆయన రాసిన 'ఆంధ్రుల సంగ్రామ చరిత్ర" గ్రంథం నేటికీ చరిత్రకారులకు ఆధారగ్రంథం. చరిత్ర అంటే కేవలం రాజులు, యుద్ధాల కథలు కాదుబీ ప్రజల పోరాటాలు, వారి జీవనశైలులు, భాష, సంస్కృతి, శ్రమ, ఆత్మగౌరవం అన్నీ కలిసి జాతి గాథ అవుతుందని ఆయన నిరూపించారు. ఈ దృక్కోణం ఆయనను ఇతర చరిత్రకారుల కంటే ప్రత్యేకంగా నిలబెట్టింది.ఆయన రాసిన చరిత్రలో కేవలం రాజకీయాలు కాకుండా ప్రజల కష్టాలు, రైతుల శ్రమ, వృత్తిజీవుల పాత్ర కూడా ప్రతిఫలించాయి. ఇది ఆధునిక ప్రజా చరిత్ర దిశగా వేసిన మొదటి అడుగులుగా చెప్పుకోవచ్చు. ఆయన దృష్టిలో చరిత్ర అంటే "జాతి ఆత్మస్ఫూర్తి"కి అద్దం.ప్రతాపరెడ్డి రచనలు కేవలం చరిత్రకు పరిమితం కాలేదు. ఆయన కవిత్వంలో సామాజిక న్యాయం, స్వాతంత్ర్యం, భాషా గౌరవం ప్రతిధ్వనించాయి. ఆయన వ్యాసాలు ప్రజల్లో చైతన్యం రేకెత్తించాయి. ఆయన 'గోలకొండ కవులు"లిలి పుస్తకం తెలంగాణా సాహిత్యానికి ఒక రక్షకగోడలా నిలిచింది.ఆ కాలంలో తెలంగాణా ప్రాంతానికి చెందిన అనేక మంది కవుల కీర్తి కాల గర్భంలో మాయం అవుతున్న సందర్భంలో, ఆయన చేసిన సేకరణ వల్ల ఆ కవుల రచనలు వెలుగులోకి వచ్చాయి. ఒక ప్రాంతం సాహిత్యం కూడా జాతి వారసత్వంలో భాగమని, దానిని కాపాడుకోవాలని ఆయన ఉద్ఘాటించారు.

**సమకాలీన మేధావుల అభిప్రాయాలు**

సురవరం ప్రతాపరెడ్డి గురించి సమకాలీనులు పలువురు గొప్ప మాటలు చెప్పారు. మహాకవి శ్రీశ్రీ ఆయనను "తెలంగాణా గళం" అని ప్రశంసించారు. వేమన, గురజాడ, కందుకూరిల తరువాత ప్రజల సమస్యలపై దృష్టి పెట్టిన సాహిత్యకారుడిగా ప్రతాపరెడ్డి పేరు నిలిచింది. ఆయన పత్రిక 'గోలకొండ' తెలంగాణాలో "జ్ఞాన ప్రబోధం"గా మారింది.డాక్టర్ మొట్టూరి సత్యనారాయణ ఒక సందర్భంలో "తెలంగాణా చరిత్రను తెలంగాణా మట్టి వాసనతో రాసిన తొలి చరిత్రకారుడు ప్రతాపరెడ్డి" అని వ్యాఖ్యానించారు.

**ఆయన్ను అనుసరించిన తరాలు**

సూరవరం ప్రతాపరెడ్డి కృషి వలన తెలంగాణా విద్యార్థుల్లో భాషా గౌరవం పెరిగింది. తెలుగు నేర్చుకోవడం ఒక గౌరవమని, తమ చరిత్రను తెలుసుకోవడం ఒక బాధ్యత అని ఆయన తరానికి తర్వాతి విద్యార్థులు గ్రహించారు. ఆయన పుస్తకాల ప్రభావం వల్ల తెలంగాణాలో తెలుగు సాహిత్య సంఘాలు, పాఠశాలలు, వేదికలు విస్తరించాయి.

అలాగే ఆయన చూపిన చరిత్రాత్మక దృష్టి అనేక రచయితలను ప్రేరేపించింది. తద్వారా తెలంగాణా చరిత్ర, సాహిత్యం వేరే ప్రాంతాల చరిత్రలలో లయమై మాయమవకుండా స్వతంత్ర గుర్తింపును పొందింది.

**జర్నలిజం-ప్రజలకు అద్దం**

సురవరం ప్రతాపరెడ్డి జర్నలిజం అంటే కేవలం వార్తల సమాహారం కాదుబీ సమాజానికి అద్దం అని భావించారు. ఆయన 'గోలకొండ' పత్రికలో భాష, సంస్కృతి, ప్రజా సమస్యలపై లోతైన విశ్లేషణలు వెలువడ్డాయి. ఒక వారం వారం వచ్చే పత్రిక ఎలా ఒక ప్రాంతానికి జ్ఞానవేదికగా మారగలదో ఆయన చూపించారు. నైజాం పాలనలో సెన్సార్ ఉన్నప్పటికీ, ఆయన ధైర్యంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

-షహనాజ్



# దుఃఖ నివారణకు భగవాన్ బుద్ధుని .. పంచశీల - అష్టాంగ మార్గం- బోధనలు



ఈ ప్రపంచం దు:ఖమయం. దు:ఖానికి మనిషిలో గల దుష్ట ప్రవర్తన, సంపద మీద ఆధిపత్యం కలిగి ఉండటం అనేవి రెండు కారణాలు. పంచ శీలాలను మరియు అష్టాంగ మార్గాలను అనుసరించడం ద్వారా దుకా?న్ని నిర్మూలించవచ్చు అని భగవాన్ బుద్ధుడు ఉపదేశించారని డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ వివరించారు.. శీలం అంటేనే వ్యక్తిత్వం . వ్యక్తిత్వ నిర్మాణం కోసం ఐదు నియమాలను అనుసరించమని భగవాన్ బుద్ధుడు ఉపదేశించారు. వీటిని పంచశీల అంటారు. పంచశీలలు బోధించారు : భగవాన్ బుద్ధుడు ఉపదేశించిన ఈ ఐదు నియమాలను తప్పనిసరిగా ఆచరించాలి.వీటిని ఆచరించడం వలన మనఃశ్శాంతిని పొందవచ్చును.

1. ప్రాణులను చంపను అనే నియమానికి కట్టుబడియుంటాను.
2. చౌర్యానికి పాల్పడను అనే నియమానికి కట్టుబడియుంటాను.
3. అనైతికమైన లైంగిక సంబంధాలు కలిగియుండను అనే నియమానికి కట్టుబడియుంటాను.
4. అసత్య భాషణము చేయను అనే నియమానికి కట్టుబడియుంటాను.
5. ప్రమాదమునకు హేతువు అయినట్టి మత్తు పానీయములను త్రాగను అనే నియమానికి కట్టుబడియుంటాను.



**నాలుగు మహోన్నత సత్యాలు** : బౌద్ధమతంలో "నాలుగు పరమ సత్యాలు"ప్రవచింపబడ్డాయి. వీటిని 'చతురారియ సత్యాలు' అంటారు.

1. దు:ఖము. 2. దు:ఖానికి కారణము. 3. దు:ఖం నుండి విముక్తి. 4. దు:ఖాన్నుండి ముక్తిని పొందే మార్గం.

ఇవి గౌతమ బుద్ధుడు తన జ్ఞానోదయం తరువాత తన సహ సాధకులైన ఐదుగురు శ్రమణులకు చెప్పిన విషయాలు కనుక బుద్ధుని మొదటి బోధనలు, "ధర్మ చక్ర పరివర్తన సూత్రం" అనే బుద్ధుని మొదటి బోధలో బుద్ధుడు మధ్యే మార్గం గురించి, అష్టాంగ సాధనా మార్గం గురించి,నాలుగు పరమ సత్యాల గురించి చెప్పాడు.

ఈ నాలుగు పరమ సత్యాలు అనే విషయాన్ని ఒక మత ప్రబోధంగా కాక అప్పటి కాలంలో ఉన్న ఉపశమన విధానం కష్టాలు తీర్చే మార్గంగా చెప్పాడు. థేరవాదుల భావం ప్రకారం ఈ నాలుగు పరమ సత్యాలూ ధ్యానానికి అర్హులైన సాధకులకు మాత్రమే తెలిసే ఉన్నత భావాలు మహాయానుల భావం ప్రకారం ఉన్నత స్థాయి మహాయాన సూత్రాలను అందుకొనే స్థాయికి ఇంకా ఎదగని సాధకులకు ఆరంభ దశలో చెప్పవలసిన సూత్రాలు ఇవి.దూర ప్రాచ్య దేశాలలో వీటికి చెప్పుకోదగిన ప్రాచుర్యం లేదు.

**అష్టాంగ మార్గం** : నాలుగు పరమ సత్యాలలో నాలగవదైన దుక? విమోచనా మార్గం అష్టాంగ మార్గం. ఆరంభ కాలం బౌద్ధ గ్రంథాలలో నాలుగు నికాయాలలో అష్టాంగ మార్గం సామాన్యులకు బోధించేవారు కారు.అష్టాంగ మార్గం మూడు విభాగాలుగా విభజింపబడింది: శీలము భౌతికమైన చర్యలు , సమాధి మనస్సును లగ్నం చేయుట, ధ్యానము, ప్రజ్ఞ అన్నింటినీ తాత్విక దృష్టితో పరిశీలించడం.

**శీలము** : శరీరం, మాటల ద్వారా చెడును కలుగనీయకుండడం.

**1.సమ్యక్ వచనము** - నొప్పించకుండా, వక్రీకరించకుండా, సత్యంగా మాట్లాడడం. 2. సమ్యక్ కర్మము - హాని కలిగించే పనులు చేయకుండుట. 3. సమ్యక్ జీవనము - తనకు గాని, ఇతరులకు గాని, ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని కీడు కలుగకుండా జీవించడం. సమాధి : మనసును అదుపులోకి తెచ్చుకోవడం.

4. సమ్యక్ వ్యాయామము - ప్రగతి కోసం మంచి ప్రయత్నం చేయుట. 5. సమ్యక్ స్మృతి - స్వచ్ఛమైన దృష్టితో విషయాలను స్పష్టంగా చూడగలగడం.
6. సమ్యక్ సమాధి - రాగ ద్వేషాలుకు అతీతంగా మనసును స్థిరపరచుకొని సత్యాన్ని అన్వేషించడం.

ప్రజ్ఞ : మనసును శుద్ధ పరచే జ్ఞానము. 7. సమ్యక్ దృష్టి - అనిపించేలాగా కాకుండా (భ్రమ పడకుండా) ఉన్నది ఉన్నట్లుగా చూడగలగడం. 8. సమ్యక్ సంకల్పము - ఆలోచించే విధానంలో మార్పు. ఈ ఎనిమిది మార్గాలను పలు విధాలుగా వివరిస్తారు, విశ్లేషిస్తారు. సాధనలో ఒకో మెట్టూ ఎదగవచ్చునని కొందరంటారు. అలా కాక అన్ని మార్గాలనూ ఉమ్మడిగా ఆచరించాలని మరొక భావన!

"అన్ని మార్గాలలోకి అత్యుత్తమ మార్గం అష్టాంగ మార్గం. అన్ని సత్యాలలోకి అత్యుత్తమ సత్యాలు నాలుగు ఆర్య సత్యాలు. రాగరహిత స్థితి అన్ని స్థితులలోకి మంచిది. ద్విపాదులలో అత్యుత్తముడు జ్ఞాన దర్శి." సకల జీవులు సుఖ, శాంతులతో వర్ధిల్లుగాక!

-అస శ్రీరాములు
సీనియర్ జర్నలిస్ట్
9440037196



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్
ఆదివారం
24 । ఆగస్టు । 2025

# బెట్టింగ్ యాప్స్ కేసు.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్..



**గ్యాంగ్‌టక్-నవభూమి:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న ఆరోపణలతో కర్ణాటక ఎమ్మెల్యే కేసీ వీరేంద్రను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. శనివారం సిక్కిమ్‌లోని గ్యాంగ్‌టక్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులను కూడా ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న ఆరోపణలతో కేసీ వీరేంద్రకు చెందిన 60 ప్రదేశాల్లో యాంటీ మనీ ల్యాండరింగ్ ఏజెన్సీ నిన్న (శుక్రవారం) సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భాగంగా పెద్ద మొత్తంలో నగదు, బంగారం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకుంది. ఏకంగా 12 కోట్ల నగదు దొరికింది. ఇందులో కోటి రూపాయలు విలువ చేసే ఫారెన్ కరెన్సీ కూడా ఉంది. నగదుతో పాటు 6 కోట్ల విలువ చేసే బంగారు నగలు, 10 కేజీల వెండి నగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నాలుగు వాహనాలను కూడా సీజ్ చేశారు. ఎమ్మెల్యేకు చెందిన 17 బ్యాంకు అకౌంట్లను, రెండు బ్యాంకు లాకర్లను సెంట్రల్ ఏజెన్సీ ఫ్రీజ్ చేసింది. కేసీ వీరేంద్రతో పాటు ఆయన సోదరుడు కేసీ నాగరాజు, అతడి కొడుకు పృథ్వీ ఎన్ రాజ్‌కు చెందిన పలు ఆస్తుల తాలూకా డాక్యుమెంట్స్‌ను ఈడీ సీజ్ చేసింది. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కేసీ తిప్పెస్వామీ, పృథ్వీ ఎన్ రాజ్‌లు దుబాయ్ నుంచి ఆన్‌లైన్ గేమింగ్స్ నిర్వహిస్తున్నారు. ఇక, ఎమ్మెల్యేను అరెస్ట్ చేసిన తర్వాత అధికారులు ఆయన్ని గ్యాంగ్‌టక్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

# మన దైనందిన జీవితాలను మార్చడంలో స్పేస్ టెక్నాలజీ పాత్ర కీలకం : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత పరిపాలనలో, మన దైనందిన జీవితాలను మార్చడంలో అంతరిక్ష సాంకేతికత గొప్ప భూమిక వహించబోతోందని ప్రధాని మోదీ చెప్పారు. దీనివల్ల దేశంలో ఏకీకరణ పెరుగుతోందని, పంటల బీమా.. విపత్తు నిర్వహణ నుండి మత్స్య సంపద.. మౌలిక సదుపాయాల ప్రణాళికల వరకు అనేక రంగాలపై దాని ప్రభావాన్ని ప్రధాని నొక్కిచెప్పారు. న్యూఢిల్లీలో ఇవాళ(శనివారం) జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగించిన ప్రధాని మోదీ, వ్యవసాయ పథకాలకు ఉపగ్రహ ఆధారిత అంచనాలు, గతి శక్తి , జాతీయ మాస్టర్ ప్లాన్ కింద జియోస్పేషియల్ మ్యాపింగ్ వంటి పురోగతులు సాధారణ పౌరులకు సురక్షితమైన, ఎక్కువ సమాచారాన్ని ఇస్తాయని, ఇది అంతరిక్ష ఆవిష్కరణలో దేశ అద్భుతమైన పురోగతిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో అంతరిక్ష రంగంలో ఐదు యునికార్న్‌లను సృష్టించగలరా అని ప్రధానమంత్రి భారతదేశ అంతరిక్ష స్టార్టప్‌లను ఈ సందర్భంగా అడిగారు. భారతదేశం ఏటా 50 రాకెట్లను ప్రయోగించే స్థాయికి చేరుకోవడానికి వీలుగా రాబోయే ఐదు సంవత్సరాలలో ప్రైవేట్ రంగ కంపెనీలు ముందుకు రావాలని ఆయన కోరారు.

# బాను ముస్తాక్ చేతుల మీదుగా మైసూరు దసరా ఉత్సవాలు



**బెంగళూరు - నవభూమి:** మైసూరు దసరా ఉత్సవాలు దేశంలోనే ఎక్కడా జరగని రీతిలో నిర్వహిస్తారు. అందుకు ప్రత్యేకమైన విధి విధానాలు ఉన్నాయి. ఏటా ఓ సాహితీవేత్త లేదా ప్రముఖుల ద్వారా ఉత్సవాలను ప్రారంభించే సంప్రదాయం ఉంది. ఈ ఏడాది దసరా ఉత్సవాలను ప్రముఖ రచయిత్రి, బుకర్‌ప్రైజ్ విజేత బానుముస్తాక్ ప్రారంభించనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. బానుముస్తాక్ రచించిన హృదయదీప రచనకు బుకర్‌ప్రైజ్ లభించిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 22నుంచి అక్టోబరు 2దాకా 11రోజులపాటు మైసూరులో దసరా ఉత్సవాలు జరగనున్నాయి. దసరా ఉత్సవాలు మైసూరులో రెండు ప్రత్యేక విధి విధానాలతో జరుగుతాయి. ప్రారంభం రోజున ప్రత్యేక ఆహ్వానితులతోపాటు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, అధికారులు పాల్గొంటారు. చాముండేశ్వరిదేవికి పుష్పార్చన ద్వారా శ్రీకారం చుట్టే ఉత్సవాలలో ప్రతిరోజూ సాహిత్య, సాంస్కృతిక, నృత్య కళాప్రదర్శనలు ఉంటాయి.

# ధర్మస్థలపై అనవసర ఆరోపణలు తగవు: బీజేపీ

**బెంగళూరు - నవభూమి:** ధర్మస్థల పుణ్యక్షేత్రంపై అనవసర ఆరోఫలు చేయడం తగదని బీజేపీ నాయకులు శుక్రవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డినేతృత్వంలో నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా రాయల్ సర్కిల్‌లో మానహారం ఏర్పడి ధర్మస్థలపై ఆరోపణలు చేయడం మంచిది కాదని నినదించారు. అనంతరం ర్యాలీగా వచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక మతిస్థిమితం లేని వ్యక్తి, అదీ ఎవరోడబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తుల మాటల ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం సిగ్గుచేటని సీఎంపై నిప్పులు చెరిగారు. హిందుత్వాన్ని దెబ్బతీసే విధంగా కొందరు వ్యక్తులు కావాలనే ధర్మస్థలపై నిందలు వేశారని అన్నారు. అనంతరం డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోత్కర్ శ్రీనివాసులు, రాష్ట్ర మహిళా నాయకురాలు డాక్టర్ అరుణ, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్‌ప్లాజాలలో టోల్ ఫ్రీ..



**ముంబై- నవభూమి:** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్‌ప్లాజాలలో టోల్ మినహాయింపు కల్పిస్తున్నట్లు ప్రకటన చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాలుష్యం తగ్గించడంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల కొయిఅగోలును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పెరుగుతన్న కాలుష్యం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వం కాలుష్యం తగ్గించే దిశగా చర్యలు మొదలుపెట్టింది. ఈ మేరకు ఎలాక్ట్రిక్ వాహనాలకు టోల్ మినాహాయింపు ప్రకటించింది. ఎలాక్ట్రిక్ కార్లు, బైకులకు టోల్ ఫ్రీ చేస్తూ..నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రజలు ఎలాక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయడానికి మొగ్గుచూపుతారని ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేస్తుంది.

దీనితో పాటు రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న ఎలాక్ట్రిక్ వాహనాల కంపెనీలు ఏర్పాడుతాయని భావిస్తుంది. గతంలో ఢిల్లీలో వాహన కాలుష్యంతో ఏర్పడిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోనూ వాహన కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం టోల్ ట్యాక్స్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

# దేశంలో అత్యంత ధనిక, పేద ముఖ్యమంత్రులు వీళ్లే.. జాబితాలో చంద్రబాబు నాయుడు, మమతా బెనర్జీ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత రాజకీయాల్లో ముఖ్యమంత్రుల ఆస్తులకు సంబంధించిన నివేదికలు ఎప్పుడూ ఆసక్తిని రేకెత్తిస్తాయి. ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) తాజాగా విడుదల చేసిన ఓ నివేదిక దేశంలో అత్యంత ధనిక, పేద ముఖ్యమంత్రులు ఎవరో తేల్చి చెప్పేసింది. ఈ నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా నిలిచారు. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అత్యంత తక్కువ ఆస్తులు కలిగిన సీఎంగా జాబితాలో చివరి స్థానంలో ఉన్నారు. మరి మిగతా స్థానాల్లో ఎవరెవరున్నారో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన తర్వాత ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లలో పొందుపరిచిన ఆస్తుల వివరాలు ఆధారంగానే అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) ఈ నివేదికను రూపొందించింది. అలా ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన చంద్రబాబు నాయుడు ఆస్తుల విలువ రూ. 931 కోట్లకు పైగా ఉంది. ఆ తర్వాత అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ రూ. 332 కోట్లకు పైగా ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారు. ఇక మూడో స్థానంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ. 51 కోట్లకు పైగా ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ధనిక ముఖ్యమంత్రులకు పూర్తి విరుద్ధంగా తక్కువ ఆస్తులు కలిగిన ముఖ్యమంత్రుల జాబితా కూడా ఈ నివేదికలో ఉంది. ఈ జాబితాలో మొదటి స్థానంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉన్నారు. ఆమె మొత్తం ఆస్తుల విలువ రూ. 15.38 లక్షలకు పైగా మాత్రమే. ఇది దేశంలోని ముఖ్యమంత్రులందరిలోకెల్లా అత్యంత తక్కువ మొత్తం. 2021 సెప్టెంబర్ 30వ తేదీన జరిగిన భొవానీపొర అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా మమతా బెనర్జీ అఫిడవిట్ దాఖలు చేశారు. దాన్ని ఆధారంగా చేసుకునే ఏడీఆర్ నివేదిక ఈ ఆస్తుల వివరాలు తెలియజేసింది. అయితే 2020-21లో దాఖలు చేసిన ఆదాయం పన్ను రిటర్న్‌లో ఆమె కేవలం రూ.15.38 లక్షలు మాత్రమే చూపించారు. ఇక రెండో స్థానంలో జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ. 55.24 లక్షలకు పైగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. అలాగే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రూ. 1.18 కోట్ల ఆస్తులతో ఈ జాబితాలో ఉన్నారు. ఇది మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల ఆస్తుల విలువ రూ.1630 కోట్లు అని నివేదిక స్పష్టం చేసింది.

# భారత్‌లోకి టిక్‌టాక్ రీఎంట్రీ.. కేంద్రం ఏమన్నదంటే



**న్యూఢిల్లీ-నవభూమి:** టిక్‌టాక్ ఒకప్పుడు భారతీయులను ఉర్రూతలుగించిన యాప్. దీనిలో వీడియోలు చేస్తూ.. చాలా మంది సామాన్యులు సెలబ్రిటీలు అయ్యారు. ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఇన్‌స్టా, యూట్యూబుల్లో క్రేజ్ సంపాదించుకున్న వారిలో చాలా మంది టిక్‌టాక్ ద్వారానే ఫేమ్ పొందారు. కేంద్రం దీనిపై నిషేధం విధించాక వీరంతా మిగతా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇక తూర్పు లఢఖ్‌లోని గల్వాన్ లోయలో చైనా, ఇండియ మధ్య చోటు చేసుకున్న ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో.. కేంద్రం టిక్‌టాక్ సహా పలు చైనా యాప్‌లను బ్యాన్ చేసింది. భారత్‌లో యూఎస్ తదుపరి రాయబారిగా ట్రంప్ సన్నిహితుడు.. అసలెవరీ సెర్గియో గోర్?

గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత.. పలు చైనా యాప్‌ల ద్వారా భారతీయుల డేటాకు సంబంధించిన భారీ స్థాయిలో సెక్యూరిటీ నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం డ్రాగన్ కంట్రీకి చెందిన యాప్‌ల మీద నిషేధం విధించింది. మొత్తం 118 యాప్‌ల మీద నిషేధం విధించగా.. వీటిల్లో టిక్‌టాక్ కూడా ఉంది. ఈక్రమంలో తాజాగా టిక్‌టాక్‌కు సంబంధించి ఆసక్తికర వార్త వెలుగులోకి వచ్చింది. నిషేధం విధించిన ఐదేళ్ల తర్వాత టిక్‌టాక్ మళ్లీ భారత్‌లోకి ఎంట్రీ ఇస్తుందనే వార్త తెగ వైరల్ అవుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇచ్చింది. ఆ వివరాలు..నిన్నటి నుంచి సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన వార్త తెగ వైరల్ అవుతోంది. ప్రముఖ చైనా యాప్?లు టిక్‌టాక్, షీన్, అలీ ఎక్స్‌ప్రెస్ వంటివి తిరిగి ఇండియాలోకి ఎంట్రీ ఇచ్చినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీనిపై కేంద్రం ప్రభుత్వం స్పందిస్తూ క్లారిటీ ఇచ్చింది. టిక్‌టాక్, షీన్ వంటి చైనా యాప్‌ల మీద భారతదేశంలో నిషేధం ఇంకా కొనసాగుతూనే ఉందని స్పష్టం చేసింది. దీంతో భారత్‌లోకి టిక్‌టాక్ రీ ఎంట్రీ అనే వార్తలకు చెక్ పడింది. మరి ఇంతకు ఈ ప్రచారం ఎందుకు తెర మీదకు వచ్చిందంటే.. ప్రస్తుతం ఇండియా, చైనా మధ్య చోటు చేసుకుంటున్న పరిణామాల వల్ల ఇలాంటి ప్రచారం తెర మీదకు వచ్చింది. ప్రస్తుతం భారత్, చైనా మధ్యఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టాయనే అంటున్నారు. చర్చల ద్వారా సమస్యలు ఓ కొలిక్కి వచ్చినట్లు భావిస్తున్నారు. అలానే ఇరు దేశాల నేతలు పర్యటనలు, చర్చలు నిర్వహించి.. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకునేందుకు అంగీకరించారు. అన్నింటి కంటే ముఖ్యమైంది ఆగస్టు నెలాఖర్లో.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. చైనాలో జరిగే షాంఘై కో ఆపరేషన్ సమ్మిట్ (ఎస్‌సీఓ) సమావేశానికి హాజరు కానున్నారు. దీంతో చాలా మది నెటిజనులు.. టిక్‌టాక్ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిందంటూ ప్రచారం మొదలు పెట్టారు. కానీ ప్లేస్టోర్‌లో మాత్రం ఇప్పటి వరకు టిక్‌టాక్ యాప్ కనపించలేదు. ఇప్పుడు కేంద్రం కూడా వీటిపై నిషేధం కొనసాగుతుందని క్లారిటీ ఇవ్వడంతో ఈ ప్రచారానికి తెర పడంది.

# యానాంలో గ్యాస్ పైప్‌లైన్ లీక్



**యానాం- నవభూమి:** కాకినాడ, కోనసీమ జిల్లాల సరిహద్దు, పుదుచ్చేరి రాష్ట్ర పరిధిలోని యానాం సముద్రం నుంచి గోదావరి మీదుగా వెళ్లిన ఓఎన్జీసీ గ్యాస్‌పైప్‌లైన్ శుక్రవారం తెల్లవారుజామున 2.30గంటలకు లీక్ అవ్వడంతో మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఒక్కసారిగా ఆకాశం ఎరుపెక్కింది. 40 అడుగుల మేర మంటలు ఎగసిపడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయంపై స్థానికులు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే ఓఎన్జీసీ, యానాం పరిపాలనాధికారి, పోలీసులతో మాట్లాడి తక్షణం సంఘటన ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. ఓఎన్జీసీ సేఫ్టీ అధికారులు పైప్‌లైన్ నుంచి వచ్చే గ్యాస్‌పైప్ వాల్‌ను సముద్రంలోనే మూసివేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. సంఘట ప్రాంతానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' టీమ్ సాహసోపేతంగా వెళ్లింది. అక్కడ నీటి నుంచి బుడగల రూపంలో నీరు పొంగడంతో పాటు సమీపంలోని మడ అడవులు కిలోమీటరు మేర అగ్నికి ఆహుతయ్యాయి. నిషేధిత పాఠశాలలను ఆధీనంలోకి తీసుకున్న జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం

# నిషేధిత పాఠశాలలను ఆధీనంలోకి తీసుకున్న జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం



**జమ్మూ- నవభూమి:** జమ్మూకశ్మీర్‌లో నిషేధిత జమాతే ఇస్లామీతో.. సంబంధం ఉన్న 215 పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంది. 2019లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జమాత్‌ను నిషేధించిన తర్వాత పాఠశాల నిర్వహణ కమిటీలు లేకపోవడంతో ఈ పాఠశాలలు రిజిస్ట్రేషన్ రద్దు చేశారు. దీంతో వేలాది మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఆ విద్యార్థుల విద్యను కాపాడాటానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పాఠశాలల నిర్వహణను జిల్లా న్యాయాధికారులుకు అప్పగిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూడా అనుమతి తెలిపారని విద్యాశాఖ మంత్రి సకినా ఇటూ అన్నారు. జమాత్ పై నిషేధం తర్వాత దాదాపు 300 పాఠశాలలు దర్యాప్తు పరిధిలోకి వచ్చాయని మంత్రి సకినా ఇటూ తెలిపారు. నిఘా సంస్థల దర్యాప్తు ఆధారంగా, 50 పాఠశాలలకు క్లీన్ చిట్ ఇవ్వబడిందని పేర్కొన్నారు. అయితే, 215 పాఠశాలల నిర్వహణ కమిటీలపై ప్రతికూల నివేదికలు వచ్చాయని చెప్పుకొచ్చారు. నిషేధిత సంస్థ జమాత్-ఎ-ఇస్లామి/ఫలాహ్-ఎ-ఆమ్ ట్రస్ట్‌తో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుబంధంగా ఉన్న అనేక పాఠశాలలను నిఘా సంస్థలు గుర్తించాయని చెప్పారు. అలాంటి 215 పాఠశాలల మేనేజింగ్ కమిటీ చెల్లుబాటు గడువు ముగిసిందని వివరించారు.

215 పాఠశాలల మేనేజింగ్ కమిటీని సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్/డిప్యూటీ కమిషనర్ స్వాధీనం చేసుకుంటారని మంత్రి సకినా ఇటూ పేర్కొన్నారు. వీటిని సక్రమంగా ధృవీకరించిన తర్వాత సంబంధిత పాఠశాలలకు తగిన సమయంలో కొత్త మేనేజింగ్ కమిటీని ప్రతిపాదిస్తారని తెలిపారు. ఈ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల విద్యా వృత్తిపై ఎలాంటి ప్రభావం పడకుండా ఉండేలా పాఠశాల విద్యా శాఖతో సంప్రదించి, సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పాఠశాలల్లో నిబంధనల ప్రకారం నాణ్యమైన విద్యను అందించడానికి అవసరమైన అన్ని చర్యలు కూడా తీసుకోవాలని మంత్రి సూచించారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ దళపతి పోటీ చేయబోయేది అక్కడి నుంచే.. హింట్ ఇచ్చేశారుగా!



**చెన్నై- నవభూమి:** తమిళ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నటుడిగా ఉన్న విజయ్ దళపతి రాజకీయ ప్రవేశంపై గత కొంతకాలంగా ఊహాగానాలు కొనసాగుతు న్నాయి. పార్టీ అయితే స్థాపించాడు కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తాడా లేదా చేస్తే ఎక్కడి నుంచి చేస్తాడని చాలా మంది ఊహాగానాలు వ్యక్తం చేశారు. అయితే తాజాగా విజయ్ వీటన్నిటికీ ఓ సమాధానం చెప్పారు. నేరుగా ఈ అంశాన్ని ప్రస్తావించకపోయినా ఓ నియోజకవర్గం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అక్కడి మహిళలు ఏం మాట్లాడుకుంటున్నారో కూడా చెప్పి.. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తాను అక్కడి నుంచే పోటీ చేయబోతున్నట్లు హింట్ ఇచ్చేశారు. మరి ఆ నియోజకవర్గం ఏంటి, విజయ్ అసలు దేని గురించి మాట్లాడారో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి. మధురై గ్రామీణ ప్రాంతంలోని పచ్చని వరి పొలాల గుండా మొత్తటి గాలి వీస్తోందని ఇటీవలే ఓ కార్యక్రమంలో విజయ్ చెప్పారు. అయితే రెండు పెద్ద కొండల మధ్య మోకాళ్ల లోతు నీటిలో వంగి మహిళా కార్మికులు అంతా నాట్లు వేస్తున్నారని వివరించారు. అయితే ఎప్పటిలాగానే వారు మాట్లాడుతూ పని చేస్తున్నా.. కానీ ఈసారి వారు రాజకీయాల గురించి మాత్రమే మాట్లాడుతున్నారని చెప్పారు. తమిళనాడులోని రెండు ఆధిపత్య ద్రవిడ పార్టీలతో తాము నిరాశ చెందామని వారు మాట్లాడుకుంటున్నట్లు పేర్కన్నారు. ముఖ్యంగా రెండు సార్లు ఆకులు, రెండు సార్లు ఉదయించే సూర్యుడికి ఓటు వేసి తాము నష్టపోయామని.. ఇక ఈసారి మాత్రం విజయ్‌కే వేస్తామని వారు మాట్లాడుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఇదంతా చూస్తుంటే తమిళనాడు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో.. విజయ్ మధురై తూర్పు ప్రాంతం నుంచి పోటీ చేయబోతున్నట్లు అర్థం అవుతోంది. నేరుగా విజయ్ ఈ విషయాన్ని చెప్పకపోయినా ఇండైరెక్టుగా హించ్ ఇచ్చేశారని అంతా భావిస్తున్నారు. ముఖ్యంగా అక్కడి నియోజకవర్గ మహిళలు అంతా.. ఎంజీఆర్ తర్వాత తమను తమ సొంత మనుషుల్లా చూసిన ఒక్క నాయకుడూ లేడని.. ఇప్పుడు విజయ్ తమను అలాగే చూస్తాడని వారు మాట్లాడుకుంటున్నట్లు టీవీకే అధినేత వెల్లడించారు. విజయ్ ఎంచుకున్న మధురై తూర్పు నియోజకవర్గం తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. తరచుగా రాష్ట్ర ప్రభుత్వాలను నిర్ణయించే 'బెల్‌వెదర్'గా ఈ నియోజక వర్గం పరిగణించబడుతుంది. గతంలో ఈ నియోజకవర్గంలో విజయం సాధించిన పార్టీలే చెన్నైలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయన్న నమ్మకం బలంగా ఉంది. ఈ చరిత్రను పరిగణనలోకి తీసుకుంటే.. విజయ్ ఈ స్థానం నుంచి పోటీ చేయాలనే సూచనకు వ్యూహాత్మక ప్రాముఖ్యత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. చూడాలి మరి వచ్చే ఎన్నికల్లో విజయ్ ఎన్ని సీట్లను సొంతం చేసుకుంటారు,

# ప్రేమానంద్ మహారాజ్‌కి కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చిన ముస్లిం యువకుడు



**లక్నో- నవభూమి:** ఉత్తరప్రదేశ్‌కి చెందిన స్వామిజీ ప్రేమానంద్ మహారాజ్ గురించి గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఆయన రెండు కిడ్నీలు చెడిపోయినా సరే.. గత కొన్ని ఏళ్లుగా ఆయన ఎంతో ఆరోగ్యంగా ఉండటమే కాక.. తన రోజువారీ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకుంటున్నారు అనే వార్త సంచలనంగా మారింది. రాధాకృష్ణులను ఆరాధించే ప్రేమానంద్ మహారాజ్ వద్దకు నిత్యం అనేక మంది సెలబ్రిటీలు వస్తూ ఉంటారు. వీరిలో విరాట్ కోహ్లీ, అనుష్క దంపతులు కూడా ఉన్నారు. వీరు తమకు సమయం దొరికప్పుడల్లా.. ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమానికి వచ్చి.. ఆయన ఆశీర్వాదం తీసుకుంటుంటారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం బాలీవుడ్ హీరోయిన్ శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రా ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమానికి వెళ్లారు. స్వామిజీతో మాట్లాడుతుండగా.. వారికి ప్రేమానంద్ కిడ్నీ సమస్య గురించి తెలిసింది. విషయం విన్న రాజ్ కుంద్రా.. తన కిడ్నీని ఇవ్వడానికి ముందు వచ్చారు. ఈ వార్త సంచలనంగా మారింది. ఇదిలా ఉంటే తాజాగా ప్రేమానంద్ మహారాజ్‌కి కిడ్నీ ఇచ్చేందుకు ముస్లిం యువకుడు ముందుకు వచ్చి అందరిని ఆశ్చర్యపరిచాడు. ఆ వివరాలు..

ఆరిఫ్ ఖాన్ చిష్తి అనే ముస్లిం యువకుడు.. కుల, మత తారతమ్యాలను పక్కకు పెట్టి.. మానవత్వాన్ని చాటుకున్నాడు. ప్రేమానంద్ మహారాజ్‌కి కిడ్నీ దానం చేయాలని నిర్ణయించుకున్నాడు. దీని గురించి ప్రేమానంద్ మహారాజ్‌తో పాటుగా, జిల్లా యంత్రాంగానికి లేఖ రాశాడు. జాతీయ ఐక్యత కోసం శ్రమించే ప్రేమానంద్ వంటి వారు నిండు నూరేళ్లు జీవించాలని.. అలానే దేశ సమగ్రతను కాపాడటంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరుకున్నాడు. అందుకే ఆయన కోసం తన కిడ్నీ దానం ఇవ్వడానికి నిర్ణయించుకున్నాను అని ఆరిఫ్ ఖాన్ తెలిపాడు. మధ్యప్రదేశ్, నర్మదాపురం జిల్లాకు చెందిన ఆరిఫ్ ఖాన్.. ఒక చిన్న షాపులో కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఆరిఫ్‌కు ప్రేమానంద్ ప్రవచనాలు అంటే ఎంతో ఆసక్తి. సోషల్ మీడియాలో వాటిని తరచుగా చూస్తూ.. ప్రేమానంద్ పట్ల గౌరవాన్ని పెంచుకున్నాడు. రెండు మతాల మధ్య సఖ్యత, సామరస్యం గురించి ప్రేమానంద్ చెప్పే వ్యాఖ్యలు తనని చాలా ప్రభావితం చేసాయని ఆరిఫ్ చెప్పుకొచ్చాడు. జాతీయ ఐక్యత కోసం కృషి చేస్తోన్న ప్రేమానంద్ మహారాజ్ నూరేళ్లు జీవించాలని.. అందుకే ఆయనకు చిన్న బహుమతిగా తన కిడ్నీని ఇవ్వాలని అనుకుంటున్నట్లు తెలిపాడు. ఆరిఫ్ నిర్ణయం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తోంది. దేశంలోని ప్రజలంతా ఆరిఫ్‌లా ఆలోచిస్తే విద్వేషాలు ఉండవని.. దేశం ప్రశాంతంగా ఉంటుందని అంటున్నారు.

# 20 ఏళ్లు దాటిన వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ ఫీజు పెంపు



**న్యూఢిల్లీ- నవభూమి:** ఇరవై ఏళ్లు దాటిన పాత మోటార్ వాహనాల వాడకాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇలాంటి వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ ఫీజును భారీగా పెంచింది. ఈమేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 20 ఏళ్లు దాటిన లైట్ మోటార్ వాహనాల (ఎల్ఎంవీ) రెన్యూవల్ ఫీజును రూ.5వేల నుంచి రూ.10వేలు చేశారు. 20 ఏళ్లు దాటిన మోటార్‌సైకిళ్ల రెన్యూవల్ ఫీజు రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు పెంచారు. ఇక త్రీవీలర్లు, క్వాడ్రీసైకిళ్ల రెన్యూవల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5వేలకు పెంచారు. కాగా ఇంతకు ముందు మంత్రిత్వ శాఖ 2021 అక్టోబరులో మోటార్ సైకిళ్లు, టూ-త్రీవీలర్లు, కార్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్, రెన్యూవల్ ఫీజును పెంచింది.



## కవ్వించే కుర్తా

పొట్టిగా, పొందికగా ఉండే షార్ట్ కుర్తాలు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. వీటిని సరైన బాటమ్స్‌తో జోడిస్తే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం!

జీన్స్, లెగ్గింగ్స్, జెగ్గింగ్స్ ?ధరించినప్పుడు సౌకర్యంగా ఉండే షార్ట్ కుర్తాలు వేసుకోవచ్చుకాటన్, సింథటిక్ మెటీరియల్స్‌లో దొరికే ఈ చిట్టిపొట్టి కుర్తాలు ఆకర్షణీయంగా, ఆధునికంగా ఉంటాయిసౌకర్యానికి పెద్ద పీట వేసే షార్ట్ కుర్తాలను లాంగ్ స్కర్ట్‌తో మ్యాచ్ చేయొచ్చు ఈవినింగ్ పార్టీలు, ఫ్రెండ్స్‌తో హ్యాంగవుట్స్‌కు షార్ట్ కుర్తాలు స్టైలిష్‌గా ఉంటాయి.

లతలు, పువ్వుల డిజైన్లు ఉన్న షార్ట్ కుర్తాలు యాంకిల్ లెంగ్త్ జీన్స్‌కు చక్కగా నూటవుతాయి. పెన్సిల్ హీల్స్‌ను ఈ డ్రస్‌కు మ్యాచ్ చేస్తే చూడముచ్చటగా కనిపిస్తారు సింపుల్‌గా, హుందాగా కనిపించాలనుకునేవాళ్లు షార్ట్ కుర్తాలను ఎంచుకోవచ్చు చికన్ వర్క్ కుర్తాల్లో షార్ట్ లెంగ్త్ కూడా ఉంటాయి. ఇవి కాలేజీ అమ్మాయిలకు చక్కగా నూటవుతాయి సినిమాలు, షికార్లకు ఈ రకం కుర్తాలు అనువైన స్టైల్!

షార్ట్ కుర్తా ఫుల్ హ్యాండ్స్ వేసినా, షార్ట్ హ్యాండ్ ఉన్నా, స్లీవ్‌లెస్ అయినా... ఎలా ఉన్నా అందంగానే ఉంటుంది. కాబట్టి సందర్భాన్ని బట్టి అనువైన కుర్తా ఎంచుకోవాలి.



# అడుగడుగునా సవాళ్లే

కేరళకు చెందిన సఫ్రినా లతీఫ్ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళగా నిలిచారు. తల్లి, కేక్ ఆర్టిస్ట్‌గా ఉన్న ఆమె, పట్టుదలతో ప్రపంచ అత్యంత ఎత్తయిన పర్వతాన్ని అధిగమించి ప్రేరణగా నిలిచారు.

ఒకప్పుడు బ్యాంకింగ్ రంగంలో సేవలు. ఇప్పుడు కేక్‌ల తయారీలో సిద్ధహస్తురాలు. పిల్ల తల్లి... కళాకారిణి అయిన సఫ్రినా లతీఫ్... 37 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించారు. మంచు తుపానులు... ప్రతికూల వాతావరణ పరిస్థితులు... అడుగడుగునా సవాళ్లు. అన్నిటినీ దాటుకొని... సగర్వంగా జాతీయ జెండా ఎగురవేశారు. ఈ ఘనత సాధించిన తొలి కేరళ మహిళగా చరిత్ర సృష్టించారు. సంకల్పానికి పట్టుదల తోడైతే ఎంతటి శిఖరమైనా అందుకోవచ్చనే జీవిత సత్యాన్ని ఈ విజయం నేర్పిందంటున్న సఫ్రినా జర్నీ ఇది.

"ఉద్వేగం, ఆనందం, ఆశ్చర్యం... ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన ఆ క్షణం నా మదిలో ఎన్నో భావనలు. అంతెత్తున నిలుచున్నప్పుడు ప్రపంచాన్నే జయించిన అనుభూతి. దాన్ని వర్ణించడానికి ఇప్పటికీ మాటలు సరిపోవడంలేదు. కేరళలోని కన్నూర్ జిల్లా వెంగాడ్ మాది. పెళ్లి తరువాత నా నివాసం కతార్‌లోని దోహాకు మారింది. మావారు డాక్టర్ షమీల్ ముస్తఫా దోహా 'హమద్ మెడికల్ కార్పొరేషన్'లో సర్జన్. నేను 'జఫ్రిన్ బెస్పోక్ సుగర్‌టేల్స్' బ్రాండ్‌తో కేక్‌లు తయారు చేస్తాను. పలు అవార్డులు కూడా అందుకున్నాను. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లకే పరిమితమైతే... నేను, మావారు ఫిట్‌నెస్ కోసం జిమ్‌లో చేరాం. అప్పుడు అర్థమైంది... పని ఒత్తిడి పేరుతో మమ్మల్ని మేము ఎంత అశ్రద్ధ చేశామనేది. ఆరంభంలో ట్రెడ్‌మిల్ లాంటి సాధారణ వ్యాయామాలు చేయడానికి కూడా శక్తి సరిపోయేది కాదు. నేనైతే జిమ్‌లో అరగంట సెషన్ కూడా పూర్తికాకుండానే అలసిపోయేదాన్ని. క్రమంగా ఆహారపు అలవాట్లు కూడా మార్చాను. వర్కవుట్స్‌తో శరీరం కాస్త స్వాధీనంలోకి వచ్చాక నాపై నాకు నమ్మకం పెరిగింది. అప్పుడే పర్వతాలు ఎక్కాలనే చిన్ననాటి కోరిక నా మదిలో మెదిలింది. మావారికి చెబితే, ఆయన కూడా ఆసక్తి చూపారు. ఇద్దరం మౌంటెనీరింగ్ శిక్షణలో చేరాం. ఒక్కో లక్ష్యం నిర్దేశించుకొంటూ ముందుకు సాగాను. తొలి ప్రయత్నంగా టాంజానియాలోని కిలిమంజారో ఎక్కాను. ఆ ఉత్సాహంతో అర్జెంటీనాలోని అకోన్‌కాగువా, తరువాత రష్యాలోని ఎల్‌బ్రస్ పర్వతాలను విజయవంతంగా అధిరోహించాను. వీటిల్లో అకోన్‌కాగువా ఎత్తయిన (6,961 మీటర్లు) పర్వతం. ఈ పర్వతారోహణ నాలో ఎనలేని ఆత్మవిశ్వాసం నింపింది. ఎవరెస్టు శిఖరాన్ని ముద్దాడాలన్న బలమైన ఆకాంక్ష రగిల్చింది.

దాంతో కజకిస్తాన్ వెళ్లి మంచు పర్వతాల అధిరోహణలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా.

**ఫిట్‌నెస్ ఉంటేనే సరిపోదు...**

ఎవరెస్టు అధిరోహణ అంటే కేవలం ఫిట్‌నెస్, శిక్షణ మాత్రమే సరిపోవు. పట్టుదల, అంకితభావంతో ఉండాలి. భావోద్వేగాలపై నియంత్రణ సాధించాలి. అన్నిటికీ మించి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. ఈ సాహస యాత్రకు దాదాపు డెబ్భై లక్షలు ఖర్చు అవుతుంది. దీని కోసం బెంగళూరులో ఉన్న మా ఇంటిని అమ్మేశాం. కష్టపడి కొనుక్కున్న ఇల్లు. ఎంతో బాధ కలిగింది. యాత్ర కోసం మొదటి దఫా సొమ్ము చెల్లించినప్పుడు అనుకున్నా... 'ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకూడదు' అని. ఈ ఏడాది జనవరిలో దృఢ సంకల్పంతో కఠోర సాధన మొదలుపెట్టాను. ముందుగా అనుకున్నది నేను, మావారు కలిసి వెళ్లాలని. కానీ ఆఖరి నిమిషంలో ఆయన గాయంతో తప్పుకున్నారు. తరువాత దోహాలోనే పర్వతారోహణలో నైపుణ్యంగల ట్రైనర్ **వద్ద శిక్షణ తీసుకున్నా.**





**అడుగడుగునా సవాళ్లే...**

ఏప్రిల్ మాసం... 12వ తేదీ... గడ్డ కట్టే చలి. ఈదురు గాలులు. ఎవరెస్టు బేస్ క్యాంప్ వైపు నడక మొదలైంది. అంటే నా సాహస యాత్రలో తొలి అడుగు. దట్టంగా మంచు కప్పిన పర్వతంపై... సన్నని దారిలో పదహారు గంటలపాటు సాగింది ప్రయాణం. ఒక క్యాంపు నుంచి మరో క్యాంపునకు. మధ్యలో చిన్నపాటి విరామం. శరీరం ఆ భయంకర వాతావరణానికి కాస్త అలవాటు పడింది. కానీ అసలైన పరీక్ష రెండు రోజుల తరువాత ఎదురైంది. క్యాంపు 2 నుంచి మరింత కఠినంగా ఉంటుంది. అది చూసి మావారికి ఫోన్ చేశాను... 'నేను వెనక్కి వచ్చేస్తా' అని. ఆయన ఒప్పుకోలేదు. 'ఇది మనిద్దరి కల. నువ్వు నెరవేర్చాలి' అని ధైర్యం చెప్పారు. మనసులో వేరే ఆలోచనలు లేకుండా ముందుకు సాగాను. క్యాంపు 3, అంటే 7,100 మీటర్ల ఎత్తుకు వెళ్లాక ఆక్సిజన్ అత్యవసరమైంది. నిదానంగా క్యాంపు 4 వైపు ప్రయాణం మొదలైంది. దాన్ని 'డెత్ జోన్' అని కూడా అంటారు. కొంత దూరం వెళ్లాక ఫిలిప్పీన్ దేశానికి చెందిన పర్వతారోహకుడి శవం కనిపించింది. రెండు రోజుల కిందటే మరణించాడని తెలిసింది. ముందుకు వెళితే మరికొన్ని శవాలు. నా గుండె కొట్టుకొనే వేగం అమాంతం పెరిగింది. చాలా భయం వేసింది. అయితే మా గైడ్ ఇచ్చిన ధైర్యంతో అంతిమ ఘట్టానికి చేరువ అయ్యాం. కానీ వాతావరణం భయంకరంగా ఉంది. మంచు తుపానులు, చల్లని గాలులు, అత్యంత కఠినమైన మార్గం... అన్నిటినీ దాటుకొని మే 18న ఎవరెస్టు అంచుకు చేరాం.

నన్ను నేను నమ్మలేని క్షణం...

ఎవరెస్టు పర్వతం ఎత్తు 8,848 మీటర్లు. అంత ఎత్తుకు వెళ్లి నిలుచున్నప్పుడు నన్ను నేను నమ్మలేకపోయాను. ప్రపంచంలోకెల్లా ఎత్తయిన పర్వతం అధిరోహించానన్న వాస్తవం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను. కన్నీళ్లు ఆగలేదు. అక్కడ భారత్, కతార్ పతాకాలు ఎగురవేశాను. అయితే పైకి వెళ్లగానే గాగుల్స్ లేకుండా ఎవరెస్టును చూడాలనుకున్నాను.

కళ్లద్దాలు తీయగానే మంచు తుపాను తాకిడికి ఉన్నట్టుండి నా చూపు మందగించింది. ఏదీ స్పష్టంగా కనిపించలేదు. ఒళ్లంతా నొప్పులు. చేతులు వాచిపోయాయి. కళ్లు మండుతున్నాయి. కిందకి దిగడం ఒక పీడకలలా మిగిలిపోయింది. దారిలో నాకు నేను చెప్పుకున్నాను... 'ఎలాగైనా సరే శవంగా కాకుండా బతికి ఇంటికి వెళ్లాలి' అని. మా గైడ్ సాయంతో పది గంటలు ఆలస్యంగా క్యాంపు 4కు చేరుకున్నాను. తరువాత హెలికాప్టర్‌లో కఠ్మండూ ఆసుపత్రికి తీసువెళ్లి చికిత్స అందించారు. అప్పుడు మరో జన్మ ఎత్తిన అనుభూతి కలిగింది."మా అమ్మాయికి స్ఫూర్తినవ్వాలి...నిజానికి ఇంటి నుంచి వెళ్లేముందే నా భర్తకు, కూతురుకు ఇక సెలవని చెప్పాను. ఎందుకంటే నాకు తెలుసు... ఎవరెస్టు పర్వతారోహణ ఎంత ప్రమాదకరమో. అయితే ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ జయించాను.

# మంచి అలవాట్లు నేర్పించాలి



పోషకాహారంతోపాటు మంచి అలవాట్లు కూడా పిల్లల ఎదుగుదలకు, వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయి. అందుకే తల్లితండ్రులు పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాలి.పిల్లలను ఉదయాన్నే నిద్ర లేపి, తేలికపాటి వ్యాయామం చేయించాలి. దీనివల్ల శరీరమంతా రక్తప్రసరణ జరిగి మెదడుకి ఆక్సిజన్ బాగా అందుతుంది. పిల్లలు రోజంతా ఉత్సాహంగా ఉంటారు.

వారానికి రెండు రోజులు యోగా చేయించాలి. దీనివల్ల శ్వాస మీద దృష్టి నిలుస్తుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి, జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగించాలి. దీనివల్ల నిర్జలీకరణ సమస్యలు రావు. మెదడు చురుకుగా పని చేస్తుంది. ఏకాగ్రత పెరిగి, జీర్ణాశయ సమస్యలు రావు.

ఉదయం పూట పిల్లలను కొద్దిసేపు చదివించాలి. ఈ సమయంలో మెదడు ప్రశాంతంగా ఉంటుంది కాబట్టి చదివిన అంశాలు బాగా గుర్తుంటాయి.

అల్పాహారంలో పోషక విలువలు, పీచుపదార్థాలున్న ఆహారపదార్థాలను తినిపించాలి. దీనివల్ల పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారు.

పిల్లలకు చిన్న చిన్న లక్ష్యాలు సూచించి వాటిని త్వరగా పూర్తి చేయమని చెప్పాలి. ఉదాహరణకు ఒక పాఠాన్ని పూర్తిగా చదవడం, బొమ్మలు వేయడం, పుస్తకాలు సర్దడం లాంటివి చెప్పవచ్చు. పూర్తి చేసిన తరవాత అభినందిస్తే వాళ్లకి సాధించామన్న భావన కలిగి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

## అల్పాహారం పొరపాట్లు



ఉదయం సరైన అల్పాహారం తీసుకుంటే రోజంతా హుషారుగా ఉండడంతో పాటు శరీరం శక్తిని ఖర్చు చేసే వేగం (మెటబాలిజం) మెరుగుపడుతుంది. అయితే అల్పాహారం విషయంలో చేసే పొరపాట్లు మెటబాలిజంను మందగించేలా చేస్తాయి. కాబట్టి ఈ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

ఉదయం అల్పాహారం తీసుకోకుండా ఉండకూడదు. అల్పాహారం తీసుకోకపోతే శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం మందగిస్తుంది. అంతేకాకుండా ఉదయం తినకపోవడం వల్ల మిగిలిన రోజంతా అతిగా తినే ప్రమాదం ఉంటుంది. దాంతో అధిక బరువు పెరుగుతారు.ఉదయాన్నే తీపి పదార్థాలు తినకూడదు. అలా తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోయి శక్తి తగ్గుతుంది. దాంతో మెటబాలిజం నెమ్మదిస్తుంది.ప్రోటీన్ ఉన్న అల్పాహారం తినాలి. ప్రోటీన్ కడుపు నిండిన భావనతో పాటు కండరపుష్టికి తోడ్పడుతుంది. ఇది మెటబాలిజం మెరుగుదలకు సహాయపడుతుంది.అల్పాహారం ఆలస్యంగా తీసుకోకూడదు. అల్పాహారం ఆలస్యమైతే మెటబాలిజం నిర్వహణలో కీలక పాత్ర పోషించే శరీర జీవగడియారం దెబ్బతింటుంది.పీచు అందించే అల్పాహాలం తీసుకోవాలి. పీచు, పేగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంతోపాటు మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. క్యాలరీలను సమర్థవంతంగా ఖర్చు చేయడంలోనూ పీచు ముఖ్య పాత్రపోషిస్తుంది.పరగడుపున కాఫీ తాగకూడదు. ఖాళీ కడుపుతో కాఫీ తాగితే కార్టిసాల్ పెరుగుతుంది. దీని వల్ల చక్కెర నియంత్రణకు ఆటంకం ఏర్పడుతుంది. దాంతో కాలక్రమేణా మెటబాలిజం మందగిస్తుంది.

బ్రషింగ్ అయిన తరవాత బ్రష్ ని మనం ఎలా స్టోర్ చేస్తున్నామనే దాన్ని బట్టి కూడా మన ఆరోగ్యం ఎలా ఉంటుందన్నది చెప్పొచ్చు అంటున్నారు డాక్టర్ మైల్స్ మాడిసన్. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు. మరి ముఖం కడుక్కున్న తరవాత బ్రష్ ని ఎలా

# బ్రష్ తరవాత చాలా మంది చేస్తున్న అతి పెద్ద తప్పు



స్టోర్ చేస్తే జబ్బులు వస్తాయి.

మనం రోజూ చేసే పనులే కావచ్చు. కానీ..వాటిని ఓ అలవాటు ప్రకారం చేసేస్తుంటారు. వాటి వల్ల మనకు ఎలాంటి నష్టం జరుగుతోంది. అసలు ఆ పనులను సరైన విధంగా చేస్తున్నామా లేదా అన్నది ఆలోచించరు. వీటి గురించి కూడా ఇంతగా ఆలోచించాలా అనిపించినా...చిన్న చిన్న పొరపాట్ల కారణంగా మనకు తెలియకుండానే మనం అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నాం. ఉదయం లేవగానే మనం బ్రష్ చేసుకుంటాం.

అంతా క్లీన్ చేసుకున్న తరవాత బ్రష్ కడిగి పక్కన పెట్టేసి స్నానానికి వెళ్లిపోతాం. కానీ బ్రషింగ్ అయిన తరవాత బ్రష్ ని మనం ఎలా స్టోర్ చేస్తున్నామనే దాన్ని బట్టి కూడా మన ఆరోగ్యం ఎలా ఉంటుందన్నది చెప్పొచ్చు అంటున్నారు డాక్టర్ మైల్స్ మాడిసన్. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు. మరి ముఖం కడుక్కున్న తరవాత బ్రష్ ని ఎలా స్టోర్ చేస్తే జబ్బులు వస్తాయి. ఎలా స్టోర్ చేయడం ఆరోగ్యకరం. ఈ వివరాలన్నీ ఓ వీడియోలో ఎక్స్ ప్లెయిన్ చేశారు. ఆ టిప్స్ ఏంటో ఓ సారి చూద్దాం.

**అలవాటు ప్రకారం..**సాధారణంగా బ్రషింగ్ అయిపోయిన తరవాత వెంటనే బ్రష్ ని కాస్తంత తడిపి పక్కన పెడతాం. ఇది అందరికీ ఉండే అలవాటు. కానీ..ఇది ఏ మాత్రం ఆరోగ్యకరమైన అలవాటు కాదంటున్నారు డాక్టర్ మైల్స్ మాడిసన్. బ్రష్ తడిగా ఉంటే దానిపై రకరకాల బ్యాక్టీరియా వచ్చి చేరే ప్రమాదముంటుంది. అయితే..కొంత మంది బ్రషింగ్ చేసిన తరవాత బ్రష్ తడిపి దానిపై చిన్న బాక్స్ లాంటి క్యాప్ పెట్టి పక్కన పెడుతుంటారు. ఇలా స్టోర్ చేయడం సరైన పద్ధతి అనుకుంటారు. కానీ..ఇది కూడా కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్. ఇది కూడా హానికర బ్యాక్టీరియా ఫామ్ అవడానికి దారి తీస్తుందని వివరిస్తున్నారు. మరి టూత్ బ్రష్ ని స్టోర్ చేయాల్సిన సరైన పద్ధతి ఏంటి. ఆయన ఏం చెప్పారో క్లియర్ గా తెలుసుకుందాం.

బ్రష్ పై బ్యాక్టీరియా..మనం రాత్రంతా నిద్రపోయి ఉదయాన్నే లేచి బ్రష్ చేసుకుంటాం. అయితే..నిద్రపోయిన సమయంలో నోట్లో రకరకాల క్రిములు, బ్యాక్టీరియా వచ్చి చేరతాయి. ఉదయాన్నే వాటిని క్లీన్ చేసేసి ఆ తరవాత మిగతా పనులు మొదలు పెడతాం. ఓరల్ హెల్త్ బాగుంటేనే మన జీర్ణ వ్యవస్థ కూడా బాగుంటుంది. సరైన విధంగా బ్రష్ చేసుకోకపోయినా, బ్రషింగ్ లో ఏవైనా పొరపాట్లు చేసినా అవి మన గట్ హెల్త్ ని పాడు చేస్తాయి. నోట్లో ఉండే బ్యాక్టీరియా అంతా పొట్టలోకి వెళ్లిపోతుంది. ఆహారం జీర్ణమయ్యే ప్రక్రియను ఇది అడ్డుకుంటుంది. ఈ కారణంగా గ్యాస్, మలబద్ధకం లాంటి సమస్యలు వస్తాయి. అందుకే..సరైన విధంగా బ్రష్ ని స్టోర్ చేయాల్సి ఉంటుంది.బ్రషింగ్ అయిపోయిన తరవాత బ్రష్ పై నోట్లో ఉండే బ్యాక్టీరియా అంతా వచ్చి చేరుతుంది. సరైన విధంగా క్లీన్ చేయకపోతే అది అలాగే ఉండిపోతుంది. అందుకే..బ్రషింగ్ అయిపోయిన వెంటనే నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఆ తరవాత వెంటనే పక్కన పెట్టకూడదు. బ్రష్ పై తడి ఉంటే బ్యాక్టీరియా వచ్చే అవకాశముంటుంది. అందుకే అందులో తడి పోయేంత వరకూ దులపాలి. లేదా కాసేపు అలా గాలికి ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల కాసేపట్లోనే తేమ అంతా తొలగిపోతుంది. బ్యాక్టీరియా రావడానికి అవకాశం కూడా ఉండదు. పూర్తిగా ఎండిపోయిన తరవాత అప్పుడు క్యాబినెట్ లో కానీ..బ్రష్ స్టాండ్‌లో కానీ స్టోర్ చేయాలి.?బ్రష్‌ని ఆరబెట్టిన తరవాత స్టోర్ చేయడం మంచిదే. అయితే..దాన్ని పూర్తిగా కవర్ చేయడం మాత్రం అసలు మంచిది కాదు. బ్రష్‌ని కప్పి ఉంచేందుకు చిన్న బాక్స్ లాంటి కవర్స్ ఉంటాయి. వాటితో కప్పి ఉంచి స్టోర్ చేయడం చాలా మందికి అలవాటు. కానీ..ఇలా చేస్తే బ్యాక్టీరియా పెరిగిపోయే ప్రమాదముంటుంది. నిజానికి..ఈ బాక్స్ లాంటి కవర్స్ బ్యాక్టీరియాకి ఇన్ క్యుబేటర్స్ లా పని చేస్తాయి అంటున్నారు డాక్టర్ మైల్స్ మాడిసన్. అంటే ఎక్కువ సమయం పాటు అలా పట్టి ఉంచేందుకు ఇవి అనువుగా ఉంటాయి. అందుకే.. పొరపాటున కూడా బ్రష్ కవర్స్ వాడకూడదు. ముఖ్యంగా తడి బ్రష్ ని ఇలా అసలు కవర్ చేయకూడదు. దాన్ని పూర్తిగా తడిపిన తరవాత సరైన విధంగా గాలికి తగిలేలా ఉంచడమే మంచిది.

# లైఫ్ కోచ్

## మధులిక అప్పసాని





లక్ష్యం తెలుసు... కానీ దాన్ని చేరుకోవడంలో తడబడుతుంటాం. కలలు కంటాం... వాటిని నెరవేర్చుకొనే మార్గం తెలియక ఇబ్బందులు పడుతుంటాం. నైపుణ్యం ఉండి... సాధించగల సామర్థ్యం ఉండి... ఎక్కడో వెనకపడిపోతాం. ఇలాంటి అవరోధాలను దాటించి... ప్రేరణ కల్పించి... జీవితంలో ముందడుగు వేయించేవారే లైఫ్ కోచ్ అంటారు మధులిక అప్పసాని. అవార్డులందుకున్న లైఫ్ కోచ్‌గా వందల మందికి తమ లక్ష్యాలు, కలలను సాకారం చేసుకోవడంలో దోహదపడిన ఆమె... ముచ్చటించారు.

"ఒకప్పుడు లైఫ్ కోచింగ్ అంటే చాలామందికి తెలియదు. కానీ ఇప్పుడు అత్యంత డిమాండ్ ఉన్న రంగంగా ఎదుగుతోంది. ముఖ్యంగా కరోనా తరువాత దీని అవసరం బాగా పెరిగింది. నేను కొవిడ్ ముందు 2019 నుంచి లైఫ్ కోచ్‌గా పని చేస్తున్నా. కొవిడ్‌వల్ల ఆన్‌లైన్ తరగతులు, ఉద్యోగాలతో ఇంట్లోనే అధిక సమయం గడపడంవల్ల శారీరకంగానే కాదు, మానసికంగానూ చాలామంది గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. వాటి నుంచి బయటకు రావడానికి లైఫ్ కోచ్‌లను ఆశ్రయించడం అధికమైంది. ఇదీ సైకాలజీలో ఒక భాగమే. కానీ సైకాలజీ కాదు. అంటే స్పోర్ట్స్ కోచింగ్ లాగా. ఒత్తిడి, మానసిక ఆందోళనలు, గాయాల నుంచి బయటకు రావాలనుకొంటే అది సైకాలజీకి సంబంధించింది. అలాగే భార్యాభర్తలు, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాల్లో సమస్యలు వచ్చినా సైకాలజిస్టులను సంప్రతిస్తారు. కానీ లైఫ్ కోచ్‌లుగా మేము... చేసే పనికి, జీవితానికి మధ్య సమతుల్యత ఉండేలా కృషి చేస్తాం. సమయం, శక్తిసామర్థ్యాల నిర్వహణ (టైమ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్) చూస్తాం. భావాలను, ఆలోచనలను స్పష్టంగా, సులభంగా ఎలా పంచుకోవాలనేది చెబుతాం. చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించి, తద్వారా అసలైన లక్ష్యాన్ని చేరుకొనేలా ప్రేరణనిచ్చి, ఒక ప్రణాళికను రూపొందిస్తాం.

**వారి లక్ష్యానికి మా భరోసా...**

నా దగ్గరకు వచ్చే క్లయింట్ తన కలను నా ముందు పెడతాడు. అతడి కలను సాకారం చేయాల్సిన బాధ్యత నాది. ఇక్కడ ఒక ఉదాహరణ చెబుతా. నాకు ఒక క్లయింట్ ఉంది. కంపెనీ టర్నోవర్‌ను 25 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచాలనేది తన లక్ష్యం. కానీ 'ఇది నావల్ల కాదు' అనే అపనమ్మకం ఆమె మెదడులో పాతుకుపోయింది. తనకు అంతటి సామర్థ్యం లేదనుకొంటుంది. ఇక్కడ సమస్య ఏంటంటే... మనం కొన్నిసార్లు ఆత్మవిమర్శ చేసుకొంటూ ఎదిగేస్తాం. వేరొకరితో పోల్చుకొంటూ, అందులోనే ప్రేరణ వెతుక్కొనే ప్రయత్నం చేస్తాం. కానీ ఒక స్థాయికి వెళ్లాక పోల్చుకోవడానికి ఆ స్థాయిలో మన చుట్టూ ఎవరూ ఉండరు. ఆమె విషయంలో అదే జరిగింది. ఆమె సర్కిల్‌లో తనకంటే శక్తిమంతమైన మహిళలు ఎవరూ లేరు. అలాంటప్పుడు ఆత్మవిమర్శ, పోలిక పని చేయవు. కనుక ఆమె మదిలో మెదిలే ఆలోచనల మీద దృష్టి పెట్టి, సమయపాలన, రోజువారీ కార్యక్రమాల జాబితాను క్రమపద్ధతిలో పెట్టాం. అన్నిటినీ బేరీజు వేసుకొని, వేరొకరితో పోల్చుకోకుండా... లక్ష్యం నుంచి వెనక్కి పోకుండా... అనుకున్నది ఎలా సాధించగలదనే విషయంపై ఒక అంచనాకు వచ్చాం. దానికి అనుగుణంగా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించి ఇచ్చాం.

**అదే మా పని...**

పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, లేదా ఆ కుటుంబాల నుంచి వచ్చే వ్యక్తులు కావచ్చు, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనుకొనే విద్యార్థులు కావచ్చు... వీళ్లు నా వద్దకు వస్తారు. ఎక్కువగా ఒన్ టు ఒన్ కోచింగ్ ఇస్తాను. అలాగే మహిళా బృందాలకు వర్క్‌షాపలు, కార్పొరేటు సంస్థల్లో సెషన్స్ నిర్వహిస్తుంటాను. ఒక రకంగా లైఫ్ కోచింగ్ అనేది ఒలింపిక్స్‌కు వెళ్లే క్రీడాకారుడిని అత్యున్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దడం లాంటిది. అంటే ఇక్కడకు వచ్చేవారు అప్పటికే నైపుణ్యం సంపాదించి ఉంటారు. నిరూపించుకొని ఉంటారు. కాకపోతే ఫినిషింగ్ లైన్ దగ్గర్లో ఉన్నప్పుడు... 'నీవల్ల కాదు' అని ఎప్పుడో వాళ్ల అమ్మో, నాన్నో చెప్పిన మాటలో, ఇంకేదో హఠాత్తుగా గుర్తుకువస్తాయి. దాంతో ఉన్నట్టుండి వారి ప్రయాణం నెమ్మదిస్తుంది. ఈ గందరగోళాన్ని, అపనమ్మకాన్ని పారద్రోలి, లక్ష్యం వైపు నడిపించడమే మా పని.

**అందుకే ఇటు వైపు...**

మా అమ్మానాన్నలది పశ్చిమ గోదావరి జిల్లా అయినా... నా బాల్యం, విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే సాగింది. నాన్నకు కన్‌స్ట్రక్షన్ బిజినెస్ ఉంది. ఎంబీయే ఫైనాన్స్ పూర్తయిన తరువాత పుణె సింబియాసిస్ యూనివర్సిటీలో బీబీఏ చదివాను. పెళ్లి తరువాత చెన్నైలోని మా మామగారి కంపెనీలో ఎనలిస్టుగా, ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేశాను. 2016లో పెద్ద నోట్ల రద్దు తరువాత మా కంపెనీని ఒక ఫ్రెంచ్ ఎమ్మెన్సీకి అమ్మేశాం. తరువాత మావారు ఏరోస్పేసకు సంబంధించి వేరే కంపెనీ కొన్నారు. అప్పటికి నాకు పెళ్లయి నాలుగేళ్లు అయిందనుకొంటా. మాకు ఇద్దరు పాపలు. ఇల్లు, పిల్లలు, కుటుంబ బాధ్యతలు ఉన్నప్పుడు... దానికి అనుగుణమైన కెరీర్‌ను ఎంచుకోవాలి కదా. అందుకే నేను లైఫ్ కోచింగ్‌లోకి వచ్చాను. నాది బిజినెస్, ఎంబీయే నేపథ్యం కాబట్టి... ఎక్కువగా పారిశ్రామికవేత్తలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన సమస్యలు చూస్తుంటాను. కొన్ని పత్రికలు, మ్యాగజైన్లకు ఆర్టికల్స్ కూడా రాశాను. మా నాన్న, మా మామగారే నాకు స్ఫూర్తి.

**సవాళ్లు ఎన్నో...**

లైఫ్ కోచ్ కావాలనుకొనేవారికి ఐసీఎఫ్ (ఇంటర్నేషనల్ కోచింగ్ ఫెడరేషన్), ఎన్ఎల్‌పీ (న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్) లాంటి ప్రముఖ సంస్థలు ఈ కోర్సులు అందిస్తున్నాయి. కోర్సు పూర్తయితే సర్టిఫికెట్ ఇస్తారు. నేను ఎన్ఎల్‌పీ చేశాను.

అయితే ఒక్కదాంతోనే సరిపోదు. మెరుగైన సేవలు అందించాలంటే ప్రముఖ కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకొంటూ, ఇలాంటి కోర్సులు మరికొన్ని చేస్తుండాలి. లైఫ్ కోచ్‌కు ప్రధానంగా ఉండాల్సిన లక్షణం... చెప్పింది ఓపిగ్గా వినగలగడం. వారి సమస్యలపై ఒక అవగాహనకు వచ్చేవరకు సలహాలు ఇవ్వకుండా ఉండడం. అలాగే ప్రశ్నలో స్పష్టత, పొంతన తప్పనిసరి. మనం అడిగే ప్రశ్నకు అతడు నిస్సంకోచంగా బదులిస్తాడా? లేక చిన్నబుచ్చుకొంటాడా? అనేది గ్రహించగలగాలి. ఇక్కడ విద్య, విజ్ఞానం చాలా ముఖ్యం.

**ఎన్నో సవాళ్లతో కూడుకున్న వృత్తి ఇది.**

నా క్లయింట్స్‌కు నేను సాధారణంగా ఎనిమిది సెషన్స్ తీసుకొంటాను. తొలి సెషన్‌లోనే వారేమిటి అనేదానిపై స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు వర్క్‌షాపల పరంగా, వ్యక్తిగతంగా వెయ్యి మందిని కలిశాను. తమ లక్ష్యాలను, కలలను నెరవేర్చుకొనేలా ఎంతోమందికి లైఫ్ కోచింగ్ ఇచ్చాను. మా పిల్లలు చిన్నవాళ్లు కనుక ఉదయం 9 నుంచి సాయంత్రం 3 వరకు మాత్రమే ఆఫీసులో ఉంటున్నాను. ఇంటికి వచ్చాక యూరప్ తదితర ప్రాంతాల నుంచి కాల్స్ వస్తాయి.

నవభూమి

www.navabhoomi.in

www.epaper.navabhoomi.in

11 | హైదరాబాద్ ఆదివారం 24 । ఆగస్టు । 2025







## ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్



**ముంబై-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణం. సెన్సెక్స్ 693.86 పాయింట్లు నష్టపోయి 81,306.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 213.65 పాయింట్లు కోల్పోయి 24,870.10 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.2.62 లక్షల కోట్లు తగ్గి రూ.453.65 లక్షల కోట్లకు పడిపోయింది.ఆన్‌లైన్ గేమింగ్ రంగంలోని కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. నజారా టెక్నాలజీస్ షేరు మరో 4.13% పతనమైంది. గడిచిన మూడు సెషన్లలో ఈ స్టాక్ 17.52% క్షీణించింది. డెల్టా కార్ప్ షేరు మరో 3.50%, ఆన్‌మొబైల్ గ్లోబల్ 2.73% తగ్గాయి.

ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 27 పైసల నష్టంతో రూ.87.52 వద్ద ముగిసింది.

ఈనెల 15తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 148.8 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 69,510.6 కోట్ల డాలర్లకు పెరిగాయని ఆర్‌బీఐ వెల్లడించింది.

స్నేహ ఆర్గానిక్స్ రూ.32.68 కోట్ల ఎస్ఎంఈ ఐపీఓ ఈనెల 29న ప్రారంభమై వచ్చేనెల 2న ముగియనుంది. ఈ ఐపీఓ ధరల శ్రేణి రూ.115-122గా ఉంది.

## ఆరోగ్య బీమా ప్రీమియం పెంపుదలను ఐఆర్‌డీఏఐ నియంత్రిస్తుందా..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత రోజుల్లో ఆరోగ్య బీమా ప్రతి ఒక్కరి జీవితంలో చాలా అవసరంగా మారింది. చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఆస్పత్రి ఖర్చులు వందల్లో కాదు, వేలల్లో, లక్షల్లో ఉంటున్నాయి. అందుకే చాలా మంది ఆరోగ్య బీమా పాలసీలు తీసుకుంటున్నారు. అయితే, మీరు ఎప్పుడైనా గమనించారా, మొదట పాలసీ తీసుకున్నప్పుడు బీమా ప్రీమియం తక్కువగా ఉంటుంది. కానీ తర్వాత కొన్ని సంవత్సరాల్లో అది భారీగా పెరిగిపోతుంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా కొత్త నిబంధనలు తీసుకొస్తోందని తెలుస్తోంది.ఆరోగ్య బీమా కంపెనీలు కొన్నిసార్లు మొదట్లో చాలా తక్కువ ప్రీమియంతో పాలసీలను అందిస్తాయి. ఇంత తక్కువ ధరలో ఇంత మంచి కవరేజ్ దొరుకుతోందా? అని మనం సంతోషపడతాం. కానీ, ఒకటి రెండు సంవత్సరాల తర్వాత ప్రీమియం మొత్తం ఒక్కసారిగా పెరిగిపోతుంది. చాలామందికి ఇది ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ పాలసీని కొనసాగించడం కూడా భారమైపోతుంది. ఈ పరిస్థితిని నియంత్రించేందుకు ఇప్పుడు కొత్త ఆలోచనలు చేస్తోంది.తాజా సమాచారం ప్రకారం ఆరోగ్య బీమా ప్రీమియంల పెంపుదలపై ఒక పరిమితిని విధించాలని యోచిస్తోంది. అంటే, ఇకపై బీమా కంపెనీలు తమ ఇష్టానుసారం ప్రీమియంలను భారీగా పెంచలేవు. ఈ నిబంధన వ్యక్తిగత పాలసీలకు మాత్రమే కాకుండా, మొత్తం బీమా ఉత్పత్తుల సమూహానికి (పోర్ట్‌ఫోలియో) కూడా వర్తిస్తుందని తెలుస్తోంది. దీనివల్ల బీమా కస్టమర్లకు ఊరట లభించనుంది.ఈ నియమాలను ఖరారు చేసేందుకు త్వరలో ఒక కన్సల్టేషన్ పేపర్ విడుదల చేయనుంది. ఈ పేపర్‌లో ప్రీమియం పెంపుదలకు సంబంధించిన స్పష్టమైన గైడ్‌లైన్స్ ఉంటాయి. ఇది ఆరోగ్య బీమా రంగంలో పారదర్శకతను పెంచడమే కాకుండా, ఎక్కువ మంది బీమా పాలసీలను కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

## మళ్లీ తగ్గిన బంగారం ధరలు.. నేటి రేట్స్ ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారంపై పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి సువర్ణావకాశం. దేశంలో బంగారం ధరలు మళ్లీ స్వల్పంగా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, దేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.1,00,520గా ఉంది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.92,140గా ఉంది. ఇక 10 గ్రాముల 18 క్యారెట్‌ల బంగారం ధర రూ.75390గా ఉంది. కిలో వెండి ధర స్వల్పంగా పెరిగి రూ.1,18,100కు చేరుకుంది. ప్లాటినం ధరల్లో కూడా స్వల్ప పెరుగుదల కనిపించింది. 10 గ్రాముల ప్లాటినం ధర ప్రస్తుతం రూ.37,720గా ఉంది. అమెరికా, చైనా మధ్య ట్రేడ్ వార్ అవకాశాలు తగ్గాయన్న భావనతో బంగారానికి డిమాండ్ తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు, డాలర్ బలపడం కూడా బంగారానికి డిమాండ్ తగ్గిస్తోంది. ఇక భారత్‌లో అనేక మంది ట్రేడర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడం కూడా బంగారం ధరలు దిగొచ్చేలా చేస్తోంది.

## ద్వితీయార్ధంలో కొలువుల జాతర



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో ఉపాధి మార్కెట్ వర్తమాన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో జోరందుకోనుంది. పలు యాజమాన్యాలు తమ సంస్థల్లో కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలియచేశాయి. దేశంలో ఉద్యోగాల మార్కెట్ ధోరణిపై నౌకరీ నిర్వహించిన ద్వైవార్షిక సర్వేలో ఈ విషయం వెల్లడయింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 72% మంది యాజమాన్య ప్రతినిధులు కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా సిబ్బంది విస్తరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ద్వితీయార్ధంలో కొత్తగా కొంత మందిని ఉద్యోగాల్లో చేర్చుకునే యోచన ఉన్నట్టు 94% మంది తెలియచేశారు. దేశవ్యాప్తంగా విభిన్న రంగాలకు చెందిన 1,300 మంది యాజమాన్య ప్రతినిధులు అందించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా పలువురు ఉద్యోగాలు కోల్పోతారన్న భయాలు విస్తృతంగా వ్యాపించిన వాతావరణంలో కూడా ఉద్యోగ మార్కెట్‌పై ఏఐ ప్రభావం అంతగా ఉంటుందని తాము భావించడంలేదని 87% మంది అన్నారు. పైగా ఉపాధి మార్కెట్‌కు ఏఐ చోదకశక్తిగా ఉంటుందని 13% మంది అభిప్రాయపడ్డారు. ఏఐ వల్ల ప్రయోజనం పొందే రంగాల్లో ఐటీ (42%), అనలిటిక్స్ (17%), బిజినెస్ డెవలప్‌మెంట్ (11%) ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తం అయింది. ప్రధానంగా ఏఐ ఆధారిత అవకాశాలు పెరుగుతాయన్నారు. నికరంగా అదనపు సిబ్బందిని నియమించుకోవడం ద్వారా సిబ్బంది విస్తరణ చేపట్టనున్నట్టు 72% మంది చెప్పడం ప్రోత్సాహకరమైన అంశమని నౌకరీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయెల్ అన్నారు.

## స్కైస్విఫ్ట్ 56 డ్రోన్‌కు డీజీసీఏ సర్టిఫికేషన్




**హైదరాబాద్-నవభూమి:** స్థానిక మారుత్ డ్రోన్స్ కంపెనీ "స్కైస్విఫ్ట్ 56" పేరుతో మరో సరికొత్త డ్రోన్‌ను అభివృద్ధి చేసింది. దీనికి పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి సర్టిఫికేషన్ కూడా లభించినట్టు కంపెనీ తెలిపింది. తక్కువ బరువు, అత్యాధునిక పరికరాలు ఉండే ఈ డ్రోన్‌ను రెండు నిమిషాల్లోనే ఫిట్ చేసి ఉపయోగించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన నిఘా, కచ్చితమైన మ్యాపింగ్‌తో క్షేత్ర స్థాయి శిక్షణకు ఈ డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. డ్రోన్ల ద్వారా జరిగే వ్యూహాత్మక నిఘా, పర్యవేక్ష ణలకు ఈ డ్రోన్ చక్కటి పరిష్కారమని మారుత్ డ్రోన్స్ సీఈఓ, సహ వ్యవస్థాపకులు వీ ప్రేమ్ కుమార్ తెలిపారు.

## ఎస్బీఐ సహా ప్రభుత్వ బ్యాంకుల కొత్త స్కీమ్స్.. రూ. 1 లక్షకు 444 రోజుల్లో ఎంతొస్తుందంటే?



**ముంబై-నవభూమి:** పెట్టుబడులు పెట్టేందుకు చాలా మంది ముఖ్యంగా సీనియర్ సిటిజెన్లు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేసేందుకు చూస్తుంటారు. ఇక్కడ బ్యాంకుల్లో పెట్టుబడికి హామీ ఉండటం.. గ్యారెంటీ రిటర్న్స్ రావడం ఇందుకు కారణంగా చెప్పొచ్చు. అయితే.. గత కొంత కాలంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేట్లను తగ్గిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బ్యాంకులు లోన్ వడ్డీ రేట్లు తగ్గిస్తూ.. ఇదే సమయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను తగ్గిస్తూ వస్తున్నాయి. అయినా కూడా కొన్ని బ్యాంకులు ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు.. రెగ్యులర్ డిపాజిట్లతో పోలిస్తే అధిక వడ్డీ అందిస్తూ ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల్ని లాంచ్ చేస్తున్నాయి. ఇందులో ఎస్బీఐ సహా ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు చాలానే ఉన్నాయి. ఇవన్నీ 444 రోజుల వ్యవధితో ప్రత్యేక డిపాజిట్ పథకాల్ని అందిస్తున్నాయి. ఎస్బీఐ- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 444 రోజుల వ్యవధితో అమృత్ వృష్టి అనే పథకం లాంచ్ చేసింది. ఇక్కడ సాధారణ ప్రజలకు 6.60 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.10 శాతం వడ్డీ అందిస్తోంది. ఇక్కడ రూ. 1 లక్ష జమ చేస్తే 444 రోజులకు సాధారణ ప్రజలకు రూ. 8,288 వడ్డీ వస్తుంది. అంటే మెచ్యూరిటీకి రూ. 1,08,288 వస్తుంది. సీనియర్ సిటిజెన్లకు 7.10 శాతం లెక్కన రూ. 8,931 వడ్డీ వస్తుంది. సూపర్ సీనియర్ సిటిజెన్లకు 7.20 శాతం చొప్పున రూ. 9061 వడ్డీ అందుతుంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా- ఈ బ్యాంకు 444 రోజుల వ్యవధితో బీఓబీ స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ స్కీమ్ లాంచ్ చేసింది. దీంట్లో కూడా ఎస్బీఐ మాదిరిగానే వడ్డీ రేట్లు ఉన్నాయి. రిటర్న్స్ కూడా అలాగే ఉంటాయని చెప్పొచ్చు.ఇండియన్ బ్యాంకు- ఇది కూడా 444 రోజుల కాల పరిమితితో ఇండ్ సెక్యూర్ ప్రొడక్ట్ ఎఫ్‌డీ స్కీమ్ తీసుకొచ్చింది. ఇక్కడ సాధారణ ప్రజలకు అత్యధికంగా 6.70 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.20 శాతం, సూపర్ సీనియర్ సిటిజెన్లకు 7.45 శాతం వడ్డీ అందిస్తోంది. ఇక్కడ రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి మెచ్యూరిటీకి వరుసగా రూ. 8418, రూ. 9061, రూ. 9,387 గా ఉంది.

ఐడీబీఐ బ్యాంక్- ఈ బ్యాంకు ఉత్సవ్ ఎఫ్‌డీ స్పెషల్ డిపాజిట్ స్కీమ్ లాంఛ్ చేసింది. ఇక్కడ సాధారణ ప్రజలకు, సీనియర్ సిటిజెన్లకు ఇండియన్ బ్యాంకు మాదిరిగానే వడ్డీ రేట్లు ఉన్నాయి. రిటర్న్స్ అలాగే ఉంటాయి. సూపర్ సీనియర్ సిటిజెన్లకు మాత్రం 7.35 శాతం వడ్డీ రేటు ఉండగా.. రూ. 9257 వడ్డీ వస్తుంది.

### అనిల్ అంబానీ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు..

## మొన్న ఈడీ.. ఇప్పుడు సీబీఐ సోదాలు!



**ముంబై-నవభూమి:** దేశంలోని దిగ్గజ వ్యాపారవేత్త, రిలయన్స్ అనిల్ ధీరూబాయ్ అంబానీ గ్రూప్ అధినేత అనిల్ అంబానీకి మరో బిగ్ షాక్ తగిలింది. కేంద్ర దర్యాప్తు సంస్థ శనివారం రోజు ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. రిలయన్స్ గ్రూప్‌కు చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ కార్యాలయాలు, ప్రమోటర్ అనిల్ అంబానీ ఇళ్లపై తనిఖీలు నిర్వహించింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు.. పలు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో లోన్లు తీసుకొని అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ బ్యాంక్ లోన్ ఫ్రాడ్ కేసుకు సంబంధించే సీబీఐ సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది.కొద్ది రోజుల నుంచి ఇదే కేసుకు సంబంధించి.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం రూ. 17 వేల కోట్ల విలువైన ఈ బ్యాంక్ లోన్ ఫ్రాడ్ కేసుకు సంబంధించి అంతకుముందు అనిల్ అంబానీకి చెందిన డజన్ల కొద్దీ తనీఖీలు నిర్వహించిన ఈడీ.. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే.. ఆగస్ట్ 5న స్వయంగా అనిల్ అంబానీని దాదాపు 10 గంటల పాటు విచారించింది కూడా. పీఎంఎల్ఏ కింద ఆయన వాంగ్మూలం కూడా నమోదు చేసింది.జులై 24న ఈ రిలయన్స్ గ్రూప్‌కు చెందిన దాదాపు 50 కంపెనీలు ఉండే 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపైనా ఈడీ పెద్ద ఎత్తున సోదాలు చేసి కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంది. అంబానీ సహా రిలయన్స్ గ్రూప్‌కు చెందిన పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు కూడా సమన్లు జారీ చేసింది ఈడీ. ఇదే సమయంలో అనిల్ అంబానీకి విచారణకు రావాల్సిందిన నోటీసులు అందజేసిన ఈడీ.. మరుసటి రోజే ఆయన దేశం విడిచి పారిపోకుండా ఉండేందుకు లుకౌట్ సర్క్యులర్ కూడా జారీ చేసింది.మొత్తం రూ. 17 వేల కోట్ల రుణాల్లో.. రిలయన్స్ హోం ఫైనాన్స్ రూ. 5900 కోట్లకుపైగాబీ రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ సుమారు రూ. 8200 కోట్లు, రిలయన్స్ కమ్యూనికేషన్స్ రూ. 4100 కోట్లకుపైగా ఉన్నాయి. ఇక వీటిని బ్యాంకుల నుంచి అక్రమమార్గంలో కొందరు బ్యాంక్ అధికారులకు లంచం ఇచ్చి తీసుకున్నారని.. ఇంకా వీటిని ఇతర షెల్ కంపెనీలకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక అప్పటి నుంచి ఈడీ నోటీసులు, విచారణ నేపథ్యంలో రిలయన్స్ గ్రూప్‌కు చెందిన రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇలా పలు కంపెనీల స్టాక్స్ కూడా భారీగా పడిపోయాయి.

## 5 షేర్లు కొంటే మరో 8 షేర్లు ఫ్రీ.. ఆగస్టు 27 లాస్ట్ డేట్.. లక్షను 7 లక్షలు చేసిన స్టాక్



**ముంబై-నవభూమి:** మౌలిక రంగంలో కన్సల్టెన్సీ సర్వీసెస్ అందించే డీఎంఆర్ హైడ్రో ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ తమ షేర్ హోల్డర్లకు బంపర్ ఆఫర్ తీసుకొచ్చింది. ఈ కంపెనీ స్టాక్ వచ్చే వారంలోనే ఎక్స్ బోనస్ ట్రేడింగ్ నిర్వహించనుంది. ఆలోపు ఈ కంపెనీకి చెందిన 5 షేర్లు కొనుగోలు చేసినట్లియితే వారికి అదనంగా మరో 8 షేర్లు ఉచితంగా లభిస్తాయి. అంటే మొత్తంగా ఖాతాలోకి 13 షేర్లు వచ్చి చేరతాయి. ఆగస్టు 28వ తేదీలోపు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఈ స్టాక్ ఫోకస్ లోకి వచ్చింది. గడిచిన మూడేళ్ల కాలంలోనే 636 శాతం మేర పెరిగి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది.కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. ఇటీవలే జరిగిన కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం 8:5 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేసేందుకు ఆమోదం తెలిపారు. అంటే అర్హత గల షేర్ హోల్డర్లకు ప్రతి 5 షేర్ల కొనుగోలు చేస్తే 8 షేర్లు బోనస్ రూపంలో ఉచితంగా అందిస్తారు. రికార్డు తేదీ నాటికి ఈ కంపెనీలో షేర్లు కలిగి ఉన్న వారికి బోనస్ షేర్లు లభిస్తాయి. అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించేందుకు ఆగస్టు 28, 2025 రోజును రికార్డు తేదీగా నిర్ణయించింది కంపెనీ. అంటే ఆగస్టు 27వ తేదీన మార్కెట్లు ముగిసేనాటికి షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అప్పుడే బోనస్ షేర్లు అందుకునేందుకు అర్హత లభిస్తుంది.

బోనస్ షేర్లు ప్రకటించిన క్రమంలో ఈ స్టాక్ లాభాల్లో ట్రేడవుతోంది. శుక్రవారం ఆగస్టు 22వ తేదీన స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో 5 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ రూ. 165.10 టచ్ చేసింది. గత వారం రోజుల్లో ఆ స్టాక్ 12 శాతం లాభపడింది. గత మూడు నెలల్లో 22 శాతం మేర ర్యాలీ చేసింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 208, కనిష్ఠ ధర రూ. 109 వద్ద ఉన్నాయి. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ రూ. 65.86 కోట్ల వద్ద ఉంది. డీఎంఆర్ హైడ్రో ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీ మౌలిక సదపాయాల ప్రాజెక్టుల కోసం ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సర్వీసులు అందిస్తుంటుంది. హైడ్రో పవర్, జలాశయాలు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, టన్నెల్స్ సహా ఆయా రంగాల్లో సేవలందిస్తోంది.

అయితే ఈ కథనం ఇన్వెస్టర్లకు సమాచారం అందించేందుకే. కానీ, ఎలాంటి పెట్టుబడులను ప్రోత్సహించడం లేదు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారు పూర్తిగా తెలుసుకోవాలి. ఇందులో హైరిస్క్ ఉంటుంది. పెట్టుబడి మొత్తం కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

## ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవంనాడు ఉన్నతంగా జీవించిన వారి జీవిత గాథలను జెన్‌ఎస్ లైఫ్ వేడుకగా ఆచరణ



**ముంబై-నవభూమి:** భారతదేశంలో పెరుగుతున్న 60ం సముదాయానికి గౌరవాన్ని అర్పించేందుకు, ప్రపంచ సీనియర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, సీనియర్ల జీవితాలను సుసంపన్నం చేసేందుకు అంకితమైన జీవనశైలి యాప్ జెన్ ఎస్ లైఫ్ తమ ఒరిజినల్ పాడ్‌కాస్ట్ సిరీస్ కహానీ అభి బాకీ హైని ప్రకటించింది. ఈ సిరీస్ ఆగస్టు 29, 202025న ప్రత్యేకంగా షెమారూ లైఫ్‌స్టైల్ యూట్యూబ్ ఛానెల్‌లో ప్రసారం కానుంది. ఈ ఛానెల్‌కు 12 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. నేరుగా యూట్యూబ్‌లో విడుదల చేయడం ద్వారా, ఈ షో 60ం వయసు ఉన్న ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా వ్యూహాత్మకంగా రూపొందించారు.తన విలక్షణ స్వరం, ఆకట్టుకునే రూపం, ఆకర్షణీయమైన భారతీయ నటి, ప్రముఖ రేడియో జాకీతారాన రాజా, కహానీ అభి బాకీ హైకి హోస్ట్‌గా, ఇప్పటి వరకు ఎక్కడా చెప్పుకోని కథలను, ఫిల్టర్ చేయని, ప్రతిబింబాలకు తలుపులు తెరుస్తోంది. ఈ సిరీస్ 60ం ఏళ్లవారి జీవిత అనుభవాలు, జ్ఞానం, హాస్యం, వారి స్థిరత్వాలపై వెలుగుచల్లుతుంది. వారి కథలు కాలంతో పాటు రూపుదిద్దుకోగా, అవి నేటికీ చాలా సందర్భోచితంగా ఉన్నాయి. ట్రైలర్‌ను ఇక్కడ చూడండి: https://www.instagram.com/reel/DNnLJBqsk84/?igshRMTl0Z3JmZDNnMHBzMA3D`3D

ప్రతి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు షెమారూ లైఫ్‌స్టైల్ యూట్యూబ్ ఛానెల్‌లో కొత్త ఎపిసోడ్‌లు విడుదలవుతాయి. ఇందులో దివంగత ఊర్మిళా ఆషర్ (గుజ్జుబెన్), టికు తల్సానియా, రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా, పద్మశ్రీ భవన సోమయ, డాక్టర్ పవన్ అగర్వాల్, ప్రహ్లాద్ కక్కర్, సందీప్ సోపార్కర్, అయాజ్ మెమన్, బినోద్ ప్రధాన్, డారియస్ ష్రాఫ్, మధు రాజా, చిన్మయ్ సేన్‌గుప్తా, షమీమ్ అక్తర్, శశాంక ఘోష్, పుష్ప, సోహ్రాబ్ అర్దేషిర్ మరియు అవంతిక అకేర్కర్ వంటి విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన 17 మంది స్ఫూర్తిదాయక వ్యక్తులు పాల్గొంటారు. ప్రతి అతిథి వృద్ధాప్యం అనేది కథకు ముగింపు కాదని నిరూపించే ప్రత్యేకమైన జీవిత కథలను, దృక్పథాలను పంచుకుంటారు: ఇది చెప్పడానికి వేచి ఉన్న కొత్త అధ్యాయం.జనరల్ ఎస్ లైఫ్ వ్యవస్థాపకురాలు మీనాక్షి మీనన్ మాట్లాడుతూ, "ఈ ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం రోజు, మనం కేవలం వయస్సును మాత్రమే కాకుండా, మన పెద్దలు ప్రపంచానికి అందించిన అనుభవ సంపదను, ప్రేరణను వేడుకగా ఆచరించుకుంటాము. కహానీ అభి బాకీ హై అనేది 60ం ఏళ్ల వయసు ఉన్న వారిని నిమగ్నం చేసి వినిపించాలనే మా నిబద్ధతకు పొడిగింపు. ప్రతి కథలో లోతు, జ్ఞాపకాలు, ఆశ ఉంటాయి. గొప్ప జీవితాలను గడిపిన ఈ అద్భుతమైన సీనియర్లకు, వారు నిజంగా అర్హులైన స్పాట్‌లైట్‌ను ఈ పాడ్‌కాస్ట్ అందిస్తుంది. కథలనేవి తరాలకు వారధిగా నిలిచే శక్తి ఉందని మేము నమ్ముతున్నాము. ఈ సిరీస్‌ను చేసేందుకు మేము హృదయపూర్వక ప్రయత్నం చేశాము. ఆశ, స్థితిస్థాపకత, ప్రేమ మరియు జీవిత కథలను ఇవి మన కళ్ల ముందుకు తీసుకువస్తాయి" అని వివరించారు.ఈ పాడ్‌కాస్ట్‌ను ప్రఖ్యాత టెలివిజన్ నిర్మాత, రచయిత అనిర్బన్ భట్టాచార్య నిర్మించి, దర్శకత్వం వహించారు. ఆయన తన కథ చెప్పే శైలిని, నిర్మాణ నైపుణ్యాన్ని ఉపయోగించుకుని ఈ ప్రాజెక్టుకు తీసుకువస్తున్నారు. సృజనాత్మక ప్రయాణాన్ని ప్రతిబింబిస్తూ, అనిర్బన్ మాట్లాడుతూ, "కహానీ అభి బాకీ హైని నిర్మించడం ఒక సుసంపన్నమైన అనుభవం. మేము కదిలించే, హాస్యభరితమైన, వ్యామోహపూరితమైన, వాస్తవికమైన కథలను సేకరించాము. ప్రతి ఒక్కటీ బాగా జీవించిన వారి జీవితాన్ని ఒక కిటికీ ద్వారా చూపిస్తుంది. ఈ కథలు శక్తివంతమైనవి, వ్యక్తిగతమైనవి. ప్రపంచం వాటిని ఆలకించేందుకు అర్హమైనవి" అని తెలిపారు.వినండి, నవ్వండి, ప్రేరణ పొందండి అని జెన్ ఎస్ లైఫ్ మిమ్మల్ని ఆహ్వానిస్తుంది- ఎందుకంటే కథ ఉన్న ప్రతి సీనియర్ కోసం, కహానీ అభి బాకీ హై. ఈ కాలాతీత స్వరాల నుంచి ప్రేరణ పొందేందుకు 29 ఆగస్టు 2025 నుంచి షెమారూ లైఫ్‌స్టైల్ యూట్యూబ్ ఛానెల్‌కు ట్యూన్ చేయండి.

## ఈ ఏడాదే భారత్‌లో ఓపెన్ ఏఐ కార్యాలయం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది చివరిలో ఢిల్లీలో తమ తొలి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఓపెన్ ఏఐ కంపెనీ తెలిపింది. చాట్ జీపీటీ సహా ఏఐ ఆధారిత ఓపెన్ ఏఐ టూల్స్‌కు అమెరికా తర్వాత భారత్ రెండో అతి పెద్ద మార్కెట్‌గా మారింది. దీంతో భారత్‌లోనూ కార్యాలయం ఏర్పాటు చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఈ కార్యాలయంలో పని చేసేందుకు అవసరమైన ఉద్యోగుల నియామక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించినట్టు వెల్లడించింది. తమ ఏఐ టూల్స్‌కు భారత్‌లో వేగంగా పెరుగుతున్న గిరాకీని తట్టుకునేందుకు ఈ కార్యాలయం తోడ్పడుతుందని ఓపెన్ ఏఐ భావిస్తోంది.

## వచ్చేనెల 3 4 తేదీల్లో జీఎస్‌టీ మండలి భేటీ




**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్‌టీ మండలి వచ్చే నెల 3-4 తేదీల్లో సమావేశం కానుంది. రేట్ల హేతుబద్ధీకరణ, పరిహార సుంకం, బీమాపై ఏర్పాటైన మంత్రుల బృందాల సిఫారసులపై ఈ సమావేశంలో జీఎస్‌టీ మండలి చర్చించనుంది. కేంద్రం ఆర్థిక మంత్రితోపాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు ఈ మండలిలో సభ్యులుగా ఉన్నారు. జీఎస్‌టీ మలి తరం సంస్కరణల్లో భాగంగా దీపావళి నాటికి పన్ను రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం శ్లాబులున్నాయి. వాటిని 5, 18 శాతం శ్లాబులకు కుదించి.. పొగాకు, ఆల్కహాల్ వంటి 5-7 రకాల ఉత్పత్తులపైన మాత్రం 40 శాతం ప్రత్యేక రేటును విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే, వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను జీఎస్‌టీ నుంచి పూర్తిగా మినహాయించాలని కూడా మోదీ సర్కారు ప్రతిపాదించింది. ప్రస్తుతం బీమా పాలసీలపై జీఎస్‌టీ రేటు 18 శాతంగా ఉంది.

## ఎడెల్‌వీజ్ అసెట్ మేనేజ్‌మెంట్‌లో వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్‌కు వాటా




**న్యూఢిల్లీ-నవభూమి:** ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్‌లో 15% వాటాను అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ రూ.450 కోట్లకు కొనుగోలు చేయనుందని ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఎఫఎసఎల్) శుక్రవారం వెల్లడించింది. ఈ లావాదేవీలో భాగంగా కంపెనీ మొత్తం విలువను రూ.3,000 కోట్లుగా లెక్కగట్టారు. ఈఎఫఎసఎల్ కీలక వ్యాపారాల్లో ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ ఒకటి. ఈ జూన్ 30 నాటికి ఈ కంపెనీ రూ.1.52 లక్షల కోట్ల విలువైన ఫండ్ ఆస్తులను నిర్వహిస్తోంది. గత ఐదేళ్లలో ఆస్తుల విలువ ఏటా 44 శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది.

## కొత్త ఆదాయపు పన్ను చట్టం..అమలు తేదీ ఖరారు




**ముంబై-నవభూమి:** భారత ప్రభుత్వం కొత్త ఇంకమ్ ట్యాక్స్ చట్టం 2025ను అధికారికంగా ప్రకటించింది. ఇది ఇప్పటికే దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా ఉన్న 1961 నాటి ఇంకమ్ ట్యాక్స్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి, కొత్తగా తీసుకొచ్చిన చట్టం. ఈ కొత్త చట్టానికి ఆగస్టు 21న రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఈ కొత్త చట్టం ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి రానుందని ప్రకటించారు.ఈ కొత్త చట్టంలో కొత్త పన్ను రేట్లు ఏమీ లేవు, కానీ భాషని సరళంగా మార్చారు. పాత చట్టంలో 819 సెక్షన్లు, 47 చాప్టర్లు, 5.12 లక్షల పదాలు ఉండేవి. కొత్త చట్టంలో ఇవి 536 సెక్షన్లు, 23 చాప్టర్లు, 2.6 లక్షల పదాలకు తగ్గించారు. అంటే చట్టం చిన్నగా, ఈజీగా మార్పు చేశారు.ఈ మార్పులు చిన్నవి కావని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇది పన్ను విధానాన్ని సులభతరం చేసే కొత్త విధానం. చట్టం సులభంగా చదవడానికి, అర్థం చేసుకోవడానికి, అమలు చేయడానికి రూపొందించ బడిందని తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | ఆదివారం | 24 । ఆగస్టు । 2025





# ఫిల్మ్ నగర్ టెంపుల్.. మిస్టర్ బచ్చన్ బ్యూటీకి చాలా స్పెషల్!

మిస్టర్ బచ్చన్ బ్యూటీ.. అదేనండీ భాగ్యశ్రీ బోర్సే. మాస్ మహారాజా రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ మూవీతో టాలీవుడ్ లోకి వచ్చింది అమ్మడు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఆ సినిమా డిజాస్టర్ అయినప్పటికీ బ్యూటీ అందరినీ ఫిదా చేసిందని చెప్పాలి. తొలి చిత్రంలోనే గ్లామర్ షోతో పాటు అభినయంతో కట్టిపడేసింది వయ్యారి. ఆ తర్వాత రీసెంట్‌గా స్టార్ హీరో విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మూవీలో నటించగా.. ఆ సినిమా కూడా అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేదు. అది పక్కన పెడితే.. భాగ్యశ్రీకి సరైన గుర్తింపు ఉన్న రోల్ దక్కలేదు. మేకర్స్ స్క్రీన్ స్పేస్ కూడా ఇవ్వలేదు. అయితేనేం ఉన్న కాసేపు అయినా.. తన అందంతో వయ్యారి ఫిదా చేసిందనే చెప్పాలి. స్టార్ హీరో విడాకులపై ఫ్యామిలీ లాయర్ కామెంట్ అయితే తెలుగులో తొలి రెండు చిత్రాలు హిట్ అవ్వకపోయినా.. ఆమె క్రేజ్ మాత్రం అలానే ఉంది. వరుస ఆఫర్స్ ఆమె సొంతమవుతున్నాయి. హీరోయిన్ గా బ్యూటీ మూడో చిత్రం ఆంధ్రా కింగ్ తాలూకా.. నవంబర్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎనర్జిటిక్ రామ్ నటిస్తున్న ఆ సినిమాలో కాలేజీ అమ్మాయి రోల్‌లో సందడి చేయనుంది. ఆ తర్వాత మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తెలుగు-మలయాళ ద్విభాషా చిత్రం కాంతలో నటిస్తున్న అమ్మడు.. అక్కినేని అఖిల్ లెనిన్ మూవీకి కూడా వర్క్ చేస్తోంది. ఇప్పటి వరకు ఒక్క హిట్ అందుకోకపోయినా.. వరుస ప్రాజెక్టుల్లో యాక్ట్ చేస్తూ బిజీగా గడుపుతోంది. భారీ విజయాలు సొంతం చేసుకోవాలని చూస్తోంది. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. భాగ్యశ్రీ తన హృదయానికి దగ్గరగా ఉన్న ఆలయానికి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు.



## రెడ్ అలర్ట్.. కుమ్మేసిన పరమ్ సుందరి!



ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఈమధ్య తన అందంతోనే కాదు నటనతో కూడా అందరిని ఆకట్టుకుంటోంది . దీనికి తోడు భాషతో సంబంధం లేకుండా వరుసగా అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిన ఈమె హిందీలో తాజాగా నటించిన చిత్రం 'పరమ్ సుందరి'. బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్ర ప్రధాన పాత్రలో రాబోతున్న ఈ ప్రేమ కథ చిత్రాన్ని తుషార్ జలోటా తెరకెక్కించారు. ఇటీవలే ఈ సినిమా నుండి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. రెడ్ అలర్ట్ అంటూ హుక్ స్టెప్ తో అదరగొట్టేసిన జాన్వీ ఈనెల 29వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ప్రమోషన్స్ కార్యక్రమాలను వేగంగా చేపట్టారు చిత్ర బృందం. అందులో భాగంగానే 'డేంజర్' అనే మరో పాటను అభిమానులతో పంచుకుంది చిత్ర బృందం. ఇందులో "రెడ్ అలర్ట్ " అంటూ మొదలైన ఈ గీతంలో హుక్ స్టెప్పులతో సిద్ధార్థ్ మల్హోత్రా , జాన్వీ కపూర్ అదరగొట్టేశారు.. మునుపెన్నడూ చూడని పెర్ఫార్మెన్స్ జాన్వీ లో కనిపించింది అని.. ప్రతి ఒక్కరూ కామెంట్లు చేస్తున్నారు. "నువ్వు సుందరివే కానీ నీ ఎరుపు రంగు చీరే ప్రమాదకరంగా కనిపిస్తోంది" అని తన ప్రేయసితో సిద్ధార్థ్ కబుర్లు చెప్పడం హైలైట్ గా నిలిచింది. మొత్తానికి అయితే ఈ పరమ్ సుందరి అందంతోనే కాదు హుక్ స్టెప్పులతో కూడా అదరగొడుతూ మెస్మరైజ్ చేస్తోందని చెప్పవచ్చు. ట్రైలర్ తో రికార్డు సృష్టించిన పరమ్ సుందరి.. పరమ్ సుందరి సినిమా విషయానికి వస్తే.. తుషార్ జలోటా దర్శకత్వంలో సిద్ధార్థ్ మల్హోత్రా , జాన్వీ కపూర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం పరమ్ సుందరి. జూలై 25న విడుదల కావాల్సిన ఈ సినిమా పలు కారణాల వల్ల వాయిదా పడి ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. మ్యాడాక్ ఫిలిమ్స్ బ్యానర్ పై దినేష్ విజన్ నిర్మించిన ఈ సినిమాను సుమారుగా రూ.60 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించారు. ఇప్పటికే పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న ఈ సినిమా విడుదలయ్యాక ఇంకెన్ని రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి. అటు ఇటీవల విడుదలైన ట్రైలర్ కి కూడా సుమారుగా 40 మిలియన్ కి పైగా వ్యూస్ రావడం గమనార్హం. జాన్వీ కపూర్ విషయానికి వస్తే.. దివంగత నటీమణి శ్రీదేవి కూతురిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఒకవైపు బాలీవుడ్ లో సినిమాలు చేస్తూనే.. మరొకవైపు పలు యాడ్స్ లో చేస్తూ మరింత క్రేజ్ దక్కించుకుంది ఈ ముద్దుగుమ్మ. బాలీవుడ్ లో సినిమాలలో నటిస్తున్నప్పుడే ఇటు దేవర సినిమాలో హీరోయిన్ గా అవకాశం అందుకుంది. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన ఈ సినిమా కమర్షియల్ గా భారీ విజయం అందుకుంది. ఈ సినిమాలో పల్లెటూరి అమ్మాయి పాత్రలో జాన్వీ చాలా చక్కగా ఒదిగిపోయిందని చెప్పవచ్చు. అలాగే సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమాలో కూడా హీరోయిన్గా చేస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చిలో విడుదల కాబోతున్న విషయం తెలిసిందే.

## రీ రిలీజ్‌లో బిగ్ డిజాస్టర్



టాలీవుడ్‌లో రీ రిలీజ్ ట్రెండ్ ఇప్పుడు కామన్ అయింది. చిన్న సినిమాలు కానీ, పెద్ద సినిమాలు కానీ స్టార్ హీరోల పాత హిట్స్‌ని మళ్లీ థియేటర్లలో చూపించి ఫ్యాన్స్‌కి ఫెస్ట్ ఇవ్వడం ఆచారంగా మారిపోయింది. చాలా సందర్భాల్లో ఈ రీ రిలీజ్‌లు మంచి రికార్డులు కూడా సాధించాయి. కానీ అన్ని సినిమాలు అదే రేంజ్ రిస్పాన్స్‌ను అందుకోవడం లేదు. ఈ సారి మెగాస్టార్ చిరంజీవి సినిమాకు సంబంధించిన రీ రిలీజ్ ఫలితం మాత్రం పూర్తిగా నిరాశపరిచింది. మెగాస్టార్ చిరంజీవి 70వ బర్త్‌డే సందర్భంగా పాత సినిమా స్టాలిన్‌ని 4 వెర్షన్‌లో రీ రిలీజ్ చేశారు. ఫ్యాన్స్‌కి ఇది ఓ గిఫ్ట్ అవుతుందని అనుకున్నారు. కానీ ఆ అంచనాలకు విరుద్ధంగా ఆ సినిమాకు వచ్చిన రెస్పాన్స్ అంతగా లేకపోవడం షాకింగ్‌గా మారింది. స్టాలిన్ రీ రిలీజ్‌కు మొదటి రోజే ఫ్యాన్స్ నుండి పెద్ద రెస్పాన్స్ రాలేదు. కొన్ని షోలకు మాత్రమే డీసెంట్ ఆక్యుపెన్సీ కనిపించింది. అదికాక అనేక చోట్ల షోలు మొదలవ్వకముందే క్యాన్సిల్ అయ్యాయి. ఆడియన్స్‌లో ఎలాంటి ఆసక్తి కనిపించకపోవడంతో బుకింగ్స్ లేకపోవడం ప్రధాన కారణం. ఈ పరిస్థితి ఫ్యాన్స్‌కే షాక్ ఇచ్చింది. ఇకపోతే ఈ ఫలితాన్ని కొంతమంది ముందే ఊహించారు. ఎందుకంటే స్టాలిన్ అనౌన్స్ చేసినప్పటి నుంచే ఫ్యాన్స్‌లో హైప్ కనిపించలేదు. పోస్టర్లు, అప్‌డేట్స్‌తోనూ పెద్ద ఎక్సైట్మెంట్ రాలేదు. దాంతోనే రీ రిలీజ్ ఫలితం సాధారణంగా ఉంటుందని అప్పటికే చెప్పుకున్నారు కొందరు. ఇప్పుడు అదే నిజమైంది. స్టాలిన్ సినిమాను ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో 2006లో విడుదల చేశారు. అప్పట్లో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అంతగా ఆడలేదు. ఇక రీ రిలీజ్‌లో పెద్దగా మ్యాజిక్ ఏమి జరగలేదు. మొత్తానికి మెగాస్టార్ చిరంజీవి బర్త్‌డే స్పెషల్‌గా వచ్చిన స్టాలిన్ 4 రీ రిలీజ్ ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. రీ రిలీజ్ కలెక్షన్స్ లలో కనీసం టాప్ 20లో కూడా లేదని టాక్. వాల్తేరు వీరయ్య, భోళా శంకర్ వంటి సినిమాల తర్వాత మెగాస్టార్ నుంచి కొత్త ప్రాజెక్టుల కోసం ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఈ రీ రిలీజ్ అసలు హంగామా చేయలేకపోయింది. ఇక నెక్స్ట్ మెగాస్టార్ నుంచి అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న శివశంకర వరప్రసాద్ గారు అనే సినిమా రానుంది.

## గోవిందా- సునీతా విడాకులు



బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా వివాహ జీవితంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఆయన భార్య సునీతా అహుజా 38 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలకాలని కోర్టును ఆశ్రయించారు. హిందూ వివాహ చట్టం 1955 సెక్షన్ 13 (1) ప్రకారం విడాకుల కోసం ఆమె పిటిషన్ దాఖలు చేశారు. సునీతా తన పిటిషన్‌లో గోవిందాపై అక్రమ సంబంధం, శారీరక మానసిక హింస వంటి ఆరోపణలు చేసింది. గత కొన్ని నెలలుగా ఇద్దరూ వేరుగా ఉంటున్నారని సమాచారం. గోవిందా ముంబయిలోని బంగ్లాలో ఉంటుండగా, సునీతా అదే బంగ్లాకు ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో జీవిస్తున్నట్లు తెలిసింది. ఈ కేసు విషయంలో మే 25న గోవిందాకు సమన్లు జారీ కాగా, జూన్ నుంచి విచారణ ప్రారంభ మైందని సమాచారం. అయితే సునీతా తరుచుగా కోర్టుకు హాజరవుతుండగా, గోవిందా మాత్రం విచారణలకు హాజరు కావడం లేదని తెలిసింది. కొన్నిరోజుల క్రితం తన యూట్యూబ్ వ్లాగ్ ద్వారా సునీతా తన మనోవేదనను వ్యక్తం చేసింది. "గోవిందాను ప్రేమించి పెళ్లి చేసుకున్నా. ఇద్దరు బిడ్డలు దేవత ప్రసాదంగా పుట్టారు. కానీ జీవితంలో ప్రతీ విషయం తియ్యగా ఉండదు. ఈ రోజు నేను ఎదుర్కొంటున్న బాధ నుంచి దేవీ కాళీ నన్ను కాపాడుతుందని నమ్ముతున్నా" అంటూ తన బాధను బయటపెట్టింది. అంతేకాక, "ఒక మంచి వ్యక్తిని, ఒక మంచి మహిళను ఇంతలా బాధ పెట్టడం సరైనది కాదు. నా కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే వారిని దేవత వదిలిపెట్టదు" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించింది. గోవిందా 30 ఏళ్ల మరాఠీ నటితో సన్నిహితంగా ఉన్నట్టు గతంలో ప్రచారం జరిగింది. ఆమె వల్లే గోవిందా, సునీతా మధ్య దూరం పెరిగిందన్న టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఒకానొక సమయంలో ఎక్కడికైనా భార్యను వెంట తీసుకెళ్లే గోవిందా, గత కొన్ని నెలలుగా ఆమెతో కలిసి పబ్లిక్‌లో కనిపించకపోవడం ఈ ప్రచారాలకు బలం చేకూర్చింది. సునీతా, గోవిందా 1987లో ప్రేమ వివాహం చేసుకున్నారు. గోవిందా కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో పెళ్లి విషయాన్ని నాలుగేళ్ల పాటు గోప్యంగా ఉంచారు. కుమార్తె నర్మదా (టీనా) అహుజా జననంతో పాటు తమ వివాహాన్ని బహిర్గతం చేశారు. ఈ పరిణామాల మధ్య, గోవిందా తరఫు న్యాయవాది లలిత్ బింద్రా స్పందిస్తూ సరికొత్త వాదన వినిపించారు. వారిద్దరి మధ్య సమస్యలేమి లేవు. అంతా బాగానే ఉంది. కావాలనే ఎవరో పాత విషయాలని తెరపైకి తెచ్చారు. గణేష్ చతుర్థికి మీరందరూ వారిని జంటగా చూస్తారు అని ఆయన ఓ జాతీయ మీడియాతో అన్నారు.

## మోక్షజ్ఞ మిస్సయినా ఘట్టమనేని హీరోతో జాక్ పాట్



మేటి కథానాయిక రవీనా టాండన్ పరిచయం అవసరం లేదు. నందమూరి బాలకృష్ణ బంగారు బుల్లోడు చిత్రంలో గ్లామరస్ యాక్ట్‌తో హృదయాలను కొల్లగొట్టింది ఈ బ్యూటీ. 90ల నాటి యూత్ కలల రాణిగా వెలిగిపోయింది. అందానికి అందం, డ్యాన్సింగ్ ట్యాలెంట్ తో ఈ బ్యూటీ బాలీవుడ్ ని ఏలింది. అందుకే రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ టాలీవుడ్ ఎంట్రీ పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దేవగన్ మేనల్లుడితో ఎంట్రీ.. రాషా ఇప్పటికే ఆజాద్ అనే చిత్రంతో బాలీవుడ్ లో కథానాయికగా పరిచయమైంది. ఈ చిత్రంలో అజయ్ దేవగన్ మేనల్లుడు అమన్ దేవగన్ సరసన నాయికగా నటించింది. ఈ చిత్రంలో ఉయ్ అమ్మా...పాటతో ఒక ఊపు ఊపిన రాషా భవిష్యత్ పై చాలా అంచనాలేర్పడ్డాయి. కొద్దిరోజుల క్రితం నటసింహ నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ సరసన రాషా తడానీ కథానాయికగా పరిచయమవుతుందని ప్రచారమైంది. కానీ ఆ ప్రాజెక్ట్ అనూహ్యంగా ఆగిపోయిందని కథనాలొచ్చాయి. ఆ తర్వాత ఘట్టమనేని కుటుంబ హీరో జయకృష్ణ సరసన రాషా తడానీ కథానాయికగా ఎంపికైందని కూడా గుసగుసలు వినిపించాయి. తాజా సమాచారం మేరకు ఈ సినిమా త్వరలో చిత్రీకరణకు వెళ్లనుందని తెలుస్తోంది. మహేష్ కుటుంబ హీరో.. జయకృష్ణ మహేష్ అన్నగారైన ఘట్టమనేని రమేష్ బాబు కుమారుడు. అతడు నటన, డ్యాన్సులు, ఫైట్స్ లో పరిపూర్ణంగా శిక్షణ పొందాడు. ఆర్.ఎక్స్ 100 ఫేం అజయ్ భూపతి జయ కృష్ణను లాంచ్ చేస్తున్నారని, ప్రీ-ప్రొడక్షన్ కొనసాగుతోందని తెలిసింది. వైజయంతి మూవీస్- ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. కాస్టింగ్ సహా క్రూ గురించి ఇంకా వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. టైటిల్ ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. టాలీవుడ్ లో బడా ఫ్యామిలీస్ నుంచి వస్తున్న నటవారసుల సరసన రాషా అవకాశాలు అందుకోవడం ఆసక్తిని కలిగిస్తోంది. తదుపరి నందమూరి మోక్షజ్ఞ సరసన కూడా రాషాకు అవకాశం ఉంది. మోక్షజ్ఞ ప్రస్తుతం తన రూపాన్ని మార్చుకుని స్మార్ట్‌గా కనిపిస్తున్నాడు. అతడు పూర్తిగా స్లిమ్ అయ్యాడు. ఈ ఏడాది చివరి నాటికి హీరోగా తన డెబ్యూ చిత్రాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

## నగరం నడిబొడ్డున ఐదెకరాల్లో నరేష్ కొత్త ఇల్లు.. ఎన్ని కోట్లు ఖర్చు చేసి ఉంటాడో..!



సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన సీనియర్ నటుడు నరేష్ తాజాగా మరోసారి వార్తల్లోకి ఎక్కారు. ఈసారి నటనతో కాక, తన అభిరుచి మేరకు నిర్మించుకున్న విలాసవంతమైన ఇంటి కారణంగా. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఏకంగా ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ స్వగృహం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల నరేష్ – పవిత్ర లోకేష్ జంట వారి కొత్త ఇంటి గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీనటులు మురళీమోహన్, అలీతో పాటు పలువురు పరిశ్రమ ప్రముఖులు హాజరయ్యారు. నరేష్ ఆధ్వర్యంలో అతిథులకి ఘనంగా ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా ఇంట్లోకి ఎంట్రీ మొదలుకొని మాస్టర్ బెడ్‌రూమ్స్, కిచెన్, జిమ్, వరండాలు, ల్యాండ్‌స్కేప్ గార్డెన్స్ వరకు అన్నీ సందర్శకుల్ని ఎంతగానో మెప్పించాయి. నరేష్ తన ఇంటిని అత్యంత విశిష్టంగా తీర్చిదిద్దించుకున్నాడు. ప్రత్యేకంగా డిజైన్ చేయించిన వరండాలో ఉన్న భారీ వరల్డ్ మ్యాప్ మరింత ఆకర్షణగా నిలుస్తోంది. ఇది నరేష్ గ్లోబల్ దృష్టిని ప్రతిబింబించే అంశంగా మారింది. ఈ ఇంటి లాంచింగ్ అనంతరం నరేష్ ఆస్తుల విలువపై చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. దివంగత విజయనిర్మలకు ఏకైక వారసుడిగా ఉన్న నరేష్‌కు భూసంపదతో పాటు, సినీ పరిశ్రమలో తన సుదీర్ఘ ప్రయాణంలో కూడగట్టిన సంపద మొత్తం కలిసి ఆయన ఆస్తుల విలువ రూ. 400 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. గచ్చిబౌలి సమీపంలోని విప్రో సర్కిల్ వద్ద విజయనిర్మలకి సంబంధించిన ఐదు ఎకరాల ఫామ్ హౌస్ విలువ ఏకంగా రూ. 300 కోట్లు అని సమాచారం. అలాగే మొయినాబాద్, శంకరపల్లి పరిసరాల్లో మరో 30 ఎకరాల ఫామ్ ల్యాండ్స్ ఉండగా, వాటి విలువ కూడా రూ. 100 కోట్లకు పైగా ఉంటుంది. తన నూతన గృహాన్ని పూర్తిగా ఇంద్ర భవనాన్ని తలపించేలా డిజైన్ చేయించుకున్న నరేష్, అందులో తన జీవితప్రస్థానాన్ని ప్రతిబింబించే అంశాలను జోడించాడు. ఇది కేవలం ఇల్లు కాదు, నరేష్ జీవన శైలిని, అభిరుచిని తెలిపే ఒక కళాఖండంగా మారింది. ఈ ఇంటి విలువ కోట్లలోనే ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం నరేష్ కొత్త ఇంటి వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఆయన అభిమానులను, సినీ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

## అదే తప్పు మళ్లీ మళ్లీ చేస్తున్న కీర్తి సురేష్..ఉన్న పేరు చెడగొట్టుకుంటుందా?



సినిమా ఇండస్ట్రీలోకి ఎన్నో ఆశలు, కలలతో వచ్చేవారు చాలా మంది ఉంటారు. ఒకటి రెండు హిట్లు రావడం సరే కానీ ఆ క్రేజ్‌ను నిలబెట్టుకోవడమే నిజమైన సవాలు. ఒకసారి మనం అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోయి పర్లేదు, కానీ ఉన్న పేరు కూడా దెబ్బతింటే, మళ్లీ మునుపటిలా ఎదగడం అసాధ్యమే. ఈ తరహా పరిస్థితులను ఇప్పుడు కీర్తి సురేష్ ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. 2018లో వచ్చిన మహానటి సినిమాతో ఆమె సినీ పరిశ్రమలో ఒక మైలురాయిగా నిలిచింది. సావిత్రిగా చేసిన ఆమె పోషణ, నటనకు విమర్శకులు, ప్రేక్షకుల నుంచి అపారమైన ప్రశంసలు వచ్చాయి. అదే సినిమా ఆమెకు జాతీయ పురస్కారాన్ని కూడా తీసుకొచ్చింది. అయితే ఆ తరువాత ఆమె కెరీర్ గమనం తగ్గుతూ వచ్చింది. కొన్ని మంచి సినిమాలు చేసినా, "మహానటి" స్థాయి హిట్ మాత్రం రాలేదు. "దసరా" వంటి సినిమాలతో మెప్పించినా, వాటి తర్వాత ఆమె కెరీర్ మరింత బలపడేలా మారలేదు. ఇప్పుడు తాజాగా తమిళ పరిశ్రమలో కీర్తి చేయబోతున్న ఒక కొత్త సినిమా గురించి వార్తలు వైరల్ అవుతున్నాయి. డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా ఒక కొత్త దర్శకుడు డైరెక్ట్ చేయబోతున్న ప్రాజెక్ట్‌గా సినీ వర్గాల్లో చెబుతున్నారు. ఇందులో కీర్తితో పాటు మరో హీరోయిన్ కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో ఆమె అభిమానుల్లో ఆందోళన మొదలైంది. "ఇలాంటి కథలు ఎంచుకోవడం, కొత్త దర్శకులతో పని చేయడం ఆమె స్థాయికి సరిపోయేదేనా?" అన్న చర్చ సాగుతోంది. ఇద్దరు హీరోయిన్స్ ఉన్న సినిమాలు, డిఫరెంట్ కాన్సెప్ట్ కీర్తికి ఎంత వరకు ఉపయోగపడతాయి అన్నది ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. కీర్తి నటించిన రివాల్వర్ రీటా విడుదలకు సిద్ధంగా ఉంది. మరో సినిమా కన్నె వేడి ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

## బెంగళూరు అవుట్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఊహించినట్టుగానే మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భాగంగా బెంగళూరులో జరగాల్సిన ఐదు మ్యాచ్‌లను తరలించారు. చిన్నస్వామి స్టేడియంలో వీటి నిర్వహణకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడంలో అక్కడి క్రికెట్ సంఘం (కేఎసీఏ) విఫలమైంది. దీంతో ఈ మ్యాచ్‌లన్నింటినీ నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియానికి తరలిస్తున్నట్టుగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం ప్రకటించింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో చాంపియన్‌గా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ ర్యాలీ కారణంగా స్టేడియం బయట తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది మృతి చెందడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించి చిన్నస్వామిలో ప్రస్తుతానికి మ్యాచ్‌లను నిషేధించింది. ఇక డీవై పాటిల్ స్టేడియంలో మూడు లీగ్ మ్యాచ్‌లు ఓ సెమీస్, ఫైనల్ జరగాల్సి ఉంది. కానీ టైటిల్ పోరు మాత్రం పాక్ జట్టు విజయాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ దాయాది జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్ కొలంబోలో నిర్వహిస్తారు. ఓవరాల్‌గా నవీ ముంబై, విశాఖపట్నం, గువాహటి, ఇండోర్, కొలంబోలో మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగుతుంది. మరోవైపు చిన్నస్వామి స్టేడియం వ్యవహారాన్ని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఓ కొలిక్కి తేలేకపోతే వచ్చే ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌లకు కూడా దూరం కావాల్సి ఉంటుంది. మరికొన్ని మార్పులు..: ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌లో ఐసీసీ కొన్ని వేదికలను మార్చింది. దీనిలో భాగంగా సెప్టెంబరు 30న ఆతిథ్య జట్లు భారత్-శ్రీలంక మధ్య జరగాల్సిన ఆరంభ మ్యాచ్‌ను బెంగళూరు నుంచి గువాహటికి తరలించారు. అక్టోబరు 3న ఇంగ్లండ్-దక్షిణాఫ్రికా మ్యాచ్ కూడా గువాహటిలోనే జరుగుతుంది. అంతేకాకుండా 10న కివీస-బంగ్లాదేశ్ మ్యాచ్‌ను వైజాగ్ నుంచి గువాహటికి మార్చారు. ఇక అదే నెల 20న జరిగే శ్రీలంక-బంగ్లాదేశ్ మ్యాచ్, 23న జరిగే భారత్-కివీస మ్యాచ్‌లను నవీ ముంబైకి మార్చారు. మొత్తంగా విశాఖలో ఐదు మ్యాచ్‌లు జరుగనుండగా.. భారత జట్టు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలతో ఇక్కడే ఆడనుంది.

## క్రికెట్‌కు గౌహర్ వీడ్కోలు



**హైదరాబాద్ -నవభూమి:** క్రికెట్‌కు హైదరాబాదీ లెఫ్టామ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానా వీడ్కోలు పలికింది. క్రికెటర్‌గా అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. 37 ఏళ్ల సుల్తానా 2008లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేసింది. 2009, 2013 వన్డే వరల్డ్‌కప్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆమె, కెరీర్‌లో 50 వన్డేలు, 37 టీ20లు ఆడి మొత్తం 95 వికెట్లు సాధించింది. 2014 తర్వాత జాతీయ జట్టులో చోటు కోల్పోయిన సుల్తానా తిరిగి 2024 మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ తరఫున మెరిసింది. ఈ ఏడాది కూడా వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆమె అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు దేశవాళీ పోటీలకు కూడా వీడ్కోలు పలికింది. కెరీర్ ఆసాంతం తనకు మద్దతుగా నిలిచిన కుటుంబ సభ్యులు, సహచర క్రికెటర్లు, కోచింగ్ సిబ్బంది, బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపింది. బీసీసీఐ లెవల్-2 శిక్షణ పూర్తి చేసిన సుల్తానా భవిష్యత్‌లో కోచ్‌గా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది.



## భారత్ ఎ 299 ఆలౌట్



**బ్రిస్బేన్-నవభూమి:** రాఘవీ బిస్త్ (93), జోషిత (51) అర్ధ శతకాలతో పోరాడడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఓవర్‌నైట్ 93/5 స్కోరుతో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 299 పరుగులకు ఆలౌటైంది. జార్జియా, బ్రౌన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా 'ఎ' రెండో రోజు ఆఖరికి 158/5 స్కోరుతో ఇక్కట్లలో పడింది. తహిలా విల్సన్ (49) రాణించింది. మీడియం పేసర్ సలీమా, స్పిన్నర్ రాధా యాదవ్ చెరో రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**